ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY



శనివారం, 14 నవంబర్ 2026 | Saturday 14 November 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 204 | Vol.No 28 Issue No .204 | www.visionandhra.in



భారత్ సమ్మిట్‌తో ప్రపంచ పటంలో
తెలంగాణ!

రాహుల్ రాకను అడ్డుకోవాలనుకుంటే అది తెలంగాణ ప్రజలపై కక్షే!

- - సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు!
- 70 దేశాలు, 1000 మంది ప్రతినిధులు,
- డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్!
- గిగ్ వర్కర్స్‌కు చరిత్రాత్మక భరోసా!
- కేంద్రం, బీజేపీ, బీఆర్ఎస్ తీరుపై సీఎం తీవ్ర ధ్వజం!

2034 నాటికి 1 ట్రిలియన్,
2047 నాటికి 3 ట్రిలియన్
ఎకానమీయే లక్ష్యం!



డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్!

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్,నవంబర్ 13, విజన్ ఆంధ్ర:

తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించే భారత్ సమ్మిట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటనలు చేశారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ భారత్ సమ్మిట్ కేవలం ఒక కార్యక్రమం కాదని, తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టే చారిత్రక అవకాశమని చెప్పారు. భారత్ సమ్మిట్ ద్వారా తెలంగాణ పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన రాష్ట్రమని ప్రపంచానికి చాటడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ నాయకులపై సీఎం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ప్రజలకు మేలు చేసే ఏ నిర్ణయం తీసుకున్నా ఆ రెండు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని, వారు వ్యతిరేకించేది కాంగ్రెస్‌ను కాదు, తెలంగాణ ప్రజలనేనని ధ్వజమెత్తారు. అభివృద్ధిని అడ్డుకోవడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం తప్ప వారికి మరో పని లేదని విమర్శించారు.

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని సీఎం ప్రకటించారు. హైదరాబాద్ వాతావరణం పెట్టుబడులకు ఎంతో అనుకూలమని, ఇక్కడ శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన యువత, స్థిరమైన ప్రభుత్వం, పారదర్శక విధానాలు ఉన్నాయని చెప్పారు. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీలు హైదరాబాద్ వైపు చూస్తున్నాయని, వారికి తెలంగాణలో ఉన్న అవకాశాలను చూపించడానికే గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఢిల్లీతో పాటు వివిధ ప్రాంతాల్లో కర్టెన్ రైజర్ కార్యక్రమాలు నిర్వహించామని, ముంబై, అహ్మదాబాద్‌లోనూ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నామని వెల్లడించారు. దేశంలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రాల్లో తెలంగాణ సత్తాను చాటుతున్నామని చెప్పారు. ప్రతి కర్టెన్ రైజర్‌కు పెట్టుబడిదారుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని తెలిపారు. 02

హైదరాబాద్‌కు
పెద్ద గండం!

డిసెంబర్ తర్వాత నీళ్లు లేవు!

- 42 రోజుల్లోనే సింగూరు, మంజీరా ఖాళీ!
- నగరం గొంతు ఎండబోతోంది!
- 7 నియోజకవర్గాల్లో తాగునీటి కటకట!
- శేరిలింగంపల్లికే అత్యధిక గండం!



తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 13, విజన్ ఆంధ్ర :

హైదరాబాద్ మహానగర ప్రజలకు షాకింగ్ న్యూస్! డిసెంబర్ వరకే నగరానికి నీళ్లు ఉన్నాయని జలమండలి అధికారులు తేల్చేశారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో ప్రస్తుత నీటిమట్టం ప్రకారం కేవలం 42 రోజులకు మాత్రమే సరిపడా నీళ్లు ఉన్నట్లు గుర్తించారు. అంటే ఇంకో నెలన్నరలోనే ఈ రెండు జలాశయాలు అడుగంటనున్నాయి. ఆ తర్వాత హైదరాబాద్‌కు తాగునీటి కొరత తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. 02



సచివాలయ క్యాంటీన్‌లో
కలకలం!

నాణ్యత లేని భోజనంపై ఉద్యోగుల తిరుగుబాటు!

- ఏజెన్సీని పక్కనపెట్టి సొసైటీయే నడపాలని పట్టు!
- ఈ నెలాఖరుకే సొసైటీ ఎన్నికలు!

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 13, విజన్ ఆంధ్ర :

తెలంగాణ సచివాలయంలో క్యాంటీన్ వ్యవహారం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. క్యాంటీన్ నడిపిస్తున్న కొడంగల్ కాంట్రాక్ట్ ఏజెన్సీ తీరుపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టిఫిన్, భోజనం నాణ్యత విషయంలో ప్రతిరోజూ ఏదో ఒక వివాదం జరుగుతోందని చెబుతున్నారు. వేలాది మంది ఉద్యోగులు పనిచేసే సచివాలయంలో చాలామంది క్యాంటీన్‌పైనే ఆధారపడతారు. ఉదయం టిఫిన్ నుంచి మధ్యాహ్నం భోజనం వరకు అన్నీ ఇక్కడే తింటారు. అయితే గత కొంతకాలంగా భోజనం నాణ్యత దారుణంగా పడిపోయిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. నిల్వ అన్నం, నూనె ఎక్కువగా ఉన్న కూరలు, సరిగా ఉడకని పదార్థాలు వస్తున్నాయని, తిన్న తర్వాత అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వాపోతున్నారు.శుభ్రత విషయంలో కూడా పట్టింపు లేదని, వంటగది, ప్లేట్లు, తాగునీరు విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఫిర్యాదులు చేస్తున్నారు. 02

కూకట్ పల్లి భూమి అమ్మితే
ఊరుకోం!

- వేలం వేసేవారికి హరీష్ రావు స్ట్రాంగ్ వార్నింగ్!

- ప్రజా భూమి.. ప్రజలకే! వేలం ఆడితే ఊరుకోం!
- స్థానికులకు అండగా నిలిచిన హరీష్ రావు, కేపీ వివేకానంద!

తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 13, విజన్ ఆంధ్ర:

కూకట్‌పల్లిలో ట్రక్ పార్క్ భూముల అమ్మకం వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారం రేపుతోంది. ప్రజా అవసరాల కోసం కేటాయించిన విలువైన ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం వేలానికి పెట్టడంపై స్థానికులు భగ్గుమంటున్నారు. వారి నిరసనకు మద్దతుగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్ రావు రంగంలోకి దిగారు.



గురువారం కూకట్‌పల్లి ట్రక్ పార్క్ స్థలాన్ని హరీష్ రావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఇతర బీఆర్ఎస్ నాయకుల బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. భూమి విస్తీర్ణం, అక్కడ ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, స్థానికుల అవసరాల గురించి నేరుగా అడిగి తెలుసుకున్నారు. 02

బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : నవభారత నిర్మాత, భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా 02

తల తాకట్టుపెట్టైనా సరే..
ఇందిరమ్మ ఇళ్లను ఆపం!

- జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్‌కు ఘనంగా శంకుస్థాపన!
- ఒక్కో ఫ్లాట్ విలువ రూ.50-60 లక్షలు!
- ఏడాదిలోనే పూర్తి!

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 13, విజన్ ఆంధ్ర:

పేదల సొంత ఇంటి కలను నెరవేర్చే విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గబోదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, తల తాకట్టుపెట్టే పరిస్థితి వచ్చినా సరే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఆపబోమని ఆయన గట్టిగా ప్రకటించారు. పేదలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని చెప్పారు.

హైదరాబాద్‌లోని జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లిలో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌కు గురువారం మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన



పేదల ఇంటి కల కోసం ఎంతకైనా సిద్ధం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి!



ఇందిరమ్మ ఇళ్లు అంటే పేదల ఆత్మగౌరవం!

ఇందిరమ్మ ఇళ్లు కేవలం ఒక పథకం మాత్రమే కాదని, అది పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని పొంగులేటి అన్నారు. సొంత ఇల్లు లేని వారి బాధ ఏంటో తమకు తెలుసని, అద్దె ఇళ్లలో, గుడిసెల్లో, రేకుల షెడ్లలో బతుకుతున్న పేద కుటుంబాల కష్టాలను చూసే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకువచ్చామని చెప్పారు.
గత ప్రభుత్వం పదేళ్ల పాటు పేదలకు ఇళ్లు కట్టకుండా మోసం చేసిందని పొంగులేటి విమర్శించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో కేవలం హామీలకే పరిమితం అయ్యారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఇళ్ల నిర్మాణ 02

ఎదురుచూపులకు
తెర!

5.73 లక్షల మందికి పింఛన్ పత్రాలు

- గ్రామ గ్రామాన సంబరాలు!
- తెలంగాణలో పింఛన్ల పండుగ!
- నవంబర్ 19న ఖాతాల్లోకి డబ్బులు!

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్,నవంబర్ 13,విజన్ ఆంధ్ర :

తెలంగాణ రాష్ట్రంలో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మందికి ప్రభుత్వం శుభవార్త అందించింది. కొత్తగా 4.5 లక్షల మంది అర్హులకు చేయూత పథకం కింద పింఛన్లు మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 12 నుంచి కొత్త లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ ప్రక్రియ నవంబర్ 18వ 02

బదిలీ కాదు.. విచారణే కావాలి!


'యూనిఫాంలో ఉన్న నేరస్థుడు' సజ్జనార్‌పై నాగేశ్వరరావు సంచలన డిమాండ్!

- సీఎం రేవంత్, డీజీపీ సీవీ ఆనంద్‌కు కృతజ్ఞతలు!, ● హైదరాబాద్ పోలీస్ వర్గాల్లో పెద్ద చర్చ!

తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్,నవంబర్ 13, విజన్ ఆంధ్ర:



హైదరాబాద్ సీపీ పదవి నుంచి వీసీ సజ్జనార్‌ను బదిలీ చేయడం తెలంగాణలో ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. ఈ బదిలీపై మాజీ సీబీఐ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు చేసిన సంచలన వ్యాఖ్యలు పోలీస్ వర్గాల్లో, రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. సజ్జనార్‌ను బదిలీ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్‌కు ఆయన బహిరంగంగా కృతజ్ఞతలు తెలిపారు. 02



నాటి ఆలోచన మార్చుకున్నా..

జనాభా విధానంపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

- ఏపీలో 1.5కు పడిపోయిన సంతానోత్పత్తి రేటు
- ఎక్కువ మంది పిల్లలను కనేలా ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- జపాన్ తరహా సంక్షోభాన్ని నివారించేందుకే విధాన మార్పు
- పాలసీ అమలు కష్టమైనా వెనక్కి తగ్గేది లేదన్న సీఎం
- జీవన వ్యయం నిరుద్యోగం వల్ల విధానంపై మొదలైన చర్చ

అమరావతి, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) :

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర జనాభా విధానంలో తీసుకువచ్చిన వ్యూహాత్మక మార్పుపై కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో అమలు చేసిన కుటుంబ నియంత్రణ విధానాల నుంచి బయటకు వచ్చి, ఎక్కువ మంది పిల్లలను కనేలా 11




నా ఫోన్‌ను మోదీ ట్యాప్ చేస్తున్నారు..

రాహుల్ గాంధీ సంచలన ఆరోపణ

- మోదీతో ముఖాముఖి చర్చకు రాహుల్ మరోసారి సవాల్
- పార్లమెంటులో తన మైక్ నిలిపివేస్తున్నారన్న ప్రతిపక్ష నేత
- కీలక అంశాలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదని విమర్శ
- ఢిల్లీ కాలుష్యాన్ని ప్రస్తావిస్తూ, ప్రధాని ఏసీ గది నుంచి బయటకు రావాలని వ్యాఖ్య
- మోదీ తన విషయంలో ఆచితూచి మాట్లాడుతున్నారని వ్యాఖ్య

ఢిల్లీ, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) :
తన ఫోన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాలతో ట్యాప్ చేస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. విదేశీ శక్తుల సాయంతో దేశంలో అరాచకం 02



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సీఎం చంద్రబాబుపై మండిపడ్డ వైఎస్ షర్మిల

- రాష్ట్రంలో ఫీజు బకాయిలు రూ.6,400 కోట్లు దాటాయన్న షర్మిల
- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో క్లియర్ చేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్న
- ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్

అమరావతి, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) :ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ 02

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సీఎం చంద్రబాబుపై మండిపడ్డ వైఎస్ షర్మిల

అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఈ పథకం నిర్వీర్యమైపోయిందని, ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. వైఎస్సార్ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేదవాడి చదువుకు పండుగలా ఉండేదని గుర్తుచేశారు. నేడు చంద్రబాబు పాలనలో అదే పథకం వేల కోట్ల బకాయిలతో చదువంటేనే దండుగగా మారిపోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఈ పథకం బకాయిలు రూ.6,400 కోట్లు దాటిపోయాయని, అందులో గత మూడేళ్లలోనే రూ.6,000 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఆమె తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని షర్మిల దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని బకాయిలు క్లియర్ చేస్తామని, నేరుగా కాలేజీల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? అని ఆమె నిలదీశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు దక్కక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని భారీ ప్రచారాలు చేసుకుంటూ, మరోవైపు పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెంచుకుంటూ పోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నా ఫోన్‌ను మోదీ ట్యాప్ చేస్తున్నారు..

సృష్టించేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారంటూ బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలకు ఆయన ఈ వ్యాఖ్యలతో బదులిచ్చారు. తన ఫోన్‌లోనే ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ అధికారిక ఎక్స్ ఖాతాలో విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు. ప్రధాని మోదీతో ముఖాముఖి చర్చకు రావాలన్న సవాలును రాహుల్ మరోసారి పునరుద్ఘాటించారు. ఆ చర్చకు మోదీ వస్తే ఎవరు విదేశీ శక్తుల నియంత్రణలో ఉన్నారు? ఎవరు దేశ వ్యతిరేకి? అన్న విషయాలు బయటపడతాయని అన్నారు. చర్చ జరిగితే ప్రధాని రాజకీయ జీవితం ముగిసిపోతుందని వ్యాఖ్యానించారు. తాను ప్రసంగాల రూపంలో సాగే చర్చను కోరుకోవడం లేదని, ఇద్దరి మధ్య నేరుగా చర్చ జరగాలని స్పష్టం చేశారు. పార్లమెంటులో చర్చకు ప్రయత్నించినా తన మైక్ నిలిపివేస్తున్నారని, మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదని రాహుల్ ఆరోపించారు. రైతు చట్టాలు, ఓట్ల చోరీ, ఎస్ఐఆర్, చైనా తదితర అంశాలపై తనకు మాట్లాడే అవకాశం రాలేదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో చర్చకు రావాలంటూ చేసిన సవాలుపై స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని ప్రస్తావిస్తూ.. ప్రధాని తన ఏసీ గది నుంచి బయటకు వచ్చి సామాన్యులు పీల్చే గాలిని పీల్చాలని రాహుల్ అన్నారు. తనపై మోదీ గతంలో మాదిరిగా విమర్శలు చేయడం లేదని, ఆచితూచి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. దీనికి కారణం ఆయన మనసులో ఉన్న భయమేనని రాహుల్ వ్యాఖ్యానించారు.

బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

నివాళులర్పించారు. చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 14న జరుపుకునే జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని బాలబాలికలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బాలల పట్ల నెహ్రూకు ఉన్న అపారమైన ప్రేమ, వారి భవిష్యత్తుపై ఆయనకున్న దూరదృష్టి, విద్యాభివృద్ధికి చేసిన కృషి చిరస్మరణీయమని సీఎం పేర్కొన్నారు. బాలలే దేశ సంపద, వారే భావి భారత పౌరులనే నెహ్రూ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, సమాన అవకాశాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. పిల్లల్లోని అంతర్లీన ప్రతిభను గుర్తించి, వారి సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ, ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, సమగ్ర అభివృద్ధి సాధ్యమని విశ్వసిస్తున్న ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పోషకాహారం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు అల్పాహార పథకం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, భద్రతతో కూడిన ఆహ్లాదకరమైన బాల్యాన్ని అందించినప్పుడే బలమైన, అభివృద్ధి చెందిన తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పిల్లల కలలను సాకారం చేయడం, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత కూడా అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఎదురుచూపులకు తెర!

తేదీ వరకు కొనసాగనుంది. అనంతరం నవంబర్ 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా పింఛన్ నగదునులి జమ చేయనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో పంపిణీ

ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకులి మంజూరు పత్రాలను అందజేస్తున్నారు. కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

వివిధ వర్గాలకు ప్రాధాన్యత

ఈ విడతలో లివృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, గీత కార్మికులు తదితర అర్హులైన వర్గాలకులి ప్రాధాన్యత కల్పించారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు నెలవారీ పింఛన్ ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం.

5.73 లక్షలకు చేరిన కొత్త లబ్ధిదారులు

గతంలో లికొత్తగా 1,23,625 మందికి పింఛన్లు మంజూరు చేయగా, తాజాగా మరో 4.5 లక్షల మందినిలి ఎంపిక చేశారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కొత్తగా పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య మొత్తం 5,73,625కులి చేరింది. రాష్ట్రవ్యాప్తంగా అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్నవారిని ఎంపిక చేశారు.

నవంబర్ 19న ఖాతాల్లోకి నగదు

కొత్తగా పింఛన్లు మంజూరైన వారు నవంబర్ 19వ తేదీ నుంచి తమ ఖాతాల్లో నగదు జమలి అయ్యే అవకాశం ఉండటంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ అనుసంధానం సక్రమంగా ఉన్నాయో లేదో ముందుగానే పరిశీలించుకోవాలని సూచిస్తున్నారు. కొత్త పింఛన్ల మంజూరుతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా ఊరట లభించనుంది. ముఖ్యంగా వృద్ధులు, భర్తను కోల్పోయిన మహిళలు, దివ్యాంగులకు ఈ పింఛన్లు కొంతమేర జీవనాధారంగా నిలవనున్నాయి.

పత్రిక ప్రకటన

గోద మల్లయ్య తండ్రి బాల్ రాజు గ్రామం సిద్దిపేట. 25-06-2026 తేదీ రోజు వరంగల్ నుండి సిద్దిపేటకు బస్సులో వస్తున్న సమయంలో డాక్యుమెంట్ పేపర్లు పోయినవి. డాక్యుమెంట్ నెంబర్ 3432/1982, ఎవరికైనా దొరికినచో మా నెంబర్ కు ఫోన్ చేయగలరు. సంప్రదించవలసిన నెంబర్: గోద యుగంధర్, తండ్రి మల్లయ్య, ఫోన్: 9676126680, సిద్దిపేట.

బదిలీ కాదు.. విచారణే కావాలి!

సజ్జనార్‌ను 'యూనిఫాంలో ఉన్న నేరస్థుడు'గా అభివర్ణించడం ఇప్పుడు సోషల్ మీడియాలో, మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మాజీ సహోద్యోగిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తనకు బాధాకరమైనప్పటికీ, ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని, అందుకే నిజం చెప్పక తప్పలేదని నాగేశ్వరరావు వెల్లడించారు.

బదిలీయే శిక్ష కాదు!

కేవలం బదిలీ చేయడం వల్ల శిక్ష కాదని, ఆరోపణలు కూడా తొలగిపోవని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సజ్జనార్‌పై ఉన్న ఆరోపణలు, ఆయన కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఒక అధికారిపై తీవ్రమైన ఆరోపణలు ఉంటే కేవలం ఒక పోస్టు నుంచి మరో పోస్టుకు మార్చడం పరిష్కారం కాదని, ప్రజలకు న్యాయం జరగాలంటే విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని అన్నారు.
ఒక ఉన్నత పోలీస్ అధికారిపై మరో ఉన్నత అధికారి, అందులోనూ సీబీఐ మాజీ డైరెక్టర్ స్థాయి వ్యక్తి ఇంత ఘాటుగా స్పందించడం అరుదైన విషయమని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. నాగేశ్వరరావు వ్యాఖ్యలు సాధారణమైనవి కావని, వాటి వెనుక ఎంతో నేపథ్యం ఉందని చర్చ జరుగుతోంది.

ఎందుకు ఈ వ్యాఖ్యలు?

సజ్జనార్ హైదరాబాద్ సీపీగా ఉన్న సమయంలో ఆయన తీరుపై అనేక ఆరోపణలు, విమర్శలు వచ్చాయని నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. అధికారాన్ని దుర్వినియోగం చేయడం, చట్టాన్ని తనకు అనుకూలంగా మలుచుకోవడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఆరోపణలు ఆయనపై ఉన్నాయని చెబుతున్నారు. పోలీస్ వ్యవస్థ అంటే ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థ అని, భయాన్ని సృష్టించే వ్యవస్థ కాదని నాగేశ్వరరావు గుర్తుచేశారు.
యూనిఫాం వేసుకున్న ప్రతి అధికారి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, చట్టానికి అతీతంగా ఎవరూ లేరని ఆయన అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులకు బదిలీ అనే పేరుతో తప్పించుకోవడం కుదరదని, చట్టం తన పని తాను చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వానికి డిమాండ్!

తెలంగాణ ప్రభుత్వం ఈ విషయాన్ని తేలికగా తీసుకోకుండా, సజ్జనార్ వ్యవహారంపై లోతైన విచారణకు ఆదేశించాలని నాగేశ్వరరావు కోరారు. ఆయన హయాంలో జరిగిన నిర్ణయాలు, ఎన్‌కౌంటర్లు, కేసుల విషయంలో జరిగిన అవకతవకలు, ఇతర కార్యకలాపాలపై సమగ్ర దర్యాప్తు జరగాలని అన్నారు. విచారణలో తప్పు చేసినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిర్దోషి అని తేలితే ఆయనకు న్యాయం జరగాలని అన్నారు.
ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై నమ్మకం నిలబడాలంటే ఇలాంటి విచారణలు అవసరమని, అధికారులు తప్పు చేసినా చట్టం నుంచి తప్పించుకోలేరనే సందేశం వెళ్లాలని చెప్పారు.

పోలీస్ వర్గాల్లో చర్చ!

నాగేశ్వరరావు వ్యాఖ్యల తర్వాత హైదరాబాద్ పోలీస్ వర్గాల్లో, రిటైర్డ్ అధికారుల్లో పెద్ద చర్చ మొదలైంది. కొందరు నాగేశ్వరరావు వ్యాఖ్యలను సమర్థిస్తుండగా, మరికొందరు ఒక మాజీ అధికారి మరో అధికారిపై బహిరంగంగా ఇలా మాట్లాడటం సరికాదని అంటున్నారు. కానీ సోషల్ మీడియాలో మాత్రం నాగేశ్వరరావుకు మద్దతుగా అనేక పోస్టులు వస్తున్నాయి. ప్రజా ప్రయోజనాల కోసం నిజం చెప్పినందుకు ఆయనను అభినందిస్తున్నారు.

సజ్జనార్ నేపథ్యం!

వీసీ సజ్జనార్ తెలంగాణలో ఎంతో పేరున్న ఐపీఎస్ అధికారి. వరంగల్ ఎన్‌కౌంటర్, దిశ ఎన్‌కౌంటర్ వంటి ఘటనలతో ఆయన పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. కొందరు ఆయనను హీరోగా చూస్తే, మరికొందరు ఆయన తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్‌కౌంటర్ల విషయంలో చట్టపరమైన ప్రశ్నలు, మానవ హక్కుల సంఘాల విమర్శలు కూడా వచ్చాయి. ఆయన హైదరాబాద్ సీపీగా ఉన్న సమయంలో కూడా పలు వివాదాస్పద నిర్ణయాలు చర్చకు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆయన బదిలీ జరగడం, దానిపై నాగేశ్వరరావు స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇక ఏం జరుగుతుంది?

ప్రభుత్వం నాగేశ్వరరావు డిమాండ్‌పై ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. విచారణకు ఆదేశిస్తుందా? లేక బదిలీతోనే విషయాన్ని ముగిస్తుందా? అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ విచారణ జరిగితే తెలంగాణ పోలీస్ వ్యవస్థలో పెద్ద మార్పులు రావచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.
ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని పెంచడానికి, వ్యవస్థలో జవాబుదారీతనాన్ని తీసుకురావడానికి ఈ విచారణ ఎంతో అవసరమని నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. బదిలీతో సరిపెట్టకుండా, చట్టపరమైన చర్యలు తీసుకుంటేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

తల తాకట్టుపెట్టైనా సరే.. ఇందిరమ్మ ఇళ్లను ఆపం!

దశలో ఉన్నాయని, వేలాది ఇళ్లు ఇప్పటికే పూర్తయి లబ్ధిదారులకు అందజేశామని చెప్పారు.
విడతల వారీగా ప్రతి పేద కుటుంబానికి ఇల్లు!
విడతల వారీగా ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇస్తామని పొంగులేటి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మరో రెండు విడతలు, పట్టణాల్లో మరో మూడు విడతల్లో ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన ఒక్క పేద కుటుంబం కూడా మిగిలిపోకుండా చూస్తామని, అందుకోసం గ్రామ సభలు, పట్టణాల్లో సర్వేలు నిర్వహించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఇళ్ల మంజూరులో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూస్తామని, నిజమైన పేదలకే ఇళ్లు దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని పొంగులేటి స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా, కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.

జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లిలో అత్యాధునిక టవర్స్!

హైదరాబాద్ నగర శివార్లలోని జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ గురించి మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. టవర్స్‌లో ఒక్కో ఫ్లాట్ విలువ రూ.50 నుంచి రూ.60 లక్షలు ఉంటుందని తెలిపారు. పేదలకు ఇస్తున్నామని నాసిరకం నిర్మాణం చేయడం లేదని, కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో, అన్ని వసతులతో నిర్మిస్తున్నామని చెప్పారు.
ఈ టవర్స్‌లో లిఫ్ట్, పార్కింగ్, సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం, కరెంట్, పిల్లల కోసం ఆట స్థలం, కమ్యూనిటీ హాల్ వంటి అన్ని సౌకర్యాలు ఉంటాయని అధికారులు తెలిపారు. ఏడాదిలోనే నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడబోమని మంత్రులు స్పష్టం చేశారు.

పేదల కల నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధం!

తెలంగాణలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయమని పొంగులేటి అన్నారు. అందుకోసం అవసరమైతే ఎన్ని నిధులైనా కేటాయిస్తామని, బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్లకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా, ఇందిరమ్మ ఇళ్లకు నిధుల కొరత రానివ్వమని, తల తాకట్టుపెట్టైనా సరే ఇళ్లు కట్టించి తీరుతామని మరోసారి స్పష్టం చేశారు.
గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని, లబ్ధిదారులు తమకు నచ్చిన విధంగా ఇళ్లు కట్టుకునే వెసులుబాటు కల్పించామని పొంగులేటి తెలిపారు. పట్టణాల్లో స్థల కొరత కారణంగా టవర్స్ నిర్మిస్తున్నామని, దీంతో ఎక్కువ మంది పేదలకు ఇళ్లు అందించగలుగుతున్నామని చెప్పారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు పాల్గొన్నారు. ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన జరగడంతో స్థానిక ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. చాలా ఏళ్లుగా ఇంటి కోసం ఎదురుచూస్తున్న తమ కల త్వరలోనే నెరవేరబోతోందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌కు పెద్ద గండం!

వేసవి కాలం రాకముందే, చలికాలంలోనే నగరానికి ఇంతటి నీటి కష్టం రావడం ఇదే మొదటిసారి అని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా పడకపోవడం, జలాశయాల్లోకి తగినంత వరద నీరు రాకపోవడంతో నీటిమట్టం వేగంగా పడిపోతోంది. ప్రతి రోజూ లక్షల లీటర్ల నీరు నగరానికి సరఫరా అవుతుండటంతో, మిగిలిన నిల్వలు కూడా వేగంగా తరిగిపోతున్నాయి.

ఏయే ప్రాంతాలకు ప్రమాదం?

సింగూరు, మంజీరా నుంచి నీళ్లు సరఫరా అయ్యే ప్రాంతాలకే ఈ గండం పొంచి ఉంది. ముఖ్యంగా శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్ నియోజకవర్గాలకు నీటి సరఫరా కష్టమేనని అంచనా వేస్తున్నారు. వీటిలో శేరిలింగంపల్లి నియోజకవర్గంపై నీటి కొరత ప్రభావం అత్యధికంగా పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, మియాపూర్, చందానగర్ వంటి ఐటీ హబ్‌లు అన్నీ ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు, వేలాది అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లు, హోటళ్లు ఉండటంతో నీటి అవసరం భారీగా ఉంది. ఇక్కడ నీరు ఆగిపోతే పరిస్థితి దారుణంగా మారిపోతుంది. కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, సనత్‌నగర్‌లలో కూడా ఇదే పరిస్థితి. రోజు విడిచి రోజు నీళ్లు, లేదా వారానికి రెండు రోజులే నీళ్లు వచ్చే పరిస్థితి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ట్యాంకర్ల ధరలు ఇప్పటికే పెరిగిపోయాయని, ముందు ముందు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గోదావరి నీళ్లే దిక్కు!

ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు అధికారులు ఇప్పుడు గోదావరి జలాల వైపు చూస్తున్నారు. సింగూరు, మంజీరా నుంచి నీళ్లు సరఫరా అయ్యే ప్రాంతాలకు గోదావరి జలాలను మళ్లించే ప్రత్యామ్నాయ చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గోదావరి ఫేజ్-1, ఫేజ్-2 నుంచి నీళ్లు తెచ్చి, ఈ ప్రాంతాలకు సరఫరా చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.
కానీ గోదావరి నీళ్లను మళ్లించడానికి సమయం పడుతుందని, పైప్‌లైన్లు, పంపింగ్ స్టేషన్లలో మార్పులు చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అప్పటి వరకు ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని, వృథా చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

6 నెలల క్రితమే తప్పు జరిగింది!

ఈ దుస్థితికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని నీటి రంగ నిపుణులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. 6 నెలల క్రితం గోదావరి నీళ్లను కిందకు వదలకుండా ఉండి ఉంటే, జలాశయాల్లో నీటిని నిల్వ ఉంచుకుని ఉంటే ఈరోజు ఈ దుస్థితి వచ్చేది కాదని అంటున్నారు. వర్షాలు తక్కువగా ఉన్నాయని తెలిసినా, ముందు చూపుతో వ్యవహరించకపోవడం వల్లే హైదరాబాద్ ఇప్పుడు గొంతు ఎండే పరిస్థితికి వచ్చిందని ఆరోపిస్తున్నారు. హైదరాబాద్ ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని, ప్రతి చుక్క నీటిని కాపాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. లేదంటే డిసెంబర్ తర్వాత నగరంలో నీటి కోసం పెద్ద యుద్ధమే జరగవచ్చని హెచ్చరిస్తున్నారు.

సచివాలయ క్యాంటీన్‌లో కలకలం!

సబ్సిడీపై అనుమానాలు

ఉద్యోగులకు సబ్సిడీ ధరకే భోజనం అందించాల్సి ఉండగా, ఏజెన్సీ ఆ నిబంధన పాటించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. బయట హోటళ్లతో పోలిస్తే ఇక్కడ ధరలు ఎక్కువగా ఉన్నాయని, అయినా నాణ్యత మాత్రం తక్కువగా ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. ఫిర్యాదు చేసినా ఏజెన్సీ నుంచి సరైన స్పందన రావడం లేదని, జవాబుదారీతనం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నించిన వారిపై దురుసుగా వ్యవహరిస్తున్నారని కూడా చెబుతున్నారు.

సొసైటీ నడపాలన్న డిమాండ్

ఈ నేపథ్యంలో కొడంగల్ ఏజెన్సీని తొలగించి, ఉద్యోగుల సొసైటీ ఆధ్వర్యంలోనే క్యాంటీన్ నడపాలని సచివాలయ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేస్తోంది. సొసైటీ నడిపితే లాభాపేక్ష లేకుండా నాణ్యమైన భోజనం తక్కువ ధరకే అందించవచ్చని, ఉద్యోగుల సమస్యలకు వెంటనే స్పందించవచ్చని చెబుతున్నారు. దీంతో క్యాంటీన్ నిర్వహణపై నిర్ణయం తీసుకునేందుకు సొసైటీలో ఉన్న ఉద్యోగులకు ఎన్నికలు జరిపేందుకు నిర్ణయించారు. సొసైటీకి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకొని, వారి ఆధ్వర్యంలో క్యాంటీన్‌ను చేపట్టాలని భావిస్తున్నారు.

ఈ నెలాఖరుకే పోలింగ్

త్వరలో ఓటర్ల తుది జాబితా విడుదల కానుంది. ఈ నెలాఖరు కల్లా పోలింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సొసైటీ లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్నికలు పూర్తయిన వెంటనే కొత్త కార్యవర్గం బాధ్యతలు స్వీకరించి క్యాంటీన్ నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకోనుంది.
సచివాలయ ఉద్యోగులంతా ఇప్పుడు ఈ ఎన్నికల వైపే చూస్తున్నారు. సొసైటీ ఆధ్వర్యంలో క్యాంటీన్ వస్తేనే తమకు మంచి, శుభ్రమైన, సబ్సిడీ భోజనం దొరుకుతుందని ఆశిస్తున్నారు.

కూకట్ పల్లి భూమి అమ్మితే ఊరుకోం!

స్థానికుల ఆవేదన.. హరీష్ రావుకు విన్నపం!

ఈ సందర్భంగా స్థానికులు హరీష్ రావుకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. "ఇది ప్రజల భూమి సార్! ట్రక్కుల పార్కింగ్ కోసం, ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూమిని ఇలా అమ్మేస్తే మా పరిస్థితి ఏంటి? పోలీస్ స్టేషన్, ఆర్టీఓ, ఇతర కార్యాలయాలన్నీ ఇక్కడే ఉన్నాయి. వాటిని ఎక్కడికి తరలిస్తారు?" అంటూ ప్రశ్నించారు.
వారి మాటలు విన్న హరీష్ రావు.. "మీకు అండగా ఉంటాం. ఈ భూమి అమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటాం. మీ పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ ముందు వరుసలో నిలబడుతుంది" అని భరోసా ఇచ్చారు.

2013లోనూ ఇదే కాంగ్రెస్.. ఇదే పోరాటం!

ఈ భూమి కోసం పోరాటం ఇదే మొదటిసారి కాదని హరీష్ రావు గుర్తు చేశారు. 2013లో కూడా ఈ కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూమిని అమ్మడానికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించిందని అన్నారు. ఆరోజు కూడా సీపీఐ, సీపీఎం పార్టీలతో కలిసి బీఆర్ఎస్ ఈ భూమిని అమ్మకుండా పెద్ద పోరాటం చేసిందని తెలిపారు. కాంగ్రెస్‌కు భూములు అమ్మడం అలవాటేనని, చరిత్ర మళ్లీ పునరావృతం అవుతోందని ఎద్దేవా చేశారు.
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ భూమిలోనే ప్రజలకు ఉపయోగపడేలా పోలీస్ స్టేషన్, నర్సరీ, ఆర్టీఓ కార్యాలయం, ఎమ్మెల్యే కార్యాలయం కోసం భూమి కేటాయించామని హరీష్ రావు చెప్పారు. ప్రజల సౌకర్యం కోసం కేటాయించిన భూమిని ఈరోజు రేవంత్ రెడ్డి అమ్మి, ఆ ప్రభుత్వ కార్యాలయాలను కూడా అమ్మేస్తానంటున్నాడని తీవ్రంగా విమర్శించారు.

వేలంలో పాల్గొనే వారికి స్ట్రాంగ్ వార్నింగ్!

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలం పాటలో పాల్గొనే బిల్డర్లు, వ్యాపారులకు హరీష్ రావు గట్టి హెచ్చరిక జారీ చేశారు.
"ఈ భూమి జోలికి వస్తే ఊరుకోం. రేపు వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. మీకు ఇక్కడ ఎలాంటి అనుమతులు రావు. డబ్బులు పెట్టి కొని మోసపోవద్దు. బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం కలిసి ఎంత పెద్ద ఉద్యమమైనా చేసి ఈ భూమిని కాపాడుతాము" అని స్పష్టం చేశారు.

లిలక్ష కోట్ల భూములు అమ్మకానికి! రేవంత్ రెడ్డిపై నిప్పులు!

రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఏకంగా లక్ష కోట్ల రూపాయల విలువైన భూములను అమ్మకానికి పెట్టాడని హరీష్ రావు సంచలన ఆరోపణ చేశారు. హెచ్‌సీయూ భూములను తాకట్టు పెట్టి బ్రోకర్ ద్వారా అప్పు తెచ్చుకున్నాడని, మొన్న కోర్టులో కేసు గెలిచిన 400 ఎకరాల మియాపూర్ భూమిని కూడా అమ్మకానికి పెట్టాడని విమర్శించారు.
రేవంత్ రెడ్డికి పరిపాలన కంటే భూములు అమ్మడంపైనే ఎక్కువ శ్రద్ధ ఉందని, రాష్ట్ర ఆస్తులను అమ్మి కాంగ్రెస్ ప్రభుత్వం నడుపుతోందని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ప్రజల ఆస్తులను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల పరిరక్షణ కోసం బీఆర్ఎస్, వామపక్షాలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టనున్నట్లు హరీష్ రావు ప్రకటించడంతో, ఈ వ్యవహారం మరింత వేడెక్కనుంది.

భారత్ సమ్మిట్‌తో ప్రపంచ పటంలో తెలంగాణ!

నవంబర్ 13, 14 తేదీల్లో భారత్ సమ్మిట్ - ప్రపంచం హైదరాబాద్ వైపు!

నవంబర్ 13, 14 తేదీల్లో జరిగే భారత్ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతున్నారని సీఎం తెలిపారు. వివిధ రంగాల్లో, వివిధ హోదాల్లో ఉన్న వ్యక్తులను భారత్ సమ్మిట్‌కు ఆహ్వానించామని, వారు నగరాన్ని ప్రత్యక్షంగా చూసి, పారిశ్రామిక విధానాలను తెలుసుకుంటారని అన్నారు. కేవలం పేపర్ల మీద కాకుండా, హైదరాబాద్‌ను కళ్లారా చూస్తేనే తెలంగాణ సత్తా అర్థమవుతుందని చెప్పారు.
భారత్ సమ్మిట్ కోసం ఇక్కడికి వచ్చిన ప్రతీ అతిథి తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా మారతారని, వారు తిరిగి వెళ్లి తమ దేశాల్లో, తమ కంపెనీల్లో తెలంగాణ గురించి చెబుతారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక పెట్టుబడిదారుడు వస్తే వందలాది మందికి ఉద్యోగాలు వస్తాయని, వేల కుటుంబాలు బాగుపడతాయని అన్నారు. అందుకే భారత్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని చెప్పారు.

కేంద్రం తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం!

భారత్ సమ్మిట్‌కు ఆహ్వానించిన కొంతమందికి మొదట అనుమతులు ఇచ్చిన కేంద్రం, ఇప్పుడు నిరాకరించిందని సీఎం ఆరోపించారు. ఇది రాజకీయ కక్షతో చేస్తున్న పని అని, దీని వల్ల నష్టపోయేది తెలంగాణ ప్రజలేనని అన్నారు. ఒక రాష్ట్రం అభివృద్ధి కోసం ప్రయత్నిస్తుంటే కేంద్రం అడ్డుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులను ఆపాలని చూస్తే ప్రజలు క్షమించరని హెచ్చరించారు.

కిషన్ రెడ్డి, రాంచందర్ రావు, కేటీఆర్‌పై ఫైర్!

కిషన్ రెడ్డి, రాంచందర్ రావు, కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని సీఎం మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్డు, తుమ్మిడిహట్టి.. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. మూసీని శుభ్రం చేస్తే వ్యతిరేకం, మెట్రో పెంచితే వ్యతిరేకం, రోడ్లు వేస్తే వ్యతిరేకం, పెట్టుబడులు తెస్తే వ్యతిరేకం - ఇదేనా వారి విధానం అని ప్రశ్నించారు. ప్రజలకు మంచి చేసే ప్రతి పనిని అడ్డుకోవడమే వారికి అలవాటుగా మారిందని అన్నారు.

2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ!

పెట్టుబడులను ఆహ్వానించి 2034 నాటికి 1 ట్రిలియన్ ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. ఇది కేవలం నినాదం కాదని, దీనికోసం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీ కండక్టర్, పర్యాటకం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, స్టార్టప్‌లు - అన్ని రంగాల్లో తెలంగాణను ముందుంచుతామని తెలిపారు. పెట్టుబడిదారులకు సింగిల్ విండో అనుమతులు, వేగవంతమైన నిర్ణయాలు, పారదర్శక విధానాలతో అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

గిగ్ వర్కర్స్‌కు చారిత్రక భరోసా!

కేంద్ర ప్రభుత్వానికి గిగ్ వర్కర్స్‌ను ఆదుకునే ఆలోచన లేదని సీఎం విమర్శించారు. తెలంగాణలో గిగ్ వర్కర్స్ చట్టాన్ని రేపటి నుంచి అమలు చేయబోతున్నామని ప్రకటించారు. రాహుల్ గాంధీ చేతుల మీదుగా గిగ్ వర్కర్స్ పాలసీ అమలును ప్రారంభించబోతున్నామని, భారత్ సమ్మిట్‌లో ముగింపు సందేశాన్ని ఇచ్చేందుకు రాహుల్ గాంధీ హైదరాబాద్ వస్తున్నారని తెలిపారు. లక్షలాది మంది గిగ్ వర్కర్స్‌కు సామాజిక భద్రత, బీమా, కనీస వేతన భరోసా కల్పించడం దేశంలోనే తెలంగాణ మొదటిసారి చేస్తోందని చెప్పారు. ఇది దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.

మోదీ చేస్తే కరెక్టు, రాహుల్ చేస్తే తప్పా?

ప్రధాని మోదీ ఇతర దేశాలకు వెళ్లి ఉపన్యాసాలు ఇస్తారని, విదేశాల్లో సదస్సులు నిర్వహిస్తారని, మోదీ ఏది చేసినా కరెక్టు, రాహుల్ గాంధీ చేస్తే తప్పు అన్నట్లుగా బీజేపీ వ్యవహరిస్తుందని సీఎం ధ్వజమెత్తారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిని బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు. బీజేపీ వైఖరి నియంతృత్వ వైఖరి అని అన్నారు.
ప్రజాస్వామ్యంలో అందరి అభిప్రాయాలు తీసుకుంటామని, సుపరిపాలన కోసం రాజ్యాంగాన్ని 106 సార్లు సవరించుకున్నామని, ప్రపంచ శాంతి కోసం చర్చ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలను గౌరవించడమే ప్రజాస్వామ్యమని, ప్రతిపక్ష నాయకుడిని కూడా గౌరవించాలని చెప్పారు.

బీజేపీ నాయకులకు సీఎం సూచన!

ఇప్పటికైనా బీజేపీ నాయకులు విజ్ఞత ప్రదర్శించాలని సీఎం కోరారు. మీకు కడుపులో విషం ఉండొచ్చు, అది తెలంగాణ ప్రజలపై ప్రదర్శించకండి అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ బీజేపీని ఓడించి దేశానికి ప్రధాని అవుతారని బీజేపీ భయపడుతోందని అన్నారు. అందుకే రాహుల్ గాంధీని ప్రతి విషయంలోనూ టార్గెట్ చేస్తున్నారని చెప్పారు.
ఢిల్లీలో గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి పీయూష్ గోయల్ వస్తే స్వాగతించారని, కానీ భారత్ సమ్మిట్‌కు రాహుల్ గాంధీ వస్తే విమర్శిస్తారా అని ప్రశ్నించారు. మీ రాజకీయాల కోసం రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనను వ్యతిరేకించొద్దని కోరారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి రావాలని, రాజకీయాలను పక్కనపెట్టి రాష్ట్రం కోసం పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు.

సంపాదకీయం

కాంగ్రెస్ కు బీలాంగింగ్ వరమా...

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' విడుదలైనప్పటి నుండి భారత రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇందులో ఆమె ప్రస్తావించిన పలు కీలక చారిత్రక అంశాలను ఆయుధంగా చేసుకుని భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగుతోంది.ముఖ్యంగా రాబోయే ఉత్తరప్రదేశ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ పుస్తకంలోని అంశాలు బీజేపీకి రాజకీయంగా కలిసొచ్చే అస్త్రాలుగా మారాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.బీజేపీకి అస్త్రాలుగా మారిన ప్రధాన అంశాలు? ఎమర్జెన్సీ ప్రస్తావన. 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ ఒక పొరపాటు అని, తర్వాత ఇందిర కూడా అదే అభిప్రాయానికి వచ్చారని సోనియా ఈ పుస్తకంలో పేర్కొన్నారు. దీనిపై బీజేపీ స్పందిస్తూ, నెహ్రూ-గాంధీ కుటుంబం చేసిన చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే ఆమె ప్రయత్నిస్తున్నారని, ఈ పుస్తకానికి 'బిలాంగింగ్' బదులు 'వైట్‌వాషింగ్' అని పేరు పెట్టి ఉండాల్సిందని బీజేపీ అధికార ప్రతినిధి సి.ఆర్. కేశవన్ విమర్శించారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు. ఈ పుస్తకంలో 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లపై తన కుటుంబానికి క్లీన్ చిట్ ఇచ్చుకునే ప్రయత్నం జరిగిందని బీజేపీ ఆరోపిస్తోంది. పంజాబ్ ఎన్నికల ముంగిట ఈ అంశం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా, బీజేపీకి అనుకూలంగా మారే అవకాశం ఉంది. ముందు తన పిల్లలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో ఈ విషయంపై చర్చించినట్లు సోనియా వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తాను ప్రధానమంత్రి పదవి చేపట్టాలా? అని వారిని అడిగినప్పుడు ఇద్దరూ స్పష్టంగా వద్దని చెప్పారని రాశారు. ఇందిరా గాంధీ హత్య, రాజీవ్ గాంధీ హత్యను ప్రత్యక్షంగా చూసిన తమకు, తల్లి కూడా ప్రధానమంత్రి అయితే కుటుంబానికి ముప్పు పెరుగుతుందనే భయం ఉండేదని ఆమె వివరించారు. తాను ప్రధాని కావడం లేదని చెప్పినప్పుడు పిల్లలు ఎంతో ఉపశమనం పొందారని గుర్తుచేసుకున్నారు.2004 ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలా? వద్దా? అనే విషయంలో తాను తీవ్ర మానసిక సంఘర్షణకు గురయ్యానని సోనియా గాంధీ రాశారు. ఒకవైపు కాంగ్రెస్ కార్యకర్తల ఆశలు, ప్రజల నమ్మకం, మరోవైపు తన వ్యక్తిగత భయాలు, కుటుంబ భద్రత వంటి అంశాలు తనను ఆలోచనలో పడేశాయని తెలిపారు. చివరకు ప్రధానమంత్రి పదవిని తిరస్కరించాలని నిర్ణయించుకున్న రాత్రి తన మనసులోని సందేహాలన్నీ తొలగిపోయాయని పేర్కొన్నారు. తన అంతరాత్మ నుంచి 'సోనియా.. నీకు నువ్వు నిజాయితీగా ఉండు. ఈ విషయం నీకు ఎప్పటినుంచో తెలుసు. దాన్ని వదిలేయ్!' అనే భావన కలిగిందని పుస్తకంలో వివరించారు.తన నివాసంలో కాంగ్రెస్, సంకీర్ణ పార్టీల నేతలు ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలని కోరిన సమావేశాన్ని కూడా ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ తనను 'మీరు ప్రధానమంత్రి కావడానికి ఎందుకు అంగీకరించారు?' అని ప్రశ్నించారని తెలిపారు. నాయకులు తన మాట వినడం లేదని, ఒత్తిడి చేస్తున్నారని తాను సమాధానమిచ్చినట్లు రాశారు. మరోవైపు ప్రియాంక గాంధీ కూడా తన నిర్ణయానికి కట్టుబడి ఉండాలని సూచించారని, ఆ సమయంలో ఆమె భావోద్వేగానికి గురయ్యారని వెల్లడించారు.తాను ప్రధానమంత్రి అయితే బీజేపీ, దాని మిత్రపక్షాలు తన విదేశీ మూలాన్ని రాజకీయ అస్త్రంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని సోనియా భావించారు. దీనివల్ల దేశంలో రాజకీయ వివాదం పెరిగి, ప్రభుత్వం పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందారు. తనకు ప్రధానమంత్రి పదవి కంటే దేశంలో స్థిరమైన, సమర్థవంతమైన, లౌకిక ప్రభుత్వం ఏర్పడటమే ముఖ్యమని పేర్కొన్నారు.2004లో పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కాంగ్రెస్ నేతల సమావేశంలో తాను ప్రధానమంత్రి పదవిని చేపట్టబోనని ప్రకటించినప్పుడు పలువురు నాయకులు నిరసన వ్యక్తం చేశారని సోనియా గుర్తుచేసుకున్నారు. కొందరు నిర్ణయం మార్చుకోవాలని కోరడంతో కొద్దిసేపు ప్రసంగాన్ని ఆపాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. అనంతరం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును ప్రధానమంత్రి పదవికి ప్రతిపాదించారు. దీంతో యూపీఏ ప్రభుత్వానికి మన్మోహన్ సింగ్ నాయకత్వం వహించారు.మొత్తంగా, ప్రధానమంత్రి పదవిని తిరస్కరించడం వెనుక కుటుంబ భద్రత, రాజకీయ పరిస్థితులు, వ్యక్తిగత సిద్ధాంతాలు కీలకంగా ఉన్నాయని సోనియా గాంధీ తన ఆత్మకథలో వివరించారు. 2004లో దేశ రాజకీయాలను మలుపు తిప్పిన తన నిర్ణయంపై ఇన్నేళ్ల తర్వాత ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.2004 ప్రధాని పదవి త్యాగం మరియు 'సూపర్ పీఎం'. 2004లో తాను ప్రధాని పదవిని ఎందుకు వదులుకున్నానో సోనియా ఈ పుస్తకంలో వివరించారు. అయితే, 1999లో వాజ్‌పేయి ప్రభుత్వం పడిపోయినప్పుడు సంఖ్యాబలం లేకపోయినా ఆమె ప్రధాని కావాలని ఆశపడ్డారని బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది విమర్శించారు. 2004లో ప్రధాని పదవిని వదులుకున్నట్లు నటిస్తూ, నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా ఉంటూ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంపై పెత్తనం చెలాయించి 'సూపర్ పీఎం' గా వ్యవహరించారని బీజేపీ దుయ్యబట్టింది. భారత పౌరసత్వం వివాదం. 1968లో రాజీవ్ గాంధీని వివాహం చేసుకుని భారత్‌కు వచ్చిన సోనియా, 1983 వరకు అంటే 15 ఏళ్ల పాటు ఇటలీ పాస్‌పోర్టునే ఎందుకు కొనసాగించారన్న పాత వివాదాలను బీజేపీ నేతలు మళ్లీ తెరపైకి తెచ్చారు. రాజీవ్ గాంధీ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించే సమయానికే ఆమె భారత పౌరసత్వం తీసుకోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని బీజేపీ ప్రశ్నిస్తోంది. బాబ్రీ మసీదు కూల్చివేత. 1992 నాటి బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనపై సోనియా చేసిన వ్యాఖ్యలను కూడా బీజేపీ తప్పుబట్టింది. దశాబ్దాల పాటు భారత రాజకీయాల చక్రం తిప్పిన 10 జన్ పథ్ తెరవెనుక అధికార ప్రస్థానాన్ని, 1998లో కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తీరును, యూపీఏ-1, యూపీఏ-2 సంకీర్ణ ప్రభుత్వాల నిర్వహణలోని అంతర్గత ఒత్తిళ్లను సోనియా ఈ పుస్తకంలో స్పృశించారు. నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌తో తన అనుబంధం, 2004లో ప్రధాని పదవిని త్యాగం చేయడం వెనుక ఉన్న అంతరంగిక నిర్ణయాలు, కాంగ్రెస్‌లోని సీనియర్ నేతల అంతర్గత కుమ్ములాటల గుట్టును బయటపెట్టడం జాతీయ స్థాయిలో తీవ్ర రాజకీయ దుమారానికి కారణమైంది.ప్రతిపక్ష అధికార ఎన్‌డీయే కూటమి నాయకులు ఈ ఆత్మకథపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. యూపీఏ హయాంలో జరిగిన పలు ఆర్థిక కుంభకోణాలు, సూపర్ ప్రైమ్ మినిస్టర్ గా నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ ద్వారా సమాంతర అధికారాన్ని చెలాయించారన్న ఆరోపణలను కప్పిపుచ్చుకోవడానికే సోనియా ఈ పుస్తకం ద్వారా సింపథీ కార్డ్ ని ప్రయోగిస్తున్నారని అధికార వర్గాలు విమర్శిస్తున్నాయి. 2004-2014 మధ్యకాలంలో జరిగిన తెరవెనుక రాజకీయాలను తనకు అనుకూలమైన రీతిలో మలచుకున్నారనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కాంగ్రెస్ శ్రేణులు , ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు మాత్రం సోనియా రాసిన పుస్తకాన్ని సమర్థిస్తున్నాయి.

ప్రేమ పేరుతో వేధింపులు

- ఎస్సై శిక్షణ పొందుతున్న యువతి ఆత్మహత్య
- 18 పేజీల సూసైడ్ నోట్‌లో స్నేహితుడు అనిల్‌తో పాటు స్నేహితురాలు కుటుంబ సభ్యులపై ఆరోపణలు..
- నిందితులను అరెస్టు చేయాలని విద్యార్థి సంఘాల ధర్నా



మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 13(విజన్ ఆంధ్ర) ప్రేమ పేరుతో మోసం, కులం పేరుతో దూషణలు, పెళ్లికి నిరాకరణతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో కలకలం రేపింది. మహబూబాబాద్ మండలం నడివాడ గ్రామానికి చెందినసుస్మిత (25) శుక్రవారం బలవన్మరణానికి పాల్పడింది. ప్రస్తుతం మహబూబాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో ఆమె ఎస్సై శిక్షణ పొందుతున్నట్లు సమాచారం.సుస్మిత రాసినట్లు చెబుతున్న 18 పేజీల సూసైడ్ నోట్‌లో అనిల్ అనే వ్యక్తితో పరిచయం, ప్రేమ వ్యవహారం, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలను వివరించినట్లు తెలుస్తోంది. అనిల్‌తో ప్రేమలో ఉన్న సమయంలో గర్భం దాల్చినట్లు, గర్భం తొలగించుకునేందుకు స్లీపింగ్ పిల్స్ ఉపయోగించేలా చేశాడని ఆమె ఆరోపించినట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు సమాచారం.అంతేకాకుండా, అనిల్ తనను కులం పేరుతో దూషిస్తూ, అసభ్య పదజాలంతో తిట్టేవాడని, మానసికంగా వేధించేవాడని సూసైడ్ నోట్‌లో వెల్లడించినట్లు తెలుస్తోంది. ప్రేమించే సమయంలో గుర్తుకురాని కులం, గర్భం దాల్చడానికి పెళ్లి విషయానికి వచ్చేసరికి అడ్డంకిగా మారిందని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. తనను పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదని అనిల్ చెప్పినట్లు, గర్భధారణకు సంబంధించిన పరిణామాల నుంచి చివరి వరకు తనకు తీవ్ర మానసిక వేదన కలిగించాడని ఆమె ఆరోపించినట్లు తెలుస్తోంది.ఈ వ్యవహారంలో అనిల్‌తో పాటు అతని స్నేహితురాలు నవ్యశ్రీ, అనిల్ తల్లిదండ్రుల పాత్రపైనా విచారణ జరిపి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సుస్మిత తన సూసైడ్ నోట్‌లో కోరినట్లు సమాచారం.నిందితులను అరెస్టు చేయాలంటూ విద్యార్థి సంఘాల ఆందోళనసుస్మిత మరణవార్త తెలియడంతో విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆమెకు న్యాయం చేయాలని, సూసైడ్ నోట్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక అండర్ బ్రిడ్జి వద్ద సుమారు రెండు గంటల పాటు ధర్నా ర్వహించాయి. ఈ సందర్భంగా ఆందోళనకారులు నిందితులను అరెస్టు చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.సుస్మిత మరణానికి దారితీసిన పరిస్థితులు, సూసైడ్ నోట్‌లో పేర్కొన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా నమోదు చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవంబర్ 19 నుంచి బీమా పథకం అమలు

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ

గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేక నమోదు కేంద్రాలు



నిజామాబాద్, నవంబర్ 13 :(విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ పథకం అమలు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వీ.సీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులతో సమావేశమై కీలక సూచనలు చేశారు. తెలంగాణలోని ప్రతి కుటుంబానికి ఈ పథకం ద్వారా ప్రభుత్వం రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించనున్నదని తెలిపారు. ఈ నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా పథకం అమల్లోకి వస్తుందని, దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన తాజా కులగణన సర్వే ద్వారా కుటుంబాలకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉన్నాయని, అదేవిధంగా రేషన్ కార్డుల ఆధారంగా కూడా కుటుంబాల వివరాలు అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. వాటిని ఈ పథకం అమలులో వినియోగించుకోవాలని తెలిపారు.ప్రతి గ్రామం, వార్డులో ప్రత్యేక నమోదు కేంద్రాలునవంబర్ 19న జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో డివిజన్/ వార్డు స్థాయిలో నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి పథకం సమాచారం చేరేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఒక రోజు ముందే నవంబర్ 18న ప్రతి గ్రామంలో టాంటాం ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. పంచాయతీ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని ప్రజలకు పథకంపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. కుటుంబ పెద్ద తమ కుటుంబానికి సంబంధించిన నామినీ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని, ఒకరు లేదా ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ప్రతిపాదించవచ్చని కలెక్టర్ సూచించారు. జీవిత బీమా కవరేజీ కోసం 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ సంపాదన సభ్యుల వివరాలను కచ్చితంగా సేకరించాలని సూచించారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తులో జిల్లా, మండలం, గ్రామం లేదా వార్డు వివరాలతో పాటు బీమా పొందే వ్యక్తి పేరు, తండ్రి లేదా భర్త పేరు, లింగం, ఆధార్ ప్రకారం పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ నమోదు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యుల పేర్లు, వారి ఆధార్ నంబర్లు కూడా సేకరించాలన్నారు.నామినీ పేరు, సంబంధం, ఆధార్ వివరాలతో పాటు ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలుగా ఉంటే వారికి కేటాయించే వాటా వివరాలను నమోదు చేయాలని తెలిపారు. నామినీ మైనర్ అయితే వారి సంరక్షకుడు లేదా ప్రతినిధి వివరాలు తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. దరఖాస్తుపై దరఖాస్తుదారుడితో పాటు వివరాలను పరిశీలించిన అధికారి సంతకం ఉండాలని స్పష్టం చేశారు.సేకరించిన దరఖాస్తులను డిజిటలైజేషన్ చేసి, సంతకం చేసిన దరఖాస్తుల స్కాన్ ప్రతులను బీమా సంస్థకు పంపించాల్సి ఉంటుందని తెలిపారు. నామినీ వివరాలు, ఆధార్ నంబర్లు, ఇతర సమాచారాన్ని నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డిజిటల్ రికార్డుల్లోనూ కచ్చితత్వం పాటించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, సీపీఓ రతన్, ఇంచార్జి డీపీఓ నాగరాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాటల్లో కాదు చేతల్లో ఎక్కడ అమలు కాని జగన్ వ్యూహాలు

గుంటూరు, నవంబరు 13, వైసీపీఅధినేత వైఎస్ జగన్ కార్యకర్తలను దగ్గరకు తీసుకోవడం లేదు. అసలు వారిని గురించి పట్టించుకోవడం లేదు. కేవలం సమావేశాల్లో ప్రసంగాల్లో తప్ప ఆయన స్వయంగా కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన పాపాన పోలేదని వాపోతున్నారు. పార్టీ కోసం ఏమీ ఆశించకుండా పోరాడుతున్న కార్యకర్తలను అధికారంలో ఉన్నప్పుడు అంతే. లేనప్పుడు కూడా తీరు మారకపోవడాన్ని కొందరు తీవ్రంగా తప్పుపడుతున్నారు. మరొకవైపు వైసీపీ కోసం సోషల్ మీడియా కార్యకర్తలతో సమావేశాలను నిర్వహించలేదు. ప్రధాన మీడియాకు పోటీగా కార్యకర్తలు ఎప్పటికప్పుడు సోషల్ మీడియా కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడుతున్నా వారిని గుర్తించడం లేదని, కనీసం గుర్తింపు కార్డు కూడా ఇవ్వకపోవడమేంటని వైఎస్ జగన్ ను కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. కార్యకర్తల బీమా పథకాన్నికూడా అమలు చేయడం లేదు. కానీ నిన్న గాక మొన్న వచ్చిన పార్టీలు కూడా బీమా సౌకర్యాలను కల్పిస్తుంటే పార్టీ పెట్టి ఇన్నేళ్లవుతున్నా పట్టించుకోకపోవడాన్ని బట్టి జగన్ కు క్యాడర్ పట్ల ఎంత మమకారం ఉందో అర్థమవుతుందని తెలిపారు. పెట్టుబడి దారులకు రక్షణ చట్టం స్వచ్ఛందంగా పనిచేస్తున్న వారిని... వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ సోషల్ మీడియా విభాగంతో సమావేశం నిర్వహించారు. కానీ వారంతా డబ్బులు తీసుకుని పనిచేసేవారని, అయితే స్వచ్ఛందంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ పై అభిమానంతో కష్టపడుతున్న వారిని మాత్రం గుర్తించడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు దొడ్డ అంజిరెడ్డి తదితర నేతల ఆధ్వర్యంలో సోషల్ మీడియా కార్యకర్తల సమావేశం జరిగిందని, అంతే తప్ప జగన్ ఇందులో పాల్గొనకపోవడాన్ని కూడా తప్పుపట్టింది. 2024న విశాఖపట్నం జిల్లా పెదిపాలెంలోని చెన్నాస్ కన్వెన్షన్ హాల్‌లో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో జగన్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత ఎక్కడని ప్రశ్నిస్తున్నారు. రాబోయే రోజుల్లో సోషల్ మీడియా వర్కర్లతో ప్రత్యేకంగా ఎక్కడెక్కడ సమావేశాలు నిర్వహిస్తారనే పూర్తి షెడ్యూల్ వివరాలు అందుబాటులో లేవు. ఎంత సేపటికి నియోజకవర్గాల ఇన్ ఛార్జులతోనే సమావేశమవుతున్నారని, పార్టీ గెలుపునకు కష్టపడే వారికి గుర్తింపు దక్కడం లేదని అంటున్నారు. కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పిస్తామని జగన్ ప్రకటన కూడా ఆచరణలో సాధ్యం కావడం లేదని కొందరు సోషల్ మీడియా వేదికగా వాపోతున్నారు. నాడు జగన్ ఏదైనా అనుకోని ఘటనలోనో, ప్రమాదవశాత్తూ మరణించిన వైసీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ తరఫున రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లుఈ ఏడాది సెప్టంబరు లో వైఎస్ జగన్ ప్రకటించారు.

తెలంగాణ ఉన్నత విద్యాభివృద్ధిపై గవర్నర్ సమీక్ష

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకృష్ణారెడ్డి తో సమావేశం

విద్యా ప్రమాణాల పెంపు, అధ్యాపక నియామకాలు, విశ్వవిద్యాలయాల భద్రతపై ప్రత్యేక దృష్టి



విజన్ ఆంధ్ర (14) హైదరాబాద్‌తెలంగాణలో ఉన్నత విద్యాభివృద్ధి, విశ్వ విద్యాలయాల పనితీరు, విద్యా ప్రమాణాల మెరుగుదల తదితర అంశాలపై రాష్ట్ర గవర్నర్, విశ్వ విద్యాలయాల కులపతి శ్రీ శివ ప్రతాప్ శుక్లా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ వి. బాలకృష్ణారెడ్డిని పిలిపించి రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాలు, ఇతర విద్యాసంస్థలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు, ఇటీవల పత్రికల్లో ప్రచురితమైన వార్తలు, ఉన్నత విద్యారంగంలో అమలు చేస్తున్న నూతన విద్యా విధానాలు, పరిపాలనా చర్యలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరాలు తెలుసుకున్నారు, వీటన్నింటిపై సమగ్ర నివేదికను వీలైనంత త్వరగా అందజేయాలని చైర్మన్‌ను ఆదేశించారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాల ఉప కులపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వాటి పనితీరుపై సమీక్ష జరుపనున్నట్లు వెల్లడించారు.అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు:రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పాత బకాయి, సాధారణ అధ్యాపక పోస్టులను పారదర్శకంగా భర్తీ చేసేందుకు ప్రత్యేక అంతర్రాజ్ల నియామక విధానాన్ని రూపొందిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు, ఇందుకోసం విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, తెలంగాణ రాష్ట్ర అంతర్రాజ్ల సేవల సంస్థతో ఉన్నత విద్యామండలి సమన్వయం చేసుకుంటోంది. ఖాళీల గుర్తింపు, రిజర్వేషన్ల ప్రకారం పోస్టుల కేటాయింపు, నియామక నిబంధనల అమలుకు సంబంధించిన కసరత్తు కొనసాగుతోందని వివరించారు.పరిశోధన, విద్యాభివృద్ధికి విశేష కృషి:అక్టోబర్ 3, 2026న హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయంలో నిర్వహించిన పరిశోధన, విద్య, అభివృద్ధి సదస్సు వివరాలను గవర్నర్‌కు తెలియజేశారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ సదస్సును ప్రారంభించారు, ఉన్నత విద్యాసంస్థల్లో పరిశోధనలను ప్రోత్సహించడం, నూతన ఆవిష్కరణలకు అవకాశాలు కల్పించడం, యువతలో పారిశ్రామిక ఆలోచనలను పెంపొందించడం, పరిశ్రమలు విద్యాసంస్థల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యాలని చైర్మన్ వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు గవర్నర్ ఉన్నత విద్యా మండలిని అభినందించారు.విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యం:ఇటీవల విద్యాసంస్థల్లో చోటుచేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల భద్రతకు సంబంధించి ఉన్నత విద్యామండలి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. విద్యాసంస్థల ప్రాంగణాల్లో భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, జనసమూహాల నియంత్రణ, అత్యవసర వైద్య సదుపాయాలు, ప్రమాద సమయాల్లో విద్యార్థులను సురక్షితంగా బయటకు తరలించడం వంటి అంశాలతో కూడిన నూతన భద్రతా నిబంధనల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు చైర్మన్ తెలిపారు. అంతేకాకుండా ఉన్నత విద్యలో అవసరమైన సంస్కరణలు, డిగ్రీ విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి అనుభవం కల్పించడం, పరిశోధనలకు ప్రోత్సాహం, నూతన ఆవిష్కరణలు, పరిశ్రమలు విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యం, విద్యార్థుల ప్రవేశాల విధానంలో చేపడుతున్న మార్పుల గురించి వివరించారు, ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విశ్వ విద్యాలయాల్లో సమర్థవంతమైన పాలన, నాణ్యమైన విద్యాబోధన, విద్యార్థుల సంక్షేమం, విద్యాసంస్థల భద్రత, అధికారుల జవాబుదారీ తనానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు, త్వరలో నిర్వహించనున్న ఉపకులపతుల సమావేశంలో విశ్వ విద్యాలయాల పనితీరును సమగ్రంగా సమీక్షించి, వాటి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఉన్నత విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అన్ని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యామండలి సమన్వయంతో పనిచేయాలని గవర్నర్ సూచించారు

టీడీపీ తమ్ముళ్లలో బయటపడుతున్న అసంతృప్తి

కాకినాడ, నవంబరు 13,ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ నాయకత్వంపై క్యాడర్ అంత సంతృప్తికరంగా లేరు. ఇటీవల జరిగిన జరిగిన పట్టణ స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించినప్పటికీ, సీట్ల సర్దుబాటు మరియు స్థానిక నాయకత్వ నిర్ణయాలపై తెలుగుదేశం పార్టీ క్యాడర్‌లో పలుచోట్ల అసంతృప్తి వ్యక్తమైంది. కూటమి ధర్మం పేరుతో మిత్రపక్షాలకు సీట్లు కేటాయించడంపై క్షేత్రస్థాయి శ్రేణులు, ఆశావహులు తమ అసహనాన్ని వెళ్లగక్కారు. పార్టీ నుంచి కష్టపడిన తమకు ఎలాంటి పదవులు ఇవ్వకుండా, టీడీపీ కార్యకర్త జెండా వదలకుండా పనిచేస్తాడని చంద్రబాబు కితాబు ఇవ్వడాన్ని కొందరు సోషల్ మీడియా వేదికగా తప్పుపడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరొకలా వ్యవహరించడం ఈ నాయకత్వానికి పరిపాటిగా మారిందని, సీటు దక్కకపోతే రెబల్స్ గా పోటీ చేస్తే తిరిగి పార్టీలోకి చేర్చుకోలేదని చంద్రబాబు చెప్పడంపై కూడా కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ఎన్నికల సమాచారం చూడండికూటమి సీట్ల పంపకాలపై అసంతృప్తిగా క్యాడర్ లో నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల్లో టీడీపీ 89, జనసేన 25, బీజేపీ 9 స్థానాల్లో పోటీ చేసేలా సీట్ల పంపకాలు జరిగాయి.

గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులపై కేసు నమోదు

పునరావాసం, చికిత్స నిమిత్తం డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు

బచ్చన్నపేట విజన్ ఆంధ్ర(నవంబర్) మండల కేంద్రంలోని కొన్నె క్రాస్ రోడ్ సమీపంలో గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను బచ్చన్నపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిన్నరామన్‌చెర్ల గ్రామానికి చెందిన ఇద్దరు, బచ్చన్నపేటకు చెందిన ముగ్గురు యువకులు చింత చెట్ల వద్ద గంజాయి సేవిస్తుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.అనంతరం వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా , యువకుల పునరావాసం, చికిత్స నిమిత్తం డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించాలని ఆదేశించడంతో అక్కడికి తరలించారు .ఈ సందర్భంగా బచ్చన్నపేట ఎస్ఐ శ్రీకాంత్ మండల ప్రజలకు, ముఖ్యంగా యువతకు పలు సూచనలు చేశారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విలువైన జీవితాన్ని, భవిష్యత్తును కాపాడుకోవాలని విజ్ఞప్తి చేసారు . మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తు దెబ్బతింటాయని హెచ్చరించారు.మండలంలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

గైనకాలజీ చికిత్సలో రోబోటిక్ ఆస్త్రచికిత్స ఆధునిక ఆవిష్కరణలు



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ :13(విజన్ ఆంధ్ర)గైనకాలజీ శస్త్ర చికిత్స ల్లో వచ్చిన ఆధునిక పురోహితుల వల్ల అనేక సమస్యలకు చిన్న కోతల చికిత్స అందించే అవకాశం ఉందని యశోద హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ అనిత అన్నారు. శుక్రవారం నాడు సంగారెడ్డి లోని రెడ్లస్ హోటల్లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోబోటిక్ సహాయ శాస్త్ర చికిత్స అటువంటి ఆధునిక విధానాల్లో ఒకటని ఎంపిక గైనకాలజిస్ట్ సమస్యలు పద్ధతిని ఉపయోగిస్తారని తెలిపారు. గైనకాలజీ శస్త్రచికిత్సల్లో వచ్చిన ఆధునిక పురోగతుల వల్ల అనేక సమస్యలకు చిన్న కోతలతో చికిత్స అందించే అవకాశం ఉందన్నారు.ఆపరేషన్ థియేటర్లోని కన్సోల్ ద్వారా శస్త్రవైద్యులు పరికరాలను నియంత్రిస్తూ శస్త్రచికిత్సను నిర్వహిస్తారని అన్నారు.హైడెఫినిషన్ 3డీ కెమెరా ద్వారా శస్త్రచికిత్స చేసే ప్రాంతం పెద్దదిగా, స్పష్టంగా కనిపిస్తుంది. రోబోటిక్ పరికరాలు వంగడం, తిరగడం వంటి కదలికలు చేయగలవు. దీనివల్ల ఇరుకైన ప్రదేశాల్లోనూ సూక్ష్మమైన కదలికలు చేయడానికి వైద్యులకు సహాయపడుతుంది అని అన్నారు.గర్భాశయ ఫైబ్రాయిడ్ల చికిత్సలో రోబోటిక్ శస్త్రచికిత్సను సరిగణించవచ్చు. కొన్ని సందర్భాల్లో గర్భాశయాన్ని కాపాడుతూ ఫైబ్రాయిడ్లను మాత్రమే తొలగించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుంది.ఎంపిక చేసిన ఎండోమెట్రియోసిస్ కేసుల్లో, ముఖ్యంగా పెర్విక్ ప్రాంతంలోని సంక్లిష్టమైన భాగాల్లో వ్యాధి ఉన్నప్పుడు, ప్రభావిత కణజాలాన్ని తొలగించేందుకు రోబోటిక్ సహాయం ఉపయోగపడవచ్చు.రోగి పరిస్థితికి అనుకూలంగా ఉన్నప్పుడు గర్భాశయాన్ని తొలగించే శస్త్రచికిత్సను (హిస్టెరెక్టమీ) కూడా రోబోటిక్ సహాయంతో చేయవచ్చు ఎల్విక్ అవయవాలు కిందకు జారే సమస్యకు చికిం లో భాగంగా, ఎంపిక చేసిన రోగుల్లో అవయవాలకు మద్దతు కల్పించే శస్త్రచికిత్సలను రోబోటిక్ సహాయంలో చేయవచ్చుఅని తెలిపారు.సరైన రోగులకు, ఓపెన్ సర్జరీతో పోలిస్తే మినిమల్లీ ఇన్వేసివ్ శస్త్రచికిత్స ద్వారా చిన్న కోతలు, శస్త్రచికిత్స తర్వాత తక్కువ నొప్పి, ఆసుపత్రిలో తక్కువ రోజులు ఉండటం, త్వరగా రోజువారీ పనులకు తిరిగి వెళ్లే అవకాశం ఉండవచ్చు. కోలుకునే సమయం రోగిని, శస్త్రచికిత్సను బట్టి మారుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ మేనేజర్లు, తిరుమల్, గోపాలు పాల్గొన్నారు.

తెలంగాణా ప్రభుత్వము
తెలంగాణ రాజ పత్రం
భూ సేకరణ అధికారి మరియు సబ్- కలెక్టర్, కల్లూరు వారి రూఢీ ప్రకటన

జిల్లా గెజెట్ నెం.ఎ3/96/2026 తేదీ:10.11.2026

ఫారం – 7

(చూడుము సబ్ రూల్ 1 రూల్ – 25, సెక్షన్ – 19(1) చట్టము – 30/2013)
కలెక్టర్ ఫైల్ నెం. ఙ1/75654/2024 తేదీ:06.11.2026.
భూ.సే అధికారి ఫైల్ నెం. ఎ/126/2026 తేదీ:28.10.2026.

తెలంగాణా ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, ఖమ్మం గారు దిగువ నిర్దిష్ట పరిచిన ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలములోని తాల్లపెంట గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ 0.22 ¾ గుం|| నిమిత్తం అనగా ఎస్.ఆర్.ఎల్.ఐ.పి. (సీతారామ లిఫ్ట్ నీటిపారుదల ప్రాజెక్టు) కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నందున భావించనైనది.

కావున ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలములోని తాల్లపెంట గ్రామములో ఉన్న భూమి సుమారు ఎ 0.22 ¾ గుం|| గల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వారి నుండి భూసేకరణ నిమిత్తం, రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

షెడ్యూలు

గ్రామం :తాల్లపెంట మండలం :పెనుబల్లి జిల్లా :ఖమ్మం

క్ర. నం	సర్వే నెంబరు	భూమి టైటిల్	భూమి రకం	భూసేకరణలో పోవుచున్న భూమి ఎ.గుంటలలో	అనుభవదారు / పట్టాదారు యొక్క పేరు మరియు చిరునామా	హద్దులు తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు మరియు కట్టడములు
1	317/1/2	పట్ట	మెట్ట	0.04 ¼	ఏటుకూరి నాగమణి	328	314	317/1	316/2	-
2	317/1/2	పట్ట	మెట్ట	0.11 ¼	అక్కల భద్రమ్మ, భర్త: రోశయ్య	328	314	317/1	316/2	-
3	317/1/2	పట్ట	మెట్ట	0.01	పోతినీ పాపారావు, తండ్రి: ముత్తయ్య	328	314	317/1	316/2	-
4	317/1/2	పట్ట	మెట్ట	0.06 ¼	అక్కల భద్రమ్మ, భర్త: రోశయ్య	328	314	317/1	316/2	-
			మొత్తం	0.22 ¾						

భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం - 2013 (నెం.30/2013)లోని 15 ప్రకారం పై భూ సేకరణ పై ఎటువంటి అభ్యంతరములు నమోదు కాలేదు. కావున రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. భూసేకరణ కారణంగా ఎవరూ నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించబడు విస్తీర్ణం శూన్యం.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును, లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయపు పని వేళలో కలెక్టరు & జిల్లా మేజిస్ట్రేట్ /ఖమ్మం మరియు భూ సేకరణ అధికారి, సబ్, కలెక్టర్- కల్లూరు వారి కార్యాలయములో పరిశీలించుకోను నిమిత్తము అందుబాటులో ఉండును

సం/- సబ్ కలెక్టర్, కల్లూరు | సం/- అదనపు కలెక్టరు ఖమ్మం జిల్లా | సం/- జిల్లా కలెక్టర్, ఖమ్మం


DIPR RO NO 1130-LA/PP/ADVT/PUB/2026-27 తేదీ 13-11-2026

ఎక్స్ ఆర్మీ వెల్ఫేర్ సొసైటీ లోగో ఆవిష్కరణ సమాజ సేవలోనూ మాజీ సైనికులు ముందుండాలి



కాగజ్‌నగర్, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర): కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షుడు కే. శివకుమార్ ఆధ్వర్యంలో ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ వెల్ఫేర్ సొసైటీ నూతన లోగోను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కాగజ్‌నగర్ డీఎస్పీ ఎండీ వాహిదుద్దీన్, రూరల్ సీఐ కుమారస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కే. శివకుమార్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సైన్యంలో క్రమశిక్షణతో సేవలందించిన మాజీ సైనికులు పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నదే సొసైటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు పోలీసులకు నేరుగా తెలియజేయలేని సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చని, వాటిని సంబంధిత పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టపరిధిలో పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరించడంతో పాటు ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, నిరుపేదలకు సహాయం అందించడం, సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. దేశ సేవలో ఎన్నో త్యాగాలు చేసిన మాజీ సైనికులు సమాజ సేవలోనూ ముందుండటం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పోలీసు శాఖకు, ఎక్స్ ఆర్మీ వెల్ఫేర్ సొసైటీకి మధ్య సమన్వయం పెరిగితే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నూతనంగా ఆవిష్కరించిన లోగో సొసైటీ సేవా లక్ష్యాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పీయూష్ మండల్, జనరల్ సెక్రటరీ సునీల్ మండల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుశాంత్ బుర్మాన్, పి. శివ, ఉత్తమ్, సంజిత్ రాయ్, నరేంద్ర యాదవ్, పురుషోత్తం, రాబిన్ హోల్డర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలి: జలమండలికి జనసేన జనవాణి సూచనలు



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 13 (విజన్ ఆంధ్ర బ్యూరో):నగరంలో తాగునీటి వృథాను అరికట్టి, ప్రతి ఒక్కరికీ మెరుగైన నీటి సరఫరా అందించడమే లక్ష్యంగా జనసేన పార్టీ తెలంగాణ ఆధ్వర్యంలోని జనవాణి బృందం కీలక ప్రతిపాదనలను జలమండలి అధికారుల ముందుంచింది,జనవాణి కోఆర్డినేటర్ విజయ్ బండా నేతృత్వంలో జనసేన ప్రతినిధి బృందం జలమండలి జేడీ మయాంక్ మిథల్‌ను కలిసి పలు సూచనలు చేసింది. ఈ సందర్భంగా జనవాణి పరిశోధన బృందం రూపొందించిన సమగ్ర అధ్యయన నివేదికతో కూడిన వినతిపత్రాన్ని జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి, ఐఏఎస్‌కు అందజేశారు.ఈ సందర్భంగా జనసేన ప్రతినిధి బృందం జలమండలి కమాండ్ సెంటర్‌ను సందర్శించి నగరంలో నీటి సరఫరా పర్యవేక్షణ, ట్యాంకర్ల నిర్వహణ, పానీ యాప్ పనితీరును పరిశీలించింది. మంజీరా, సింగూరు పైప్‌లైన్లలో నీటి లీకేజీలను గుర్తించి అరికట్టేందుకు ఆధునిక ఓటి. సెన్సార్లు, డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించింది.అదేవిధంగా నీటి సరఫరాలో జరుగుతున్న నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, వార్డు స్థాయిలో పౌర నీటి ఆడిట్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలను భాగస్వాములను చేయాలని ప్రతిపాదించింది. వర్షపు నీటి సంరక్షణ, శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి వినియోగించడం వంటి అంశాలపై కూడా పలు నిర్మాణాత్మక సూచనలను అధికారులకు అందించింది.ఈ సందర్భంగా జనసేన పార్టీ తెలంగాణ జనవాణి కోఆర్డినేటర్ విజయ్ బండా మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రతి నీటి చుక్కను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు, నగరంలోని ప్రతి పౌరుడికి మెరుగైన తాగునీటి సరఫరా అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. జలమండలితో సమన్వయం చేసుకుంటూ ప్రజా ప్రయోజనాల దిశగా పనిచేయడానికి జనసేన జనవాణి బృందం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనవాణి బృంద సభ్యులు రవి రాజ్ రాథోడ్, బాలరాజు.జి, రుద్ర శ్రీనివాస్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.నగరంలో నీటి వృథాను అరికట్టి, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రజల భాగస్వామ్యమే కీలకమని జనసేన బృందం ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

కరాటే విజేతలకు అభినందనలు తెలిపిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి



కాగజ్‌నగర్, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (బా+ఖీ) రాష్ట్రస్థాయి క్రీడా పోటీల రెండో రోజు కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత, డా. కొత్తపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కరాటే పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులు ప్రదర్శించిన ప్రతిభను ఆసక్తిగా తిలకించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు కరాటే పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు డా. కొత్తపల్లి అనిత, డా. కొత్తపల్లి శ్రీనివాస్ బంగారు పతకాలను అందజేశారు. విజేతలను ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక వికాసానికి కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటుతున్న యువ క్రీడాకారులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ నిరంతరం సాధన కొనసాగించాలని సూచించారు. కష్టపడి సాధన చేస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చారు. ఈ కార్యక్రమంలో 70వ ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

-నవంబర్ 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అమలు
-నమోదు ప్రక్రియలో పొరపాట్లకు తావివ్వొద్దు
-కలెక్టర్లకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-13(విజన్ ఆంధ్ర)రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ కల్పించడమే పథకం లక్ష్యమన్నారు. నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక జిల్లాలో పథకాన్ని ప్రారంభిస్తారని, అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని తెలిపారు. నవంబర్ 14 నుంచి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, 18న గ్రామాల్లో టాంటాం ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. 19న గ్రామాలు, మండలాలు, పట్టణ వార్డుల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి కుటుంబాల వివరాలు సేకరించాలన్నారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సున్న కుటుంబ సంపాదన సభ్యుల వివరాలను కచ్చితంగా సేకరించాలని సూచించారు. వయస్సు నిర్ధారణకు ఆధార్‌లోని పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. బీమా పొందే వ్యక్తి, కుటుంబ సభ్యులు, నామినీల పేర్లు, ఆధార్ నంబర్లు, మొబైల్ నంబర్లు తదితర వివరాలను నమోదు చేయాలని తెలిపారు. నామినీకి రూ.5 లక్షల బీమా మొత్తం అందే వరకు సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు ,పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి రాజకీయ పార్టీ.. వైసిపికి నష్టమేనా

నెల్లూరు, నవంబరు 13, వైసిపి మాజీ నాయకుడు.. విజయసాయిరెడ్డి తన కొత్త పార్టీని ప్రకటించారు. పరివర్తన రాజనీతి పార్టీ అంటూ దానికి పేరు పెట్టారు. జెండాను కూడా ఆవిష్కరించారు. దేశభక్తి.. ప్రజల సంక్షేమం.. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల పరిరక్షణ తమ ప్రధాన లక్ష్యాలని ఆయన ప్రకటించారు.వైసిపి నుంచి నాయకులు బయటికి వస్తారా.. ఇది ఈ పార్టీకి సంబంధించిన కీలకమైన అంశం. విజయసాయిరెడ్డి ఒకప్పుడు వైసీపీలో కీలక నాయకుడు. జగన్ కు అత్యంత సన్నిహితుడు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా.. పార్లమెంటు వ్యవహారాలలో కీలకపాత్ర పోషించారు. గత ఏడాది జనవరిలో రాజకీయాలనుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఇప్పుడు కొత్త పార్టీని ప్రకటించారు.కొత్త పార్టీ ప్రకటించిన విజయ సాయి రెడ్డికి వైసీపీలో ఉన్న పాత పరిచయాలు ఉపయోగపడే అవకాశం ఉంది. ముఖ్యంగా పార్టీలో ప్రాధాన్యం కోల్పోయిన నాయకులు.. జగన్ నాయకత్వం మీద అసంతృప్తితో ఉన్న నాయకులు.. రాజకీయంగా కొత్త వేదిక కోసం ఎదురుచూస్తున్న యువ నాయకులు విజయసాయి రెడ్డికి ఉపయోగపడే అవకాశం ఉంది.విజయసాయిరెడ్డి తన పార్టీని కేవలం వైసీపీకి ప్రత్యామ్నాయంగా కాకుండా టిడిపి.. వైసిపి.. జనసేనకు భిన్నమైన రాజకీయ వేదికగా పరిచయం చేశారు. ఈ ప్రకారం ఆయన మూడు పార్టీలకు బయట ఉన్న ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. విజయసాయి రెడ్డి ప్రకటించిన ప్రతిపాదనలలో కొన్ని ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. 25 నుంచి 40 సంవత్సరాల వయసు ఉన్న యువతకు 66% టికెట్లు ఇస్తారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తారు.

232 మందికి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే డా. హరీష్ బాబు



పెంచికల్‌పేట్, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండల సర్వసభ్య సమావేశం అనంతరం కొత్తగా మంజూరైన 232 చేయూత పింఛన్లను సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ విడతలో వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందించడం ద్వారా ప్రభుత్వం సామాజిక భద్రత కల్పిస్తోందని పేర్కొన్నారు. పింఛన్లు పొందిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పింఛన్ సొమ్మును కుటుంబ అవసరాలకు, నిత్యావసరాలకు ఉపయోగించుకోవాలని తెలిపారు. అర్హులైన పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చూడాలని అన్నారు. కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్, వివిధ శాఖల అధికారులు, మండలంలోని గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కొత్మీర్ గ్రామ సమీపంలో బోల్తాపడిన కారు అదుపుతప్పి ప్రమాదం దేవజిగూడకు చెందిన యువకుడికి గాయాలు



దహేగం, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగం మండలం కొత్మీర్ గ్రామ సమీపంలో కారు బోల్తాపడి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దేవజిగూడ గ్రామానికి చెందిన మెకార్తి రాకేష్ కారులో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. మార్గమధ్యంలో ఒక్కసారిగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న రాకేష్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన యువకుడిని వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. కారు బోల్తాపడటంతో వాహనం కొంతమేర దెబ్బతిన్నట్లు సమాచారం. ప్రమాదాన్ని చూసిన స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. రహదారిపై వెళ్తున్న వాహనదారులు కూడా కొద్దిసేపు అప్రమత్తమయ్యారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే యువకుడికి గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. కారు వేగం, రహదారి పరిస్థితులు ప్రమాదానికి కారణమై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. వాహనదారులు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యూజీడీ పనులకు శంకుస్థాపన



జవహర్ నగర్, నవంబర్ 13, విజన్ ఆంధ్ర : జవహర్ నగర్ డివిజన్ పరిధిలో బీజేఆర్ నగర్ కాలనీ వాసులు 7డివిజన్ మాజీ కార్పొరేటర్ మెట్టు ఆశ కుమారి సహకారం తో కాలనీ వాసుల స్వంత నిధులతో 200 మీటర యూజీ డీ పనులకు శంకుస్థాపన చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా , సీనియర్ నాయకులు కారింగుల శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

ఏపీలో ఈ మూడు నగరాలు జాతీయ స్థాయిలో రికార్డులు

విశాఖపట్టణం నవంబరు 13,కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతి ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశుభ్రత సర్వే ఫలితాలను వెల్లడిస్తుంటుంది. దేశంలో పరిశుభ్రతను పెంపొందించడం.. స్వచ్ఛతను కాపాడటం దీని వెనుక ఉన్న ఉద్దేశం. పరిశుభ్రమైన నగరాల జాబితాను ప్రకటించి.. వాటికి ప్రోత్సాహకాలను కేంద్రం అందిస్తూ ఉంటుంది. ఈసారి కేంద్రం ప్రకటించిన జాతీయ ర్యాంకింగ్ ల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్లోని మూడు పట్టణాలు కీలక స్థానాలలో నిలిచాయి. తద్వారా ఏపీలో మూడు పట్టణాల గురించి జాతీయస్థాయిలో చర్చ నడుస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు.. అమలు చేస్తున్న విధానాలను ఇతర రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయి.కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సర్వే ఫలితాల ప్రకారం దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా మహారాష్ట్రలోని నవి ముంబై నిలిచింది. రెండో స్థానంలో గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నగరం నిలిచింది. ఇక మూడో స్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నిలిచింది.దక్షిణాది ప్రాంతాలలో విజయవాడ కంటే ఎన్నో పెద్ద నగరాలు ఉన్నాయి. హైదరాబాద్.. చెన్నై.. బెంగళూరు.. తిరువనంతపురం వంటి నగరాలు ఉన్నప్పటికీ.. వాటన్నిటిని దాటేసి విజయవాడ దేశంలోనే మూడవ స్వచ్ఛ నగరంగా ఎదగడం అంటే మామూలు విషయం కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నంలో పరిశుభ్రత మీద ప్రధానంగా ఫోకస్ చేసింది. తడి చెత్త.. పొడి చెత్తను వేరువేరుగా సేకరిస్తుంది. గతంలో టిడిపి ప్రభుత్వం అధికారం ఉన్నప్పుడు నిర్మించిన కేంద్రాలను మరోసారి పునరుద్ధరించింది

వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

డీఎంహెచ్ఓ డా. లలితా దేవి





సంగారెడ్డి బ్యూరో , నవంబర్ :13(విజన్ ఆంధ్ర)జహీరాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని, నిర్దేశించిన అన్ని కార్యక్రమాల్లో 100 శాతం లక్ష్యాలు సాధించేలా అంకితభావంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. లలితా దేవి ఆదేశించారు. శుక్రవారం జహీరాబాద్ డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు, సూపర్ వైజింగ్ సిబ్బందితో సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. తల్లి, శిశు ఆరోగ్యం, రోగ నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ, క్షయ, మలేరియా, డెంగ్యూ నివారణ, మధుమేహం, రక్తపోటు వంటి నాన్ కమ్యూనికబుల్ వ్యాధుల స్క్రీనింగ్, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల పనితీరు తదితర అంశాలపై వివరంగా చర్చించారు. ఈ సందర్భంగా డా. లలితా దేవి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు సకాలంలో ఏఎన్సీ పరీక్షలు, టీకాలు అందించాలని, ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించి, ఏ ఒక్కరూ టీకాలకు దూరం కాకుండా చూడాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. మరమ్మతులు అవసరమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రత్యేకంగా సమీక్షించిన ఆమె, భవనాల మరమ్మతులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన లక్ష్యమని, విధుల నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డా. లలితా దేవి హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డా. నాగ నిర్మల, డా. మనోహర్ రెడ్డి, జహీరాబాద్ డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు, సూపర్ వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పాలనలో రైతులకు తీరని ద్రోహం

నల్గొండ వేదికగా రైతు నేతల ధ్వజం.

12 ఏళ్లలో 5 లక్షల మంది రైతులు,కూలీల ఆత్మహత్యలు

స్వామినాథన్ సిఫారసులతో ఎం ఎస్ పి,ఇవ్వాలి.

ఏఐ కేఎస్ జాతీయ కార్యదర్శి విజ్జూ కృష్ణన్.



ఉమ్మడి నల్గొండబ్యూరో,(విజన్ ఆంధ్ర):కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించి ద్రోహం చేసిందని అఖిల భారత కిసాన్ సభ జాతీయ కార్యదర్శి విజ్జూ కృష్ణన్ తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం నల్గొండలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్గొండలో 36వ జాతీయ మహాసభలు..నవంబర్15 నుంచి18 వరకు నల్గొండలో ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలు జరుగుతాయని తెలిపారు.దేశవ్యాప్తంగా 1.58 కోట్ల మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ 20 రాష్ట్రాల నుంచి1000 మందికి పైగా ఎన్నికైన ప్రతినిధులు,పరిశీలకులతో కలిపి 2000 మంది హాజరవుతారన్నారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి పురిటిగడ్డ అయిన నల్గొండలో మహాసభలు జరగడం చారిత్రకమని,స్ఫూర్తిదాయకమని అన్నారు.రెట్టింపు ఆదాయం హామీ ఏమైంది?..2014లో బీజేపీ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని,స్వామినాథన్ కమిషన్ ప్రకారం సి 2+50 శాతం సూత్రంతో ఎం ఎస్ పి ఇస్తామని హామీ ఇచ్చిందని,కానీ అమలు చేయలేదన్నారు.విత్తనాలు,ఎరువులు, డీజిల్,విద్యుత్ ధరలు విపరీతంగా పెరిగాయని,గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.న్ సి ఆర్ బి లెక్కల ప్రకారం గత 12 ఏళ్లలో 5 లక్షలకు పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు.కార్పొరేట్ దోపిడీకి వ్యవసాయం బలిఖూ సంస్కరణలను నీరుగార్చి,రహదారులు, ప్రాజెక్టుల పేరుతో లక్షల ఎకరాలు లాక్కుంటున్నారని ఆరోపించారు.అమెరికా, ఇయు,యుకె లతో చేస్తున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో విదేశీ సబ్సిడీ పంటలు భారత్ లోకి వస్తే దేశీయ రైతు నాశనమవుతాడని హెచ్చరించారు. 2017-23 మధ్య పంటల బీమా కంపెనీలు రైతులకు పరిహారం ఇవ్వకుండా రూ.60 వేల కోట్లు లాభాలు దండుకున్నాయని విమర్శించారు.ఇతర నేతల డిమాండ్లు- ఒకే వేదికపైఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ ఎల్ నినోతో 365 మండలాల్లో కరువు వచ్చిందని,పత్తి,వరి, మిర్చి పంటలు ఎండిపోయాయని,ఆహార పంటలకు ఎకరాకు రూ.30 వేలు,వాణిజ్య పంటలకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని,రైతు భరోసా బకాయిలు,కౌలు రైతులకు ఇందిరమ్మ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ వీర తెలంగాణ పోరాటంలో 4500 మంది అమరులయ్యారని, నేడు కూడా నల్గొండ రైతు ఉద్యమాలకు వేదికగా మారుతుందని,మహాసభల కోసం లక్షా పది వేల రైతు కుటుంబాలను కలిశామని తెలిపారు.200 స్టాళ్లతో అగ్రి షో,ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ 22ఏ నిషేధిత జాబితాలో అర్హుల భూములను తొలగించాలని,10 లక్షల ఎకరాల అటవీ భూములు సాగు చేస్తున్న పేదలకు 2006 అటవీ హక్కు చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలని,ఉపాధి హామీ నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.నవంబర్16న రాకేష్ తికాయత్ రాక-నవంబర్ 26న దేశవ్యాప్త ఆందోళనమహాసభల ప్రారంభ సభకు ఎస్ కే యం నేతలు రాకేష్ తికాయత్,రావుల వెంకయ్య తదితరులు వస్తారని,నవంబర్ 26న ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా రైతు వ్యతిరేక విధానాలపై ఆందోళన చేస్తామని ప్రకటించారు.

నూతన హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మహేష్ మురళీధర్ భగవత్



వేముల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 13 (విజన్ ఆంధ్ర బ్యూరో):హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్‌గా డాక్టర్ మహేష్ మురళీధర్ భగవత్, ఈరోజు ఉదయం 11:00 గంటలకు బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, నగర పోలీసింగ్‌పై తమ ప్రాధాన్యతలను, కార్యాచరణను వివరించారు.హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా మళ్లీ సేవ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నీ ఉప ముఖ్యమంత్రి , మంత్రివర్గానికి, సలహాదారులకు, డీజీపీ సీనియర్ అధికారులకు కమిషనర్ లను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ నగరంలో పనిచేయడం ఇది మూడోసారి అని గుర్తుచేసుకుంటూ, 2004కు ముందు కమిషనర్లు ఆర్.పి. సింగ్, దినేష్ రెడ్డి ల హయాంలో సౌత్ జోన్ డీసీపీగా, 2010 చివరలో జాయింట్ సీపీ (అడ్మిన్)గా రెండేళ్లు, జాయింట్ సీపీ (స్పెషల్ బ్రాంచ్)గా 7 ▪ 8 నెలలు పనిచేశానని తెలిపారు. ఆ తర్వాత రాచకొండ కమిషనర్‌గా, సీఐడీలో ఏడాది పాటు, రైల్వే, రోడ్ సేఫ్టీ విభాగాలలో, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీగా, డీజీ ర్యాంకులో దాదాపు రెండేళ్ల ఐదు నెలలు బాధ్యతలు నిర్వర్తించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కోర్ అర్బన్ రీజియన్ పునర్వ్యవస్థీకరణ తర్వాత శంషాబాద్, రాజేంద్రనగర్ వంటి కొత్త జోన్లతో పాటు పాత రాచకొండ పరిధిలోని ఆదిభట్ల, పహాడీషరీఫ్, బాలాపూర్, షాద్‌నగర్ వంటి ప్రాంతాలు కలవడంతో హైదరాబాద్ కమిషనరేట్ పరిధి చాలా విస్తరించిందని, మల్కాజిగిరి కమిషనరేట్ విభజన తర్వాత కూడా పోలీసింగ్ సవాళ్లు ఒకే విధంగా ఉన్నాయని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఉన్న సిబ్బంది కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు.నగరంలో శాంతిభద్రతల (లా అండ్ ఆర్డర్) పరిరక్షణ, మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ తమ మొదటి ప్రాధాన్యతలని కమిషనర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో అనుభవం ఉన్న అధికారుల బృందం ఉందని, అందరం కలిసి ఒక బృందంగా (టీమ్ వర్క్) పనిచేసి హైదరాబాద్‌ను 'సేఫ్ సిటీ'గా నిలబెడతామన్నారు. శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటేనే నగరానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, సురక్షితంగా ఉన్నామనే భావన కల్పించడమే ప్రభుత్వ, పోలీసు శాఖల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్యాంగ్‌లు, గ్రూప్ తగాదాలు, ప్రతీకార నేరాల నియంత్రణకు జైలు నుండి విడుదలయ్యే వారి వివరాలను 'టీ-స్పార్క్', సీసీటీఎన్ఎస్ లతో అనుసంధానించి ప్రత్యేకంగా 'జైల్ రిలీజ్ వాచ్' నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీకార దాడులకు పాల్పడే వారిపై స్థానిక పోలీసు, స్పెషల్ బ్రాంచ్, కమ్యూనిటీ నెట్‌వర్క్‌ల ద్వారా సమాచారం సేకరించి మళ్లీ బైండోవర్ చేయడం, ఆర్థిక పూచీకత్తు (ఫైనాన్షియల్ ష్యూరిటీ) తీసుకోవడం, రౌడీ షీట్లు తెరవడం వంటి చర్యలు చేపడతామన్నారు. హత్యల వంటి తీవ్రమైన కేసులలో తక్షణమే నిందితులను అరెస్ట్ చేస్తామని, మొదటిసారి నేరం చేసిన వారు మళ్లీ నేరాల వైపు వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్గనైజ్డ్ క్రైమ్ నియంత్రణకు భారతీయ న్యాయ సంహిత బి.ఎన్.ఎస్ లోని కొత్త నిబంధనలను ఉపయోగిస్తామన్నారు. తరచూ నేరాలకు పాల్పడేవారిపై (హ్యాబిచువల్ అఫెండర్స్), కమర్షియల్ క్వాంటిటీ (20 కిలోలు ఆపై) డ్రగ్స్ కేసుల నిందితులపై ఖచ్చితంగా పీడీ యాక్ట్ నమోదు చేసి 8 నెలల నుండి ఏడాది పాటు జైలులో ఉంచుతామన్నారు. 'ఈగల్' విభాగం ద్వారా దర్యాప్తు నాణ్యతను పెంచి, సంబంధిత మెజిస్ట్రేట్లు, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సమన్వయంతో డ్రగ్స్ కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు బదిలీ చేయించి, పెండింగ్ కేసులలో నిందితులకు ఖచ్చితంగా శిక్షలు పడేలా ప్రత్యేక ట్రయల్ మానిటరింగ్ చేస్తామని స్పష్టం చేశారు.ముందుగా డీసీపీలు, ఏసీపీలతో చర్చించి ప్రతి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్థానిక సమస్యలను అధ్యయనం చేస్తామని, ఆ తర్వాత బేసిక్ పోలీసింగ్‌పై పూర్తి దృష్టి సారిస్తామని కమిషనర్ ప్రకటించారు. సాయంత్రం వేళల్లో నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున సిబ్బంది పోలీస్ స్టేషన్లలో కూర్చోకుండా రోడ్లపైకి వచ్చి చురుకుగా పెట్రోలింగ్ చేయాలని, రాత్రిపూట పెట్రోలింగ్ ఖచ్చితంగా అమలు చేసి మరుసటి రోజు ఉదయం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ సిబ్బంది కూడా ప్రజలకు సహాయపడాలన్నారు. అవినీతి విషయంలో 'జీరో టాలరెన్స్', సివిల్ సెటిల్‌మెంట్లకు 'నో' అనే తన కఠిన సూత్రాలను పునరుద్ఘాటిస్తూ, పోలీసులు అక్రమ వసూళ్లకు పాల్పడితే శాఖపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. భూముల విలువ పెరగడంతో భూ తగాదాల్లో దాడులు పెరుగుతున్నాయని, సివిల్ తగాదాలకు క్రిమినల్ రూపం ఇచ్చి ఫిర్యాదు చేసే అంశాలపై తన గత అనుభవం, ప్రత్యేక న్యాయ సలహాదారుల బృందం (లీగల్ ఒపీనియన్) సహాయంతో పారదర్శకంగా వ్యవహరిస్తామన్నారు. నకిలీ భూమి పత్రాలు, మరణ ధృవీకరణ పత్రాలు సృష్టించే ముఠాలు, కిరాయి హంతకులు, అంతర్రాష్ట్ర ముఠాలు, ఏటీఎం దొంగతనాలు, ఇళ్లలో పనిచేసే వారి ద్వారా జరిగే నేరాలపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.దేశంలో ఏటా సుమారు 1,80,000 మంది, తెలంగాణలో దాదాపు 8,000 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని పేర్కొంటూ, రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'లో స్పందించి ప్రాణాలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని, ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు జాయింట్ సీపీ (ట్రాఫిక్) ఆధ్వర్యంలో పనిచేస్తున్న డీసీపీలతో పాటు, అడిషనల్ డీజీ ర్యాంక్ అధికారి ఇంచార్జ్‌గా నూతనంగా ఏర్పాటైన 'టీ-మార్స్' విభాగం ట్రాఫిక్ నిర్వహణను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. పెండింగ్ ఈ-చలాన్లు ఉన్న వాహనదారులను పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ జరిమానాలు వసూలు చేస్తామని చెప్పారు. చట్టాన్ని గౌరవించే పౌరుల పట్ల స్నేహపూర్వక పోలీసింగ్ (సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్) అందిస్తూ, గతంలో కమిషనర్లుగా పనిచేసిన వి.వి. ఆనంద్ వి.సి. సజ్జనార్ లు ప్రారంభించిన ప్రజాహిత, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ తరహా ఫోరమ్‌ల ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తామని, డయల్ 112, డయల్ 100 కాల్స్‌కు పెట్రోల్ మొబైల్ వాహనాలు తక్షణమే స్పందించేలా, పోలీస్ స్టేషన్లలో కేసులు వెంటనే నమోదయ్యేలా అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీలు ఎం. శ్రీనివాసులు, ఐపీఎస్ (అడిషనల్ సీపీ, క్రైమ్స్), తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్ (అడిషనల్ సీపీ, లా అండ్ ఆర్డర్), జాయింట్ సీపీలు డి. జోయల్ డేవిస్, ఐపీఎస్ (జాయింట్ సీపీ, ట్రాఫిక్), ఎస్.ఎం.విజయ్ కుమార్, ఐపీఎస్ (జాయింట్ సీపీ, స్పెషల్ బ్రాంచ్), ఇతర సీనియర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అన్ని జోన్ల డీసీపీలు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్, ఇతర ప్రత్యేక విభాగాల అధికారులతో సమావేశమై ప్రస్తుత సమస్యలను సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

దాతృత్వ స్ఫూర్తిని చాటిన గీతం బీ-స్కూల్ విద్యార్థులు

-వికాసానంద సేవా సంఘం చిన్నారులతో ఆప్యాయంగా గడిపిన రోజు





సంగారెడ్డి బ్యూరో , నవంబర్ :13 (విజన్ ఆంధ్ర):దాతృత్వం, సేవాభావం, మానవత్వాన్ని చాటుతూ గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎంబీఏ విద్యార్థులు వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. మియాపూర్‌లోని వికాసానంద సేవా సంఘం చిన్నారులతో ఆప్యాయంగా గడిపి వారిలో ఆనందాన్ని నింపారు.ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా 'జాయ్ ఆఫ్ గివింగ్' కార్యక్రమంలో భాగంగా వికాసానంద సేవా సంఘంలోని చిన్నారులను గీతం విద్యార్థులు ఆహ్వానించి, వారితో రోజంతా ఉత్సాహంగా గడిపారు. వివిధ కార్యక్రమాలు, ఆటలు, వినోద కార్యక్రమాలతో చిన్నారులను ఆనందింపజేశారు. సేవా సంఘానికి చెందిన 41 మంది బాలలను గీతం ప్రాంగణానికి తీసుకువచ్చి, వారితో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యాపరంగా, ఆహ్లాదకరంగా, అర్థవంతమైన కార్యకలాపాలతో రోజంతా గడిపారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం ప్రాంగణంలో గీతం బీ-స్కూల్ డైరెక్టర్ డాక్టర్ దీప్తి కృష్ణ, రెసిడెంట్ డైరెక్టర్ డీపీ విష్ణుమూర్తి వర్మ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగించాలని అభినందించారు. సేవాభావంతో చిన్నారుల ముఖాల్లో ఆనందం నింపడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని ఎంబీఏ అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరి, డాక్టర్ శ్రీకాంత్, విద్యార్థి నిర్వాహకులు సమన్వయంతో నిర్వహించారు. బాలల సంక్షేమం, విద్య, సామాజిక బాధ్యత పట్ల గీతం విద్యార్థులు చూపిన చొరవ అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

కూకట్‌పల్లి కాంగ్రెస్ జేఏసీ ఏర్పాటుపై సీనియర్ నేత పులి శివకుమార్ గౌడ్ అభ్యంతరం


పార్టీ ఐక్యతకు భంగం కలగకుండా సమష్టిగా పనిచేయాలి

జేఏసీ ఏర్పాటు వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్న



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 13 (విజన్ ఆంధ్ర బ్యూరో):కూకట్‌పల్లి నియోజకవర్గంలో కొత్తగా కాంగ్రెస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేయడంపై సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు చురుగ్గా కొనసాగుతున్న సమయంలో ప్రత్యేకంగా జేఏసీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో టీపీసీసీ నియమావళికి అనుగుణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నారని, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతానికి సమన్వయంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను, పార్టీ ఎన్నికల హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సమయంలో ప్రత్యేకంగా మరో జేఏసీని ఏర్పాటు చేయడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో స్పష్టం చేయాలని కోరారు.సమాంతరంగా స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయడం వల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడే అవకాశముందని, ప్రతిపక్షాలకు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేసేందుకు అవకాశం కల్పించినట్లవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిణామాలు పార్టీ క్రమశిక్షణకు విఘాతం కలిగించడంతో పాటు నాయకుల మధ్య అపార్థాలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ జేఏసీ ఏర్పాటు వెనుక ఎవరున్నారు? దానికి ఎవరు నాయకత్వం వహిస్తున్నారు? అనే విషయాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ జెండా కింద ఐక్యంగా పనిచేయాలని పులి శివకుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. పార్టీ అభ్యున్నతి, ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి మరింత ఆదరణ పెంచడమే లక్ష్యంగా అందరూ సమష్టిగా ముందుకు సాగాలని ఆయన సూచించారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో అక్కాచెల్లెళ్ల బంగారు పతకాల పంట..!



అయిజ నవంబర్ 13(విజన్ ఆంధ్ర)రాష్ట్రస్థాయిలో నిర్వహించిన తెలంగాణ స్పోర్ట్స్ ప్రీమియర్ లీగ్ (టిఎస్ పి ఎల్) స్కేటింగ్ పోటీల్లో జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి చెందిన అక్కాచెల్లెళ్లు ఆర్. రూపా శ్రీ , ఆర్. అన్విక అద్భుత ప్రతిభ కనబరిచారు. నవంబర్ 13 హైదరాబాద్ లోని బాచుపల్లి కూకట్పల్లి ప్రాంతంలో ఉన్న శ్రీరామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్కేటింగ్ 200 మీటర్ల సింథటిక్ ట్రాక్‌పై జరిగిన ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో ఇద్దరూ స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని అయిజ పట్టణానికి గర్వకారణంగా నిలిచారు.బుల్లెట్ ఆర్. రూపా శ్రీ: అండర్-10 విభాగంలో గోల్డ్ మెడల్. బుల్లెట్ ఆర్. అన్విక: అండర్-8 విభాగంలో గోల్డ్ మెడల్. రాష్ట్రస్థాయి వేదికపై ఒకే ఇంటి నుండి ఇద్దరు చిన్నారులు వేర్వేరు వయసు విభాగాల్లో బంగారు పతకాలు సాధించడం పట్ల స్థానికులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజస్థాన్‌లో 3 రకాల ఓటర్ల జాబితాలు

జైపూర్ రాజస్థాన్ లో మూడు రకాల ఓటర్ల జాబితా తయారైంది. దీంతో అధికారులు తికమకపడుతున్నారు. తాజాగా 2027 స్పెషల్ సమ్మరీ రివిజన్ కింద గురువారం కొత్త ఓటర్ల జాబితాను ప్రచురించారు. ఆ జాబితా ప్రకారం రాజస్థాన్‌లో ఓటర్ల సంఖ్య 5.26 కోట్లుగా నమోదు అయ్యింది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరిలోనే నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ఆ రాష్ట్రంలో 5.15 కోట్ల ఓటర్లు ఉన్నట్లు నమోదు అయ్యింది. ఈ రెండు రకాల ఓటర్ల జాబితా మాత్రమే కాదు.. రాజస్థాన్‌లో మూడో ఓటరు లిస్టు కూడా ఉన్నది. ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఎన్నికల జాబితాలో 5.45 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఆ జాబితాను అక్టోబర్‌లో రిలీజ్ చేశారు. అయితే రాజస్థాన్‌లో మూడు రకాల ఓటర్ల జాబితా ఉండడం, ఆ మూడింటి మధ్య ఓటర్ల సంఖ్యలో తేడా ఉండడం .. అధికారులను కన్ఫ్యూజ్ చేస్తోంది. కేవలం ఏడాది వ్యవధిలోనే మూడు రకాల ఓటర్ల జాబితాను రాజస్థాన్‌లో తయారుకావడం గమనార్హం. ఎస్ఐఆర్ ప్రకారం 5.15 కోట్లు, ఎస్ఈసీ ప్రకారం 5.45 కోట్లు, ఎస్ఎస్ఆర్ డ్రాఫ్ట్‌లో 5.26 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. మూడు జాబితాల్లో వ్యత్యాసం భారీగా ఉండంతో.. ఆ తేడా ఎందుకు వచ్చిందన్న ఆందోళనలో అధికారులు ఉన్నారు.

డిసెంబర్ వరకే హైదరాబాద్‌కు నీళ్లు ఆ తర్వాత తీవ్ర కొరత తప్పదా?

హైదరాబాద్ హైదరాబాద్ మహానగరాన్ని మంచినీటి కొరత ముప్పు వెంటాడుతోంది. నగరానికి నీటిని అందించే సింగూరు, మంజీరా జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న నిల్వలు మరో 42 రోజులకు మాత్రమే సరిపోనున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే డిసెంబర్ తర్వాత నగరంలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సింగూరు, మంజీరా జలాశయాల నుంచి నీటి సరఫరా జరిగే ప్రాంతాలపై కొరత ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో నీటి సరఫరా కష్టతరంగా మారవచ్చని భావిస్తున్నారు.

వీటిలో ముఖ్యంగా శేరిలింగంపల్లి

నియోజకవర్గంపై ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని హెచ్చరికలు వెలువడుతున్నాయి. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం ఈ రెండు జలాశయాల నుంచి నీళ్లు సరఫరా అవుతున్న ప్రాంతాలకు గోదావరి జలాలను మళ్లించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సకాలంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రభావం పడే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

నూతన గృహప్రవేశంలో పాల్గొన్న రమేష్ గుప్తా



కీసర, నవంబర్ 13, విజన్ ఆంధ్ర : కీసరలో లబ్ధిదారుడు బత్తిని శ్రీకాంత్ గౌడ్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిలో గృహప్రవేశం చేశాడు. ఈ గృహప్రవేశంలో కీసర మాజీ ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీ బెలిదే రమేష్ గుప్తా పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోలో గౌని దయానందం గౌడ్, కీసర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్రె బాలమణి పాల్గొన్నారు.

ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు

-అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

-జిల్లాలో పథకం అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి - కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి బ్యూరో , నవంబర్ :13(విజన్ ఆంధ్ర)రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఈ నెల 19 నుంచి అమలు చేయనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు విధివిధానాలు, నమోదు ప్రక్రియ, అవగాహన కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన కుటుంబాలన్నింటినీ పథకం పరిధిలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. తెలంగాణలో జన్మించి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక నమోదు కేంద్రాలు, శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, కుటుంబ జీవిత బీమా నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. నమోదు సమయంలో కుటుంబ సభ్యుల వివరాలు, బీమా ప్రయోజనం పొందే వ్యక్తులు, నామినీల సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు పత్రాలు, నమూనా పత్రాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులందరికీ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులతో మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు, ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పథకం అమలుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది, సాంకేతిక సదుపాయాలు, అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని సూచించారు.అర్హులైన ప్రజలందరికీ పథకంపై అవగాహన కల్పించి, నమోదు చేసుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాండు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జానకిరెడ్డి, అదనపు డీఆర్డీఓ సూర్యారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత ,



వేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 13 (విజన్ ఆంధ్ర బ్యూరో):తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత , సామాజిక రక్షణ కల్పించడమే ముఖ్య ఉద్దేశం అని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటన లో తెలిపారు.ఈ పథకాన్ని నవంబర్ 19 2026 న ప్రారంభించనున్నారు.కుటుంబంలో సంపాదించే వ్యక్తి 18 నుండి 59 సంవత్సరాల వయస్సు గలవారు బీమా పొందేందుకు అర్హులు. వయస్సు నిర్ధారణ కోసం ఆధార్ కార్డులో నమోదు చేయబడిన పుట్టిన తేదీని పరిగణలోకి తీసుకుంటారు.ఈ పథకం కింద సభ్యుడు మరణించినట్లయితే అతని కుటుంబానికి ప్రభుత్వం నుండి 5 లక్షల రూపాయల బీమా మొత్తం చెల్లించబడుతుంది ఈ పథకం కింద నమోదు చేసుకోవడానికి కుటుంబ పెద్ద వివరాలు నామినీ వివరాలు నమోదు చేయవలసి ఉంటుందిబీమాదారులను నమోదు చేయడానికి గ్రామం ,వార్డు స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించబడతాయి డేటా సేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత డిజిటల్ డేటా సంతకం చేసిన దరఖాస్తు పత్రాల స్కాన్ చేసిన కాపీలను బీమా కంపెనీతో పంచుకుంటారుక్లెయిమ్ ప్రాసెసింగ్ విధానం:గ్రామీణ ప్రాంతాలలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మరణ వివరాలను సేకరించి వెబ్ పోర్టల్ ద్వారా అప్లోడ్ చేసి ఎంపిడిఓకి పంపుతారు ఎంపిడిఓ క్లెయిమ్ ప్రామాణికతను పరిశీలించి చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కు పంపుతారు సిపిఓ డిఆర్డిఓ పరిశీలన తర్వాత ఆమోదం కోసం జిల్లా కలెక్టర్ కు సమర్పిస్తారు జిల్లా కలెక్టర్ క్లెయిమ్ ను ఆమోదించి తుది సెటిల్మెంట్ కోసం బీమా కంపెనీకి పంపుతారు. బీమా కంపెనీ క్లెయిమ్ ను ప్రాసెస్ చేసి 5 లక్షల రూపాయలను నామినీలకు బదిలీ చేస్తుందిపట్టణ ప్రాంతాలలో మున్సిపాలిటీలలో వార్డు ఆఫీసర్ ప్రారంభించి మున్సిపల్ కమిషనర్ పరిశీలించి సిపిఓ పిడి మెప్మా పరిశీలించి జిల్లా కలెక్టర్ ఆమోదించి బీమా కంపెనీకి పంపుతారు. మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డు ఆఫీసర్ ప్రారంభించి డిప్యూటీ కమిషనర్ పరిశీలించి మున్సిపల్ కమిషనర్ ఆమోదించి బీమా కంపెనీకి పంపుతారని వివరించారు.

ప్రభుత్వం ప్రకటించిన 10+2 విద్యావిధానం చారిత్రాత్మకం : సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ గుప్తా



కూకట్ పల్లి, నవంబర్ 13 (ప్రజాలక్ష్యం ప్రతినిధి):తెలంగాణ విద్యా వ్యవస్థలో 10+2 విధానం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర విద్యా వ్యవస్థలో చారిత్రాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని కాంగ్రెస్ పార్టీ ముసాపేటకు చెందిన సీనియర్ నేత రమేష్ గుప్త తెలిపారు. శుక్రవారం ఆయన ఓ సమావేశం లో మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న ఇంటర్మీడియట్ (జూనియర్ కాలేజీ) వ్యవస్థ స్థానంలో, వచ్చే విద్యా సంవత్సరం (2027 ▪ 28) నుంచి 10+2 విద్యా విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా 11, 12 తరగతులను పూర్తిగా పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తీసుకురానున్నారు. ఇంటర్మీడియట్ విలీనం. ప్రస్తుతం 10వ తరగతి తర్వాత విద్యార్థులు జూనియర్ కళాశాలల్లో చేరుతున్నారు. నూతన విధానంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ తరహాలోనే నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే గొడుగు కిందకు రానుంది.డ్రాపౌట్ల నివారణ. రాష్ట్రంలో 10వ తరగతి పూర్తి చేసిన తర్వాత సుమారు 40 శాతం మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఇందులో బాలికలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలే ఎక్కువగా ఉన్నారు. 12వ తరగతి వరకు పాఠశాల విద్యలోనే కొనసాగించడం వల్ల డ్రాపౌట్ల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, విద్యార్థులకు భాషా నైపుణ్యాలతో పాటు 12వ తరగతి నుంచే ఉపాధికి ఉపయోగపడే వృత్తిపరమైన నైపుణ్యాలను నేర్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సుల మేరకు పాఠశాల విద్యను మూడు ప్రధాన దశలుగా విభజించనున్నారు:

విద్యా దశ తరగతులు ముఖ్య అంశాలు ప్రాథమిక విద్య నర్సరీ నుంచి 4వ తరగతిపునాది అక్షరాస్యత, సంఖ్యా జ్ఞానం పెంపొందించడం. సెకండరీ విద్య5వ తరగతి నుంచి 8వ తరగతివిషయ పరిజ్ఞానం, ప్రాథమిక నైపుణ్యాలపై దృష్టి. సీనియర్ సెకండరీ విద్య9వ తరగతి నుంచి 12వ తరగతి ప్రత్యేక శిక్షణ, నచ్చిన సబ్జెక్టుల ఎంపిక, నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్న సీఎం కు రమేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కూకట్‌పల్లి మూసాపేట ట్రక్ పార్క్ భూములను అమ్మొద్దు ప్రజా అవసరాలకు ఉపయోగపడే భూములను విక్రయించే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరిచ్చారు?

భూముల విక్రయాలను నిలిపివేయకపోతే సీపీఐ, సీపీఎం పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతాం,మాజీ మంత్రి హరీష్ రావు మాధవరం కృష్ణారావు,



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 13 (విజన్ ఆంధ్ర బ్యూరో):మాజీ మంత్రి హరీష్ రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూకూకట్‌పల్లి నియోజకవర్గంలోని కూకట్పల్లి మూసాపేట ట్రక్ పార్క్ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని నిరసిస్తూ శుక్రవారం ట్రక్ పార్క్ వద్ద ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో భారీ ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హరీష్ రావు, ఎమ్మెల్యే వివేక్ , ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ , శంబిపూర్ రాజు హాజరై ప్రభుత్వ భూముల విక్రయాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిరసనలో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు, సీపీఐ, సీపీఎం నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ,మూసాపేట ట్రక్ పార్క్‌కు సంబంధించిన భూములను కేవలం ప్రజా అవసరాల కోసమే వినియోగించాలని, వాణిజ్య అవసరాలకు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి లేదా ఇతర కమర్షియల్ కార్యకలాపాలకు ఉపయోగించకూడదని చట్టంలోనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటి నిబంధనలను ఉల్లంఘిస్తూ భూములను విక్రయించడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నించడం చట్టవ్యతిరేకమని ఆక్షేపించారు. ప్రజల అవసరాల కోసం కేటాయించిన భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.ఇప్పటికే రాష్ట్రంలో సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన భూములను అమ్మకానికి పెట్టారని, మిగిలిన భూములను సైతం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో తనఖా పెట్టి నిధులు సమీకరించి ఢిల్లీకి పంపాలని చూస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. రాష్ట్ర సంపదను అమ్ముకుంటూ భవిష్యత్ తరాలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని విమర్శించారు.ఎన్నో ఏళ్లుగా వివిధ ప్రభుత్వాల హయాంలో ఎంతోమంది ముఖ్యమంత్రులు ఈ భూములను కాపాడుకుంటూ వచ్చారని, అలాంటి విలువైన భూములను ఇప్పుడు అమ్మకానికి పెట్టడం దురదృష్టకరమన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉన్న హౌసింగ్ బోర్డు స్థలాలు, 200 గజాల స్థలాలు, పార్కులు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, బొందలగడ్డ వంటి ప్రాంతాలను కూడా అమ్ముకునే పరిస్థితికి తీసుకొచ్చారని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై హరీష్ రావు తీవ్రంగా విమర్శలు గుప్పించారు.కూకట్‌పల్లి ప్రాంతంలో భవిష్యత్తులో జనాభా దాదాపు 25 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని, ఇప్పటికే పెద్ద ఎత్తున హైరైజ్ భవనాలు నిర్మితమయ్యాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు పార్కులు, క్రీడా మైదానాలు, పార్కింగ్ స్థలాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వ భూములు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇప్పుడు ఉన్న భూములను కూడా అమ్ముకుంటే భవిష్యత్ తరాలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడానికి స్థలం ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు.మూసాపేట ట్రక్ పార్క్ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించడానికి వీల్లేదని, ప్రభుత్వం వెంటనే వేలం ప్రక్రియను నిలిపివేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే బీఆర్ఎస్ పార్టీతో పాటు సీపీఐ, సీపీఎం పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ భూములను కాపాడుకోవడం కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ,కూకట్‌పల్లి ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రజలకు ఉపయోగపడాల్సిన భూములను విక్రయించడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన భూములను భవిష్యత్ తరాలకు ఆస్తిగా అందించాలే తప్ప, వాటిని వేలం వేసి విక్రయించడం సరికాదన్నారు.ప్రజల ఆస్తులను, ప్రభుత్వ భూములను కాపాడే వరకు తమ పోరాటం ఆగదని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలోమాజీ వివేక్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ ,ఎమ్మెల్సీ నవీన్ కుమార్, శంబిపూర్ రాజు, బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నరసింహ యాదవ్, అవుల రవీందర్ రెడ్డి, తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబురావు, మందాడి శ్రీనివాసరావు, సతీష్ గౌడ్, సబిహా గౌసుద్దీన్, మహేశ్వరీ శ్రీహరి, డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సీపీఐ నాయకులు సత్యం, సీపీఎం నాయకులు కృష్ణ, స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కృషితోనే కాలనీలలో అభివృద్ధి పనులు పూర్తి

మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్



అల్వాల్, నవంబర్ 13 విజన్ ఆంధ్ర :మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చొరవ, కృషితో వివిధ కాలనీలలో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేసుకుంటు న్నామని మచ్చబొల్లారం 191 డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ అన్నారు. శుక్రవారంఆయన, ప్రెసిడెన్సీ కాలనీ లో సీసీ రోడ్, కొత్తగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలతో పాటు పిల్లల ఆట సామగ్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా జితేంద్ర నాథ్ మాట్లాడుతూ....కాలనీలోమెరుగైన మౌలిక సదుపాయాలు, కమ్యూనిటీ సౌకర్యాల కోసం నిరంతరం పని చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.ఈ కాలనీలో ఇన్నిఅభివృద్ధి పనులు చేపట్ట డంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కీలక పాత్ర పోషించారని చెప్పారు. రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు పనులు, రూ. 12.5 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసుకోవడం జరిగింద న్నారు. ఈ సందర్భంగా ఆయనకు కాలనీవాసులు తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రెసిడెన్సీ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బాల్ రెడ్డి, నర్రా శ్రీనివాస్ రెడ్డి, కులకర్ణి, గంగారాం, బంగారు రెడ్డి, అలీ, యూసుఫ్, మురళీధర్, నరేష్, కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి, శ్రీశైలం స్వామి, వెంకట్, వెంకటే గౌడ్, నవీన్, సందీప్ రెడ్డి, సురేందర్ రెడ్డి, దేవా తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా రీ సర్వే చేపట్టాలి

తప్పులకు, వివాదాలకు తావులేకుండా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా,నవంబర్ 13,(విజన్ ఆంధ్ర) ;జిల్లాలో చేపడుతున్న భూముల రీ నర్వే ప్రక్రియను ఎలాంటి తప్పులు, వివాదాలకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం రీ సర్వే పురోగతిపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలను సమీక్షించారు. రీ సర్వే పురోగతిపై రోజువారీ నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సర్వే పరికరాలకు అదనంగా మరికొన్ని రోవర్లను త్వరలో సమకూర్చనున్నట్లు తెలిపారు.సర్వే పూర్తయిన అనంతరం రైతులకు భూముల వివరాలను తెలియజేయాలని, ఎలాంటి అపోహలు, వివాదాలకు అవకాశం లేకుండా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని స్పష్టం చేశారు. సర్వే నిర్వహణతో పాటు రికార్డుల భద్రతకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. భూముల రీ సర్వే పూర్తయితే ప్రస్తుతం నెలకొన్న అనేక భూ సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు భవిష్యత్తులోనూ వివాదాలు తలెత్తకుండా ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దిష్ట లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవరావు, రాథోడ్ రమేష్, ఖైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ అత్యాచార యత్నం కేసులో ముగ్గురు నిందితులకు 20 సంవత్సరాల జైలు శిక్ష

బాధితురాలికి రూ. 3 లక్షల పరిహారం చెల్లించాలని ఎల్.బి. నగర్ గౌరవ సెషన్స్ కోర్టు సంచలన తీర్పు



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 13 (విజన్ ఆంధ్ర బ్యూరో):రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2016 సంవత్సరంలో నమోదైన దోపిడీ మరియు అత్యాచార యత్నం కేసులో (క్రైమ్ నెం. 1046/2016, సెక్షన్లు 394, 376(స్త్ర) తీ/ష 511 ఐపిసి; ఎస్ సి, నెం. 477/2018) ముగ్గురు నిందితులకు నేరం రుజువు కావడంతో ఎల్.బి. నగర్‌లోని గౌరవ 13వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (శ×××× ఎడిజె శ ఎం. వాణి గారు నేడు (13.11.2026) 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అలాగే బాధితురాలికి రూ. 3,00,000/- (మూడు లక్షల రూపాయలు) నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది

కేసు పూర్వాపరాలు:తేదీ 29.10.2016 సాయంత్రం సుమారు 7:00 గంటల సమయంలో (1900 గం.), బాధితురాలు తన సహోద్యోగితో కలిసి సన్‌సిటీలో కూలీ పని ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్నారు. వారు ఉప్పరపల్లిలోని పరమారెడ్డి హిల్స్ వెనుక ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి చేరుకోగానే, మోటార్ సైకిల్‌పై వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వారిని అడ్డగించారు. నిందితులు బాధితురాలి సహోద్యోగిపై దాడి చేసి, అతని వద్ద ఉన్న రూ. 1,500/- నగదును దోచుకున్నారు. అనంతరం నిందితులలో ఇద్దరు బాధితురాలిపై దాడి చేసి, సమీపంలోని పొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేయడానికి ప్రయత్నించారు. బాధితురాలి ఆర్తనాదాలు విన్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని ఆమెను రక్షించారు. స్థానికులను చూసిన నిందితులు తమ మోటార్ సైకిల్‌ను అక్కడే వదిలి పరారయ్యారు.

దర్యాప్తు అరెస్టు:బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు 30.10.2016న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వి. ఉమేందర్గారు కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి, సాంకేతిక ఆధారాలతో తేదీ 01.11.2016 మధ్యాహ్నం 2:00 గంటలకు (1400 గం.) ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం పక్కా ఆధారాలతో కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.

శిక్ష పడిన నిందితుల వివరాలు:

1: అబ్దుల్ జాహెద్, తండ్రి: కీ.శే. అబ్దుల్ హాజీ (30 సం.), వృత్తి: వంట పని, నివాసం: ఇంటి నెం. 4-10-43/6/జ, వాటర్ ట్యాంక్ దగ్గర, న్యూ జలాల్ బాబా నగర్, 9 నెంబర్, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా.

2: మహమ్మద్ జహూర్ తండ్రి: మహమ్మద్ అక్బర్ (24 సం.), వృత్తి: సెంట్రింగ్ పని, నివాసం: ఇంటి నెం. 19-5-44/6/ూ, విద్యాభారతి హైస్కూల్ దగ్గర, అసద్ బాబా నగర్, కిషన్ బాగ్, హైదరాబాద్.

3: మహమ్మద్ నయీమ్ , తండ్రి: కీ.శే. మహమ్మద్ కరీం (28 సం.), వృత్తి: వస్త్ర వ్యాపారం, నివాసం: ఇంటి నెం. 4-10-4/2, దర్గా దగ్గర, జలాల్ బాబా నగర్, రాజేంద్రనగర్.

న్యాయస్థానం విధించిన శిక్ష వివరాలు:

విచారణ అనంతరం సాక్ష్యాధారాలను పరిశీలించిన గౌరవ న్యాయమూర్తి శ్రీమతి ఎం. వాణి గారు ముగ్గురు నిందితులను (ఏ 1 నుండి ఏ 3) దోషులుగా నిర్ధారిస్తూ కింది విధంగా శిక్ష విధించారు:

సెక్షన్ 394 ఐపిసి కింద: 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ. 1,000/- జరిమానా.

సెక్షన్ 376-ణ ఐపిసి కింద: 20 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ. 5,000/- జరిమానా (జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 3 నెలల సాధారణ జైలు శిక్ష).బాధితురాలి పరిహారం: బాధితురాలికి రూ. 3,00,000/- (మూడు లక్షల రూపాయలు) పరిహారం చెల్లించాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

అధికారులకు అభినందనలు:ఈ కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా సమర్థవంతంగా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏ పి పి) పి. మంజులా దేవి ని, కేసును పకడ్బందీగా దర్యాప్తు చేసిన అప్పటి ఇన్‌స్పెక్టర్ వి. ఉమేందర్ ని, ప్రస్తుత రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ ఆర్. వెంకటేష్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ సి డి ఓ,మహమ్మద్ ఇబ్రహీం (పి సి 9747), సమన్స్ అధికారి వై. నర్సింలు (పి సి 5905) మరియు లైజన్ ఆఫీసర్ వై. సాంబయ్య (హెచ్ సి 6528, సి సి ఎస్ దరాబాద్) గార్ల కృషిని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డిసిపి రాజేంద్రనగర్ జోన్ ప్రత్యేకంగా అభినందించారు.

బేలా మార్కెట్ యార్డ్‌లో పత్తి కొనుగోళ్లు, ప్రారంభించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఏఎంసీ ఛైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా బేలా మార్కెట్ యార్డ్‌లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పత్తి కొనుగోళ్ల ముహూర్త పూజలో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో పత్తి క్వింటాల్ ధర రూ. 8,910 పలకడం జరిగిందని వారు తెలిపారు. ధరలో మరో రూ. 50 అదనంగా పెరిగితే రైతులు మరింత లబ్ధి పొందుతారని తెలిపారు.. ప్రస్తుతం మంచు కురుస్తున్నందున పంటలో తేమ శాతం పెరిగే అవకాశం ఉందని, రైతులు పంటను 8 నుండి 12 శాతం తేమ శాతానికి తీసుకువచ్చి మార్కెట్‌కు విక్రయానికి తీసుకురావాలని కోరారు. హర్యానా వంటి ప్రాంతాలలో పశువులు ఎక్కువగా ఉండటం వల్ల అక్కడ సీడ్‌కు రూ. 200 వరకు ధర అధికంగా వస్తుందని, మన ప్రాంతంలో కూడా రైతులు తగిన తేమతో నాణ్యమైన పత్తిని తెస్తే అందరికంటే రూ. 200 ఎక్కువ ధర ఇప్పించే విధంగా ఎమ్మెల్యే గారు తాము కలిసి తగిన కృషి చేస్తామని భరోసానిచ్చారు. రైతులందరూ ఈ విషయాన్ని గ్రహించి, నాణ్యమైన పంటను విక్రయించి లాభాలు పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ గజానంద్, కార్యదర్శి శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ రాందాస్, మాజీ మార్కెట్ చైర్మన్లు వామన్‌రావు వాంఖడే, అశోక్ రెడ్డి, మైనారిటీ చైర్మన్ బేలా అబ్దుల్ కరీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావర్, సర్పంచులు బద్దం జగదీశ్వర్ రెడ్డి, శంకర్ భోక్రే, బేలా ఉప సర్పంచ్ ప్రకాష్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రాజు, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఈశ్వర్,అలీం తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ముస్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)అదిలాబాద్ పట్టణంలోని వినాయక్ చౌక్‌లో ఎస్.టి. జోసెఫ్స్ కాన్వెంట్ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రహరి క్లబ్ డ్రగ్ అబ్యూస్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థి దశ ఎంతో విలువైనదని, ఈ సమయంలో మంచి లక్ష్యాలను ఏర్పరచుకొని విద్య, క్రీడలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు అలవాటు పడకుండా ఉండటమే కాకుండా, ఎవరైనా మాదకద్రవ్యాల ప్రభావానికి గురవుతున్నట్లు గుర్తిస్తే వారికి సరైన అవగాహన కల్పించి సహాయం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులతో పాటు ప్రజల్లో కూడా విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎస్.టి. జోసెఫ్స్ కాన్వెంట్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు నో చెప్పండి.. ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోండి.. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కండి అని విద్యార్థులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. మంచి సమాజ నిర్మాణం నేటి విద్యార్థుల నుంచే ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి డ్రగ్స్ రహిత అదిలాబాద్ నిర్మాణానికి సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్‌తో పాటు మున్సిపల్ కౌన్సిలర్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ వడ్డీ వెంటనే చెల్లించాలి

- సీఈఓకు పెన్షనర్ల సంఘం వినతి



సిద్దిపేట, నవంబర్ 13: పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు జీపీఎఫ్ (GPF) సొమ్మును ఆలస్యంగా చెల్లించిన కాలానికి రావాల్సిన వడ్డీని వెంటనే చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (SGPA) సిద్దిపేట జిల్లా శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ముఖ్య కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ)కు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో నిర్వహించిన జిల్లా శాఖ సమావేశంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పెన్షనర్లకు హెల్త్ కార్డుల ద్వారా వైద్య సేవలను సక్రమంగా అందించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, పీఆర్సీని ప్రకటించి వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 202324, 202425 సంవత్సరాల్లో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు వారి భవిష్య నిధి (జీపీఎఫ్)లో పొదుపు చేసుకున్న మొత్తాన్ని ఆలస్యంగా చెల్లించడంతో ఆర్థికంగా నష్టం వాటిల్లిందని నాయకులు పేర్కొన్నారు. ఆలస్యమైన కాలానికి అర్హులైన పెన్షనర్లందరికీ నిబంధనల ప్రకారం రావాల్సిన వడ్డీని చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జోగు బిక్షపతి, జిల్లా అధ్యక్షులు జిల్లా నరసింహులు, ప్రధాన కార్యదర్శి బోరెడ్డి మధుసూదన్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బన్సీలాల్, ఇంద్రసేనారెడ్డి, అన్నమరెడ్డి సత్తయ్య, భగవాన్ రెడ్డి, విష్ణు, విజయకుమార్, రామస్వామి, లక్ష్మీనారాయణ, చోటేమియా, కిషన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ కబ్జాలు

- పేదవారిపై దాడులకు దిగుతున్న బల్మూర్ వెంకట్ అనుచరులు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ను ముందు పెట్టి సీఎం రేవంత్ రెడ్డి కబ్జాలకు పాల్పడుతున్నారని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆరోపించారు. వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ భూ కబ్జాకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ వివాదాస్పద స్థలాన్ని శుక్రవారం సందర్శించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ…సుమారు 18 సంవత్సరాల క్రితం అజ్మత్ కొనుగోలు చేసిన స్థలానికి సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ, ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అజ్మత్ నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను పోలీసుల సమక్షంలో బలవంతంగా కూల్చివేశారని తెలిపారు.కోర్టు ఆదేశాల మేరకు స్థలంలోకి ప్రవేశించరాదని ఏర్పాటు చేసిన బోర్డుకు పెట్రోల్ పోసి నిప్పంటించారని ఆరోపించారు. అజ్మత్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, పొలంలో నుంచి దారి ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. బాధితుల పక్షాన న్యాయం ఉందని చెబుతున్నప్పటికీ, 74 సంవత్సరాల వయస్సున్న పెద్దమనిషిని ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లో ఉంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేద, సామాన్య ప్రజల భూములకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని, కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. భూ వివాదంపై సమగ్ర విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు గోపాల్,శుభప్రద్ పటేల్,మేక చంద్ర శేఖర్,అనిల్ తదితరులు ఉన్నారు.

నీటి లభ్యతకు అనుగుణంగా రబీ పంటల సాగు ప్రణాళిక రూపొందించాలి

- ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)రాబోయే రబీ 2026-27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగును తగ్గించి, ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్లు, విద్యాశాఖ, విద్యా మౌలిక సదుపాయాలు, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, ఎదీ-+=ూవీ+ పనుల పురోగతిపై సీఎస్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతులకు నీటి లభ్యతను బట్టి పంటల ఎంపికపై అవగాహన కల్పించాలని, పంటల వైవిధ్యీకరణతో పాటు సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలని సీఎస్ సూచించారు. రైతు ఐడీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటు, ఖరీఫ్ ఉత్పాదకత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించిన రైతులకు సైతం కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను ముందుగానే సిద్ధం చేసి రైతుల వివరాల నమోదు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరును ఎఫ్ఆర్ఎస్ విధానం ద్వారా పర్యవేక్షిస్తూ కనీసం 90 శాతానికి పెంచాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుదలకు డిజిటల్ అభ్యసన వేదికలను వినియోగించుకోవాలన్నారు రూసా 2.0, పీఎం ఉషా, సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద చేపట్టిన పనులను వేగవంతం చేసి, మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్లతో చేపట్టిన 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులను, రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కుక్కలను గుర్తించి నిబంధనల ప్రకారం పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఎదీ-+=ూవీ+ పథకం కింద నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, కాలువల శుభ్రతతో పాటు ఇతర పనులను సకాలంలో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, రాజేశ్వర్, ఆర్డీవో జగదీశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి
- యంగ్ ఇండియా పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
- సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను గడువులోగా పూర్తి చేయాలి
- జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



గద్వాల నవంబర్ 13(విజన్ ఆంధ్ర బ్యూరో): రాబోయే రబీ 2026-27 సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, రైతులను వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, విబి జీరాంజీ పనుల పురోగతిపై శుక్రవారం హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. రైతులను ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించాలని, సూక్ష్మ సేద్య విధానాలను ప్రోత్సహించాలని తెలిపారు. పంటల వైవిధ్యీకరణ, రైతు ఐడీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం ప్రైవేటు మార్కెట్‌లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సీఎస్ సూచించారు. రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించినప్పటికీ, ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు వచ్చే రైతులకు కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యాశాఖపై సమీక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ సూచించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరును పర్యవేక్షించాలని, విద్యార్థుల హాజరు కనీసం 90 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని క్రమం తప్పకుండా సమీక్షించాలని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు మెరుగ్గా ఉంటే విద్యార్థుల హాజరు కూడా పెరుగుతుందని, క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్ల వ్యయంతో 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ.625 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పనుల పురోగతిని కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షిస్తూ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సీఎస్ సూచించారు. భూసేకరణ కోసం అవసరమైన నిధులను కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భూసేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలని సీఎస్ సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి, నిబంధనల ప్రకారం వాటిని పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీబీ జిరాంజీ పథకం కింద చేపట్టే పనులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, గ్రామాల్లో నీటి సంరక్షణ నిర్మాణాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్ సూచించారు. నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే పనులను విస్తృతంగా చేపట్టాలని, అన్ని సాగునీటి కాలువలను శుభ్రం చేసి అవసరమైన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ విసిలో పాల్గొని జిల్లా అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రిమ్స్‌కు అదనంగా 18 పీజీ వైద్య సీట్లు మంజూరు...

- జిల్లా కలెక్టర్ రాజర్షి షాను ఘనంగా సన్మానించిన రిమ్స్ వైద్య బృందం



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో వైద్య విద్య, వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేక చొరవ, కృషి ఫలితంగా రిమ్స్‌కు అదనంగా 18 పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య సీట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్‌తో పాటు వైద్యుల బృందం శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిశారు. పీజీ సీట్ల మంజూరుకు విశేష కృషి చేసిన కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. అదనపు పీజీ సీట్లతో రిమ్స్‌లో వైద్య విద్యావకాశాలు మెరుగుపడటంతో పాటు, భవిష్యత్తులో నిపుణులైన వైద్యుల తయారీకి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడనుంది.

మత్తుపదార్థాల నిర్మూలనకు విస్తృత ప్రచారం నిర్వహించాలి

- నషా ముక్త్ భారత్ అభియాన్' పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించి, మత్తుపదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా రూపొందించిన మత్తుపదార్థాల నివారణ ప్రచార పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డి ఈ ఓ మాధవి, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మనోహర్ రావు, స్టేట్ ఈసీ మెంబర్ రాజేశ్వరరావు, డైరెక్టర్లు రాజు, బండారి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాజీఎమ్మెల్యేనుకలిసినబి ఆర్ఎస్ నేతలు.

నారాయణపేట, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే



రాజేందర్ రెడ్డి కార్తీక మాసలో చేపట్టే పూజా కార్యక్రమానికి నారాయణపేట కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ మాజీ మార్కెట్ చైర్మన్ మాజీ కౌన్సిలర్ జ్యోతి లు శుక్రవారం రాయచూర్ లోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో చేపట్టిన పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. కార్తీక మాసంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే మాజీ ఎమ్మెల్యే రాజేందర్రెడ్డి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పెద్ద ఎత్తున పూజ నిర్వహించడంతో ఆ పూజా కార్యక్రమానికి బి ఆర్ఎస్ పార్టీ నేతలతో పాటు ప్రజాప్రతినిధులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు పూజ అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలలు పెద్ద పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలి

-విద్యార్థులు జిజ్ఞాస, క్రమశిక్షణ, మంచి అలవాట్లను అలవర్చుకోవాలి.

-ప్రపంచ బాలల దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రియాంక.



నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : బాలలు పెద్ద పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. గార్డెన్స్ లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై ముందుగా చాచా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూప్రతి సంవత్సరం నవంబర్ 14న భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పిల్లల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు జీవితంలో పెద్ద పెద్ద కలలు కనాలని, భవిష్యత్తులో తాము ఏ స్థాయికి చేరుకోవాలనుకుంటున్నారో ఇప్పటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. రాకెట్ సైంటిస్టులు, జిల్లా కలెక్టర్లు, ఐపీఎస్ అధికారులు, ప్రొఫెసర్లు, గొప్ప పారిశ్రామికవేత్తలు కావాలనే ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలని అన్నారు. అయితే కలలు కనడంతోనే సరిపోదని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై సమాన ఆసక్తి పెంచుకోవాలని, తమకు ఇష్టమైన విషయాల్లో మరింత ప్రతిభ కనబరుస్తూనే, కష్టంగా భావించే సబ్జెక్టులను కూడా శ్రద్ధగా నేర్చుకోవాలని తెలిపారు. ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంపొందించుకోవాలని, ఉపాధ్యాయులను ప్రశ్నలు అడుగుతూ విషయాలను లోతుగా అర్థం చేసుకోవాలని సూచించారు. పుస్తక జ్ఞానంతో పాటు సమాజం, పరిసరాలు, దేశంలో జరుగుతున్న విషయాలపై కూడా అవగాహన పెంచుకోవాలని అన్నారు. అదేవిధంగా కులం, మతం, ప్రాంతం, ఆడ, మగ అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాలని కలెక్టర్ సూచించారు. ఇతరులలోని భిన్నత్వాన్ని గౌరవించాలని, ఎవరినీ తక్కువ చేసి చూడకూడదని, తోటి విద్యార్థులను వేధించడం, ఎగతాళి చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లలో అనవసరమైన రీల్స్, సోషల్ మీడియా, గేమ్స్‌కు ఎక్కువ సమయం కేటాయించకుండా, విజ్ఞానాన్ని పెంపొందించే సైన్స్, గణితం, విద్యా సంబంధిత వీడియోలను వీక్షించాలని సూచించారు. పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, పాఠశాలల్లోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పుస్తక పఠనం వల్ల ఆలోచనా పరిధి, సృజనాత్మకత, జ్ఞానం పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకొని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ, విజేతలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, డీఈఓ గోవింద రాజులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అశోక్, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, ఎంఈఓ బాలాజీ, ఏ ఎం వో విద్యా సాగర్, రాజేంద్ర కుమార్, డీ సీ పీ వో కరిష్మా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ సమైక్య భవనానికి భూమి పూజ



కృష్ణ, నవంబర్ 13(విజన్ ఆంధ్ర) : కృష్ణ మండల పరిధిలోని ముడుమాల్ గ్రామంలో శుక్రవారం గ్రామ మహిళ సమైక్య భవనం నిర్మాణానికి గ్రామ సర్పంచ్ మరియు కాంగ్రెస్ నాయకులు భూమి పూజ నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వి బి జి రామ్ జి పథకం క్రింద రూల్ 10 లక్షల వ్యయంతో గ్రామంలో వివో భవనాన్ని భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కె బాల్రాజ్, మాట్లాడుతూ గ్రామంలోని మహిళా సంఘాల సమావేశాల ఆర్థిక లావాదేవీలు మరియు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించుటకు సొంతభవనం భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ భవనాన్ని నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తిచేసి మహిళలకు ఆర్థికంగా అభివృద్ధి చెంది విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు,ఏఈఈ మధు, ఉపసర్పంచ్ తనయుడు జీ వెంకటేష్, ఏపీఎం వనిత కుమారి, వార్డు సభ్యులు చెన్నయ్య గౌడ్, మరియు చాకలి మారెప్ప, చాకలి గోపాల్, మరియు గ్రామ సంఘ మహిళ లీడర్లు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తమప్ప, వాకిటి భీమ్ శంకర్, టి నరసింహ,ఎం గోపాల్, రంగప్ప, కే లింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఆశా కార్యకర్తల సంఘీభావం



నారాయణపేట ,నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లాకు చెందిన పలువురు ఆశా కార్యకర్తలు సమ్మె శిబిరానికి చేరుకుని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో వారు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న పోరాటానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. 32 రోజులుగా ఉద్యోగులు ఎండా, వానలను సైతం లెక్కచేయకుండా సమ్మె కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం యూనియన్ కోశాధికారి రాఘవేందర్, సభ్యులు మోనేష్ చారి, తిరుపతి, శ్వేత శ్రీ, అన్వేష్, కిరీటి, విరోజా, సమీనా, వినోద్, నరేందర్, చందన, నవీన, సోహెల్, మునీర్, అజారుద్దీన్, రామేశ్వరి, నాగజ్యోతి, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 16న పిల్లల కోసం ప్రత్యేక ప్రజావాణి..

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నవంబర్ 13 (విజన్ ఆంధ్ర బ్యూరో) : బాలల వారోత్సవాలలో భాగంగా గద్వాల ఐడిఓసి మీటింగ్ హాల్ నందు ఈ నెల16న సాధారణ ప్రజావాణితో పాటు పిల్లల కోసం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం మరియు బాలల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలలు తమకు ఎదురవుతున్న సమస్యలు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, వివక్ష, బాలల రక్షణ, బాల కార్మికులు, బాల్య వివాహాలు, పాఠశాలల్లో ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై తమ ఫిర్యాదులు, వినతులను నేరుగా అధికారులకు సమర్పించవచ్చని తెలిపారు. బాలల సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కావున జోగులాంబ గద్వాల జిల్లాలోని 18 సంవత్సరాల లోపు బాలలు స్వయంగా గాని, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సహాయంతో గాని తమ యొక్క ఫిర్యాదులను సమర్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

బ్యాంకింగ్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి..

- రైతుల పంట రుణాల రీషెడ్యూల్‌కు చర్యలు....జిల్లా కలెక్టర్ రాజర్షి షా

- సాంగిడిలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన శాఖ ప్రారంభం



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)గ్రామీణ ప్రజలు, రైతుల ఆర్థికాభివృద్ధిలో బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తాయని, సాంగిడి పరిసర గ్రామాల ప్రజలు నూతనంగా ప్రారంభించిన తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం బేల మండలం సాంగిడి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన శాఖను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కలెక్టర్ సందర్భంగా మాట్లాడుతూ.. బ్యాంకింగ్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు చేరువ కావడం వల్ల రైతులు, మహిళా సంఘాలు, కూలీలు, చిరువ్యాపారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలు తెరిచి పొదుపు అలవాటు చేసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆర్థిక సాయం, రాయితీ రుణాలు పొందేందుకు బ్యాంకు ఖాతాలు అవసరమని తెలిపారు. రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన వర్షాలు కురవక పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులను ఆదుకునేందుకే బేల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించామని కలెక్టర్ పేర్కొన్నారు. పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నారని, నష్టపోయిన ప్రతి ఎకరా వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నారని తెలిపారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు బ్యాంకుల ద్వారా పొందిన పంట రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ అప్పారావు, శాఖ మేనేజర్ రోహిత్ శర్మ, సర్పంచులు భూపతిరెడ్డి, అశోక్ ఠాక్రే, నాయకులు రఘుకుల్ రెడ్డి, రూపేష్ రెడ్డి, బాలచందర్, నాయబ్ తహసీల్దార్ వామన్, బ్యాంకు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ నూతన భవనంలో అధికారిక వృత్తి కార్యక్రమాలు చేపట్టే వేడుకలో భాగంగా తెలంగాణ శాసన సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ సిడిపి(ఎంఎల్సి), జిల్లా పరిషత్ (ఎస్ఎంజి) నిధులు 72 లక్షల వ్యయంతో చేపట్టిన జిల్లా పరిషత్ నూతన కార్యాలయ భవన ప్రహరీ గోడ, అంతర్గత సి.సి.రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ....ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా బాధ్యతాయుతంగా అధికారులు స్పందించాలని ఆయన తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధుల సూచనలు, అధికారుల సహకారం కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సభాపతిఅధికారులను ఆదేశించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రతి ఉద్యోగి పనిచేయాలని ఆయన సూచించారు. నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్ లను వారి చాంబర్లలో స్పీకర్ గడ్డ ప్రసాద్ కుమార్ శాలువాలతో సత్కరించి ఆసీనులను గావించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా , జిల్లా పరిషత్ సీఈవో సుధీర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, వికారాబాద్ ఏఎంసి చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ మల్లేషం, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రబీ పంటల సాగు పై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలో రబీ పంటల సాగు కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించి, ప్రతి జిల్లాలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అనువైన పంటల సాగును ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నేడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి సీనియర్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో వ్యవసాయం, ఉద్యానవన శాఖ, సూక్ష్మ సేద్యం, బిందు సేద్యం, కూరగాయలు, పప్పుధాన్యాల సాగు, ధాన్యం కొనుగోళ్లు, భూసేకరణ సమస్యలు, పాఠశాల విద్యా కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు ఇచ్చిన ఆదేశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రధాన కార్యదర్శి వివరించారు. ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లందరినీ తమ తమ జిల్లాలకు టీమ్ లీడర్లుగా అభివర్ణించారని, ప్రభుత్వ ప్రాధాన్యతలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లపై ఉందని తెలిపారు. వ్యవసాయం రబీ కార్యాచరణ ప్రణాళిక: రాబోయే రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రతి జిల్లాలో పంటల సాగుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేపట్టాలని తెలిపారు. రబీ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, రైతులకు సకాలంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కూరగాయలు, పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను గరిష్టంగా వినియోగించుకొని సాగు విస్తీర్ణం, ఉత్పాదకత పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సూక్ష్మ సేద్యం, ముఖ్యంగా బిందు సేద్యం విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

విద్యా కార్యక్రమాలపై సమీక్ష: జిల్లా కలెక్టర్లు తరచుగా ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యా కార్యక్రమాల అమలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, బోధనా ప్రమాణాలను పరిశీలించాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో అవసరమైన పారిశుద్ధ్య పనులు చేపట్టి, పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. వీబీ–జీ రామ్ జీ (VB-G RAM G) కార్యక్రమం విస్తరణకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి నిర్దేశించిన ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా స్థాయిలో కార్యక్రమాల పురోగతిని కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు వికారాబాద్ జిల్లా నుండి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పూర్తిగా రూపుమాపాలి..

- రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిఘా కొనసాగాలి

- డయల్ 100, బ్లూ కోర్ట్ సిబ్బందిచే గ్రామాలలో విస్తృత అవగాహన కల్పించాలి

- దర్యాప్తునందు నాణ్యత ప్రమాణాలు పాటించాలి.


- జిల్లా పోలీసు అధికారులచే నెలవారి నేర సమీక్ష సమావేశం.

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్క పోలీసు అధికారి కృషి చేయాలని, విధుల నిర్వహణ లో జవాబుదారీతనం, నిజాయితీ అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరం లో జిల్లా పోలీసు అధికారులచే నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా పూర్తిగా ఆసాంఘిక కార్యకలాపాలను రూపుమాపే దిశగా పోలీసు విధులను చేపట్టాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులను సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి, గుడుంబా, మాదకద్రవ్యాలు, గ్యాంబ్లింగ్, గేమింగ్ లాంటివి జరగకుండా పటిష్ట మైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నేరాల నియంత్రణకు, నేర పరిశోధనకు సిసిటివి కెమెరాల పాత్ర కీలకంగా వ్యవహరిస్తుందని ప్రతి గ్రామం నందు ప్రతి పట్టణం నందు సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలని తెలిపారు. సైబర్ క్రైమ్ బాధితులకు తిరిగి డబ్బులు అందే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలలో పోలీసుల పట్ల నమ్మకం పెంచే విధంగా విధుల నిర్వహణ జరగాలని, విధులను నీతి నిజాయితీలను తప్పనిసరి కలిగి ఉండాలని తెలిపారు. రౌడీ షీటర్లను మరియు సస్పెక్ట్ షీటర్లను తరచూ తనిఖీ చేస్తూ వారి కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. ముఖ్యంగా మహిళల పట్ల జరుగు నేరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిందితులకు చట్టపరంగా శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్లో వారిగా నమోదైన కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి ఒక్క కేసు పై విచారణ జరిపారు. కోర్టు డ్యూటీ అధికారుల తో ప్రతి వారం సమీక్షిస్తూ కోర్టుల నందు శిక్షణ కరిగే విధంగా దర్యాప్తు లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. కోర్టులలో నందు సరైన శిక్షలు పడినప్పుడు ప్రజలలో పోలీసు పట్ల ఉండే నమ్మకం మరింత పెరుగుతుందని సూచించారు. పోలీస్ స్టేషన్ నందు వివిధ రంగాలలో ప్రతిభగల పరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి మౌనిక ఐపీఎస్, ఎఎస్పి రుత్విక్ సాయి కొట్టే ఐపిఎస్, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పోలీస్ కార్యాలయం ఏవో శివ కుమార్, జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కిల్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్హెచ్ఓలు, ఎస్ఐ లు, ఐటీ కోర్, డి సి ఆర్ బి, పోలీసు కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ఘనంగా ప్రారంభం క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలి: ఎమ్మెల్యే డా. హరీష్ బాబు



కాగజ్‌నగర్, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు క్లబ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్17 బాలబాలికల కరాటే సెలక్షన్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు, సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఈ పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. గెలుపు సాధించిన వారు మరింత కష్టపడాలని, ఓటమి ఎదురైన వారు నిరుత్సాహపడకుండా భవిష్యత్తులో విజయం సాధించేందుకు కృషి చేయాలని హితవు పలికారు. పోటీల నిర్వహణలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి పోటీలు సజావుగా జరిగేలా చూడాలని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న బాలబాలికలందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఇందిర, కన్వీనర్ ఈశ్వర్, పీడీ మధుసూదన్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ దామె రాజారెడ్డిని సత్కరించిన బి.నర్సింగరావు



హైదరాబాద్, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : ప్రముఖ సినీ దర్శకులు, గౌరవ డాక్టరేట్ గ్రహీత బి.నర్సింగరావు ప్రముఖ వైద్య నిపుణుడు, డా.దామె రాజారెడ్డిని పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. వైద్యరంగంలో అంతర్జాతీయ గుర్తింపు పొందడంతోపాటు, 88 ఏళ్ల వయస్సులోనూ చరిత్ర, నాణేల పరిశోధన రంగాల్లో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను ఈ సందర్భంగా అభినందించారు. ఉపన్యాసం అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో తెలంగాణ ప్రాచీన చరిత్ర, నాణేల పరిశోధన, పురావస్తు సంపద పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. పురావస్తు ప్రదేశాల సంరక్షణ, శాస్త్రీయ తవ్వకాలు, నాణేల డాక్యుమెంటేషన్, మ్యూజియంల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ హైదరాబాద్ సర్కిల్‌కు చెందిన డా.రోహిణి, భారత భూగర్భ సర్వేక్షణ సంస్థ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వేణుగోపాల్, శ్రీరామోజు హరగోపాల్, చరిత్ర పరిశోధకులు డా.ద్యావనపల్లి సత్యనారాయణ, భద్ర గిరీష్, శ్యాంసుందర్, శోభాసింగ్, కోటేశ్వర్, కేశవ, రాజశేఖర్, ధనంజయ్య, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ మేనేజర్ సయ్యద్ కైజర్ తదితరులు పాల్గొన్నారు.

తెరవని అంగన్వాడీ కేంద్రం.. ఇబ్బందుల్లో చిన్నారులు!

రాజీవ్ నగర్ తండాలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సర్పంచ్ రవి నాయక్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 13(విజన్ ఆంధ్ర): మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం రాజీవ్ నగర్ తండాలోని అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం బిచ్యానాయక్ తండా సర్పంచ్ రవి నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్ సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం తెరవకపోవడంతో అక్కడికి వచ్చిన చిన్నారులు బయట ఆవరణలోనే నిరీక్షిస్తూ, ఇష్టానుసారంగా ఆడుకుంటూ కనిపించారు. చిన్నారులకు సరైన పర్యవేక్షణ, భద్రత లేకుండా ఉండటంపై సర్పంచ్ ఆందోళన వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చిన్నారులకు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. అంగన్వాడీ కేంద్రాలను నిర్ణీత సమయానికి తెరిచి, చిన్నారులకు భద్రతతో కూడిన సేవలు అందించాలని సంబంధిత సిబ్బందిని కోరారు.

బాలల హక్కులు, చట్టాలపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరం

- కేజీబీవీ మావలలో బాలల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)బాలల హక్కులు, వారి రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు, తమకు ఎదురయ్యే సమస్యలపై నిర్భయంగా స్పందించేలా వారిని చైతన్యపరచాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. హుస్సేన్ అన్నారు. బాలల దినోత్సవం2026 సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్‌లోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ హైస్కూల్ ఎదురుగా ఉన్న మావల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల హక్కులు, బాలల రక్షణకు సంబంధించిన వివిధ చట్టాలు, విద్యా హక్కు, బాల్యవివాహాల నిషేధం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలలపై జరిగే వేధింపులు, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చట్టాలు కల్పిస్తున్న రక్షణ, న్యాయ సహాయం పొందే విధానాలను వివరించారు. విద్యార్థులు తమకు ఎదురవుతున్న సమస్యలను కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్న న్యాయ అధికారులు, చట్టపరమైన పరిష్కార మార్గాలను వివరించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అవసరమైనప్పుడు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏ. అశోక్, చంద్రకాంత్ చౌదరి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉమేష్ ధోలే, న్యాయవాదులు, కేజీబీవీ ప్రత్యేక అధికారి సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


'ది రిజర్వ్' విల్లా ప్రాజెక్టుకు భూమిపూజ



హైదరాబాద్, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : అమరావతి రాజధాని ప్రాంతంలోని మంగళగిరిలో హైదరాబాద్‌కు చెందిన మిరానా రియాల్టీ సంస్థ చేపట్టనున్న 'ది రిజర్వ్' లగ్జరీ విల్లా ప్రాజెక్టుకు భూమిపూజ నిర్వహించినట్లు సంస్థ చైర్మన్ మురళీకృష్ణ యార్లగడ్డ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయన మాట్లాడుతూ 9.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.59 అత్యాధునిక విల్లాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో 4, 5 పడక గదుల విల్లాలు, క్లబ్‌హౌస్, నాలుగు కార్ల పార్కింగ్ తదితర ఆధునిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. అమరావతి అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, ఇంటూరి నాగేశ్వరరావు, వెనిగండ్ల రాము, ప్రత్తిపాటి పుల్లారావు, కాకర్ల సురేష్, యార్లగడ్డ వెంకట్రావు, ధూళిపాళ్ల నరేంద్ర, మహా న్యూస్ ఎండీ మారెళ్ల వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీసీఐ అండర్-19 క్రికెటర్ నందిని ఆత్మహత్య


వేధింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణలు.. నిందితులను అరెస్ట్ చేయాలని రాస్తారోకో



వికారాబాద్: తెలంగాణలోని వికారాబాద్‌కు చెందిన బీసీసీఐ అండర్–19 మహిళా క్రికెటర్ నందిని (17) ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. యాలాల మండలం సంగయ్యపల్లికి చెందిన ఆమె క్రికెట్‌లో రాణిస్తూ ఇటీవల అండర్–19 జట్టుకు ఎంపికైంది. ఇద్దరు స్థానిక యువకుల వేధింపుల కారణంగానే నందిని ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులు, స్థానికులు రాస్తారోకో నిర్వహించారు. ప్రతిభావంతురాలైన యువ క్రీడాకారిణి మృతితో క్రీడా వర్గాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



శేరిలింగంపల్లి .నవంబర్: 13:(విజన్ ఆంధ్ర) : మియాపూర్ డివిజన్ పరిధిలోని నడి గడ్డ తండా, సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలలో గల సమస్యలపై,చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై ఈ రోజు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ దక్షిణ విభాగం సిఆర్పిఎఫ్ కమాండెంట్ విక్రమ్ గారు, సిఆర్పిఎఫ్ ఇంజనీరింగ్ విభాగం అధికారి కృష్ణ ఉపాధ్యాయ గారు, సీ.ఎం. సి .ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి నడిగడ్డ తాండలో పర్యటించి పరిశీలించిన మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... నడిగడ్డ తండా మరియు సుభాష్ చంద్రబోస్ నగర్ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, నడిగడ్డ తండా లో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల ను, యు జి డి పైప్ లైన్ నిర్మాణం పనులు చేపట్టే పరిసర ప్రాంతాలను సిఆర్పిఎఫ్ అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించడం జరిగినదని. నడిగడ్డ తండా నుండి హెచ్ డి ఎఫ్ సి బొల్లారం రోడ్డు పక్కన మురుగు నీరు చేరి వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అని, యు జి డి పైప్ లైన్ నిర్మాణం పనులకు అనుమతులు ఇప్పిస్తే వెంటనే పనులు చేపట్టి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, మురుగు నీరు మళ్లింపు ద్వారా కాలనీ లో ప్రశాంతమైన వాతావరణం కల్పించడం జరుగుతుంది అని, పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ సహకారంతోలి నడ్డిగడ్డ తండా లో ఎన్నో ఏండ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం త్వరలోనే చూపుతామని, నడిగడ్డ తండా అభివృద్ధికి కృషి చేస్తామని,నడిగడ్డ తండాలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, నడిగడ్డ తండా లో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల ను, యు జి డినిర్మాణ పనులను కూడా త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని శ్రీకాంత్ తెలియచేశారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ దక్షిణ విభాగం సంబంధిత అధికారులు పై అంశాల పై సానుకూలంగా స్పందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ సంబంధిత అధికారులు, సిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏఈ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లి.నవంబర్ 13: (విజన్ ఆంధ్ర) : చందానగర్ డివిజన్ పరిధిలోని పి జె ఆర్ స్టేడియం లో జరుగుతున్న అభివృద్ధి మరియు సుందరీకరణ పనులను జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మలెంపాటి డీసీ శ్రీనివాస్ మరియు సీఎం సి ఇంజనీరింగ్ , టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పి జె ఆర్ స్టేడియం కు మహర్దశ కలిగినది అని, స్టేడియం అభివృద్ధి మరియు సుందరీకరణ పనుల కోసం కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నవి అని, పి జే ఆర్ స్టేడియం సుందరీకరణ చాలా సంతోషంగా ఉంది అని, ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో దోహదపడుతుంది అని ప్రతి రోజు 5000 ల మంది పైగా విజిటర్స్, క్రీడాకారులు, వాకర్స్, యోగ కోసం వస్తున్నారు అని, వారి అందరి నీ దృష్టిలో పెట్టుకొని పి జె ఆర్ స్టేడియం ను అభివృద్ధి, సుందరీకరణ, మరియు మౌలిక వసతుల కల్పన కు ఈ నిధులు ఎంతగానో తోడ్పడుతాయి అని , క్రీడాకారులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరుగుతుంది అని ఈ పి జె ఆర్ స్టేడియం లో ఎందరో శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కి ఎదిగిన గొప్ప క్రీడాకారులను అందించిన చరిత్ర గల స్టేడియం అని, తిలక్ వర్మ, మరియు పుల్లెల గోపి చాంద్ వంటి ప్రముఖ క్రీడాకారులు ఇక్కడే శిక్షణ పొంది అంతర్జాతీయ స్థాయిలో రాణించడం జరిగినది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవీజ అధికారులు టౌన్ ప్లానింగ్ ాజూ సుష్మా, ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఇజు శ్రీదేవి, ాజు ప్రతాప్, ఖదీజ డిప్యూటీ డైరెక్టర్ అమృత మరియు నాయకులు ,కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విస్తరణోపన్యాసాలు



మల్కాజిగిరి, నవంబర్ 13,విజన్ ఆంధ్ర : మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, వృక్షశాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థుల కోసం రెండు ప్రత్యేక విస్తరణోపన్యాస కార్యక్రమాలను నిర్వ హించారు. కంప్యూటర్ సైన్స్ విభాగం ఇంచార్జ్ డాక్టర్ మల్లిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. యమునా రాణి ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థులకు 'సి లాంగ్వేజ్ ప్రోగ్రామింగ్‌లో స్ట్రక్చర్స్, యూనియన్స్, ఫైల్స్' అనే అంశంపై అవగాహన కల్పించారు. అలాగే, వృక్షశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. లలిత ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో ఇబ్రహీం పట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ. రచన ముఖ్య వక్తగా హాజరై, విద్యార్థులకు 'ఔషధ మొక్కలు', వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. బండి రాజు ఆధ్వర్యంలో ఇద్దరు అతిథి అధ్యాపకులను శాలువా, ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీలో చాక్ డౌన్ కార్యక్రమం

- రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి వినతిపత్రం సమర్పణ



నిజామాబాద్ నవంబర్13:(విజన్ ఆంధ్ర) : రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈరోజు తెలంగాణ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో చాక్ డౌన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యాపకులు నిరసన తెలియజేస్తూ విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం వద్దకు చేరుకుని గౌరవనీయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కేల్స్ అమలు చేసిన తర్వాతనే రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా విశ్వవిద్యాలయాల్లో సేవలందిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల ఉద్యోగ భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భవిష్యత్తులో మరింత తీవ్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డా. గంగాకిషన్, దత్తహరి, కిరణ్ రాథోడ్, స్వామి, శ్రీనివాస్, రాజేష్, జలంధర్, రాజేశ్వరి, జ్యోత్స్న, అపర్ణ తదితర కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

"ది సైలెంట్ ఆర్కిటెక్" ఆంగ్ల గ్రంథాన్ని ఆవిష్కరించిన మంత్రి వివేక్



హైదరాబాద్ నవంబర్ 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : పనిచేసే కార్మికులు పారిశ్రామల యాజమాన్యం పరస్పర సహకారం ఉంటేనే ఇరు వర్గాలకు లాభం అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టం గత ప్రభుత్వ కాలం లో అమలు కాలేదని చెప్పారు. ప్రస్తుతం పారిశ్రామిక వేత్తలు అందరితో సంప్రదించి కనీస వేతన చట్టం అమలు చేయిస్తున్నామని తెలిపారు. కార్మికులు సంతోషంగా ఉంటేనే పరిశ్రమ పురోగతి అని మంత్రి వివేక్ తెలిపారు. రవీంద్రభారతి లోని సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సాంస్కృతిక సంస్థ 'కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్" నిర్వహణలో రచయిత సి.పి. రాజు రచించిన కనీస వేతన సలహా మండలి పూర్వ అధ్యక్షుడు అర్ రామ మోహన రావు జీవిత చరిత్ర "ది సైలెంట్ ఆర్కిటెక్" ఆంగ్ల గ్రంథం ఆవిష్కరణ సభ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి హాజరై ప్రముఖ కార్మిక నాయకుడు రామ మోహన రావు జీవితం ఆధారంగా రూపొందించిన "ది సైలెంట్ ఆర్కిటెక్" ఆంగ్ల గ్రంథాన్ని ఆవిష్కరించి సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, రామ మోహన రావు నిదానంగా కనిపించినా, కార్మికుల హక్కుల కోసం రాజీ పడే వారు కాదని అన్నారు. కార్మిక శాఖ లో పలు సమస్యలు వున్నాయనీ చెప్తూ ఇటీవల పరిశ్రమలో జెరుగుతున్న అగ్ని ప్రమాద ఘటనలకు కారణం అవగాహన లేని వారిని ఔట్ సోర్స్ ప్రాతిపదిక తీసుకుని సాంకేతికతతో కూడిన సున్నిత ప్రాంతాలలో నియమించటం అని చెప్పారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ, కార్మిక సంఘాలు బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం దృఢంగా ఉంటుంది అన్నారు. రామ మోహన రావు సుదీర్ఘ కాలం కార్మిక ఉద్యమాలు లో భాగస్వామిగా పలు సమస్యలు పరిష్కారం కోసం కృషి చేశారని వివ రించారు. ప్రత్యేక అతిథిగా పూర్వ మంత్రి పెద్ది రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, ప్రతి మనిషి జీవితం ఒక చరిత్ర అని, సాధించిన విజయాలు భావితరాలకు తెలియజేసే విధంగా జీవిత చరిత్ర రాసుకోవాలి అని సూచించారు. కార్మిక నాయకుడు రామ మోహన్ రావు జీవితం అందరికీ గొప్ప స్ఫూర్తి ఇస్తుందని తెలిపారు. రామ మోహన రావు మాట్లాడుతూ, కార్మిక సంఘాలను అణచి వేసిన చరిత్ర గత రాష్ట్ర పాలకులది అని గుర్తు చేశారు. కార్మిక హక్కులు నేడు కేంద్ర ప్రభుత్వం చర్యలతో అడుగంటి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమ నిర్వాహకుడు కిన్నెర రఘురాం తన స్వాగతం లో తెలుగులో కూడా రామ మోహన రావు జీవిత చరిత్ర రాయమని పుస్తక రచయితను కోరారు. ఈ పుస్తకం తమ కిన్నెర సంస్థ బ్యానర్ మీదుగా ప్రారంభం కావడం తమకెంతో ఆనందాన్ని అందజేసిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మిక నాయకులు, రామ మోహన రావు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి అభివృద్ధికి రూ 1,727.20 కోట్లు మంజూరు

- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, నవంబర్ ,13, విజన్ ఆంధ్ర:మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధికి రూ 1,727.20 కోట్లు మంజూరైనాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఏటీసీ రహదారులకు రూ960 కోట్లు, ఆర్కే పురం ఫ్లైఓవర్ కు రూ 210 కోట్లు, బొల్లారం రైల్వే ఓవర్‌బ్రిడ్జికి రూ 112 కోట్లు కేటాయించార న్నారు. అభివృద్ధి పనుల జాబితాలో ఇవి మూడు అతిపెద్ద మంజూరైనవని, మొత్తం 24 ప్రాజెక్టులకు రూ 1,727.20 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. రహదారులు, రైల్వే వంతెనలతో పాటు తాగునీరు, విద్యుత్, వైద్యం, విద్య, క్రీడలు, చెరువుల అభివృద్ధికీ ఈ మంజూరుల్లో చోటు లభించిందన్నారు. మొత్తం మంజూరులో అత్యధిక భాగం రాకపోకల మెరుగుదలకు సంబంధిం చిన పనులకే కేటాయిం చారని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రూ 1,560.30 కోట్లు,ఏటీసీ రహదారులు, ఆర్కే పురం ఫ్లైఓవర్‌తో పాటు ఆర్కే పురం రోడ్డు అండర్‌బ్రిడ్జికి రూ35 కోట్లు మంజూర య్యాయన్నారు. మరో పది రైల్వే క్రాసింగ్ పనులకు రూ 355.30 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో బొల్లారం ఓవర్‌బ్రిడ్జితో పాటు వాజ్‌పేయి నగర అండర్‌బ్రిడ్జికి రూ 74.50 కోట్లు, వినాయక్ నగర్ అండర్‌బ్రిడ్జికి రూ 48 కోట్లు ఉన్నాయి. కాకతీయ నగర్, తుర్కపల్లి, సఫిల్‌గూడ, గౌతమ్ నగర్,బీహెచ్‌ఈఎల్ అల్వాల్ ప్రాంతాల్లోనూ అండర్‌బ్రిడ్జి పనులు జాబితాలో ఉన్నాయని చెప్పారు. ఈ పనులు పూర్తయితే రైల్వే గేట్ల వద్ద నిరీక్షణ తగ్గి, రోజూ ఉద్యోగాలకు, పాఠశాలలకు వెళ్లేవారికి రాకపోకలు సులభమవుతాయన్నారు. తాగునీం ం, విద్యుత్, వైద్య సదుపాయాలకు ప్రాధాన్యం కల్పించామన్నారు. జిల్లా కోర్టు భవన నిర్మాణానికి రూ 46.50 కోట్లు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, త్రీ-ఫేజ్ మార్పిడి పనులకు రూ 44 కోట్లు, గౌతమ్ నగర్‌లో 5 ఎంఎల్‌డీ రిజర్వాయర్‌కు రూ 14.90 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి మౌలిక వసతులకు రూ 2.60 కోట్లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మౌలిక వసతులకు రూ 2.50 కోట్లు, సఫిల్‌గూడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ1.50 కోట్లు మంజూరయ్యాయన్నారు.

క్రీడా వసతులు, చెరువుల అభివృద్ధికి రూ 54.90 కోట్లు...

ఆర్కే పురంలో ఇండోర్ కోర్టుకు రూ 16 కోట్లు, మౌలాలిలో ఈత కొలనుకు రూ 10.40 కోట్లు, డిఫెన్స్ కాలనీలో క్రీడా వసతులకు రూ 7 కోట్లు మంజూర య్యాయని తెలిపారు. బండ చెరువు అభివృద్ధికి రూ 20 కోట్లు, సఫిల్‌గూడ చెరువు అభివృద్ధికి రూ 1.50 కోట్లు, అగ్నిమాపక కేంద్రం కోసం 11 గుంటల స్థలం, అలాగే సీసీ రోడ్లు, బాక్స్ డ్రెయిన్లు, భూగర్భ మురుగునీటి పారుదల, నీటి సరఫరా పనులను కూడా అభివృద్ధి జాబితాలో ప్రస్తావించినట్లు తెలిపారు. మొత్తం 24 ప్రాజెక్టులకు రూ 1,727.20 కోట్లనిధులు మంజూరైయాని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

పెంచిన పన్నులు భరించలేకున్నాం, తగ్గించి ఆదుకోండి

- వర్తక సంగం మంత్రి సీతక్కకు వినతి



ములుగు నవంబర్ 13; విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మున్సిపాలిటీలో పెంచిన పన్నులను తగ్గించి వ్యాపార వర్గాన్ని ఆదుకోవాలని కోరుతూ మంత్రి సీతక్కను కలవడానికి వ్యాపార వర్గం సిద్ధమైంది. మంత్రి సీతక్క ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు అపాయింట్‌మెంట్ ఇచ్చారని, కావున వ్యాపార వర్గమంతా కలిసి రావాలని వర్తక సంఘం ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. ఆ రోజు మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి తమ గోడును వినిపించి, పెంచిన పన్నులను సవరించి తగ్గించాలని వేడుకోవాలని వ్యాపారులు నిర్ణయించారు. బేకరీ, కిరాణం, మెడికల్ షాపులు, బట్టల దుకాణాలు, హోటళ్లు, టీ స్టాళ్లు, సెలూన్లు, బ్యూటీ పార్లర్లు, మొబైల్, ఎలక్ట్రానిక్స్, ఫర్నిచర్, హార్డ్‌వేర్, కూరగాయలు, పండ్లు, మాంసం, పాల దుకాణాలు, ఫోటో స్టూడియోలు, జిరాక్స్, మీసేవ కేంద్రాలు, టైలరింగ్, జ్యువెలరీ, ఆటోమొబైల్స్, షోరూంలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలతో పాటు చిరు వ్యాపారుల వరకు అన్ని వర్గాల వ్యాపారులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. వ్యాపారులు మాట్లాడుతూ, అసలే ఎల్ నినో ప్రభావంతో పంటలు సరిగా పండక రైతుల చేతిలో డబ్బు లేకపోవడంతో వ్యాపారం పూర్తిగా మందగించిందన్నారు. దీంతో చాలామంది వ్యాపారులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ వ్యాపారం రోజురోజుకు పెరగడం, ఉచిత బస్సు సౌకర్యంతో ప్రజలు వరంగల్, హనుమకొండ వంటి పెద్ద పట్టణాలకు వెళ్లి కొనుగోళ్లు చేయడం వల్ల స్థానిక దుకాణాల్లో గిరాకీ గణనీయంగా తగ్గిపోయిందన్నారు. షాపు అద్దెలు, కరెంటు బిల్లులు, సిబ్బంది జీతాల భారంతోనే సతమతమవుతున్న తరుణంలో, ఇప్పుడు పెంచిన మున్సిపల్ పన్నులు మరింత భారంగా మారాయని తెలిపారు. ముఖ్యంగా చిన్న, చిరు వ్యాపారులు పన్నులు చెల్లించలేని దుస్థితిలో ఉన్నారని, కొందరు దుకాణాలు మూసివేసే పరిస్థితికి చేరుకున్నారని వాపోయారు. ములుగు పట్టణ అభివృద్ధికి వ్యాపారులు ఎప్పుడూ సహకరిస్తారని, అయితే ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పెంచిన పన్నులను తగ్గించి ఆదుకోవాలని మంత్రిని వేడుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, యుగేందర్, కిరణ్, దిలీప్, మాధవరావు, రఘువీర్, హేమంత్, మహిపాల్, రవి, సతీష్, సుదర్శన్, రాజలింగం, రాజశేఖర్, ప్రకాష్ రెడ్డి, నితిన్, స్వాతి, మమత, కావ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు

- మెరిట్ ఉన్న అభ్యర్థులకు అన్యాయం..

- సీడీపీఓపై చర్యలు తీసుకోవాలి



గాదిగూడ, నవంబర్ 14(విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల భర్తీ చేసిన అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల ఎంపికలో అక్రమాలు జరిగాయని గాదిగూడ మండల కేంద్రంలోని పరస్వాడ గ్రామానికి చెందిన పూసం దేవుబాయి ఆరోపించారు. మెరిట్ ఆధారంగా పోస్టులు కేటాయించాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా ఎంపికలు చేపట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.అభ్యర్థులకు వచ్చిన మార్కుల వివరాలను పరిశీలిస్తే తనకు 632 మార్కులు, చవాన్ సారికబాయికి 623 మార్కులు మాత్రమే వచ్చాయని తెలిపారు. తనకంటే తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థికి పోస్టు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. మెరిట్‌ను పక్కనపెట్టి ఎంపికలు చేపట్టిన శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి (సీడీపీఓ)పై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అంగన్‌వాడీ, ఆయా పోస్టుల భర్తీలో నిబంధనలు, మెరిట్ ప్రాతిపదికను పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. అర్హత, మెరిట్ ఉన్న అభ్యర్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించకపోతే మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్, కమిషనర్‌కు మార్కుల వివరాలు,ఇతర ఆధారాలతో సహా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని పూసం దేవుబాయి హెచ్చరించారు.

కులం కోసం సేవకుడిగా పనిచేస్తా

- కొండ దేవయ్య పటేల్



హైదరాబాద్ : నవంబర్ 13; పదవులు ముఖ్యం కాదని, ప్రాణం ఉన్నంతవరకు కులం కోసం సేవకుడిగా పనిచేస్తానని తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) వ్యవస్థాపక అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ పేర్కొన్నారు.బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రాజ్‌కుమార్, ఆర్వీ మహేందర్‌ల అధ్యక్షతన రాష్ట్ర ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 'ఒకే కులం ఒకే సంఘం' నినాదంతో అందరూ ఏకమై సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికను పారదర్శకంగా నిర్వహించేందుకు 9 మంది సభ్యులతో ఎన్నికల కమిటీ, 33 జిల్లాలకు సమన్వయకర్తలను నియమించాలని సమావేశంలో నిర్ణయించారు. 18 ఏళ్లు నిండిన అర్హులందరికీ సభ్యత్వం కల్పించి ఓటర్ల జాబితా తయారు చేస్తామని, త్వరలోనే పూర్తి ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నరసింహారెడ్డి, నగర యువజన విభాగం అధ్యక్షులు ఎడ్ల విశాల్ పటేల్, ఉపాధ్యక్షులు తోట శ్రవణ్, ప్రొఫెసర్ పి. లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, బూడిద రాజేందర్, గుజ్జు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు 2 వేల ఇళ్లు


రూ.220 కోట్లతో 'ఆటో నగర్ కాలనీ' నిర్మాణం

హైదరాబాద్, నవంబర్ 13: హైదరాబాద్‌లో ఆటోరిక్షా కార్మికులకు సొంతింటి కల నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక గృహ పథకానికి ఆమోదం తెలిపింది. రూ.220 కోట్ల అంచనా వ్యయంతో 'ఆటో నగర్ కాలనీ' పేరుతో 2 వేల ఈడబ్ల్యూఎస్ ఇళ్లను నిర్మించనున్నారు. బండ్లగూడ (ఎల్ఐసీ కాలనీ), గంధంగూడ, పేట్‌బషీరాబాద్, జల్‌పల్లి/లక్ష్మీగూడ ప్రాంతాల్లో ఒక్కోచోట 500 ఇళ్ల చొప్పున నిర్మించనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక, కేటాయింపులు చేపట్టనున్నారు. అయితే లబ్ధిదారులు తప్పనిసరిగా ఆటోరిక్షా కార్మికులై ఉండాలి. ఈ మేరకు తెలంగాణ హౌసింగ్ బోర్డుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. స్థలాల లభ్యత, సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.

రబీలో ఆరుతడి పంటలకే ప్రాధాన్యత..

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

- ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరి






వనపర్తి జిల్లా ప్రతినిధి,నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : రాబోయే రబీ 2026-27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ఆదేశించారు.శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, వీబీ-గ్రామ్-జీ పనుల పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. వనపర్తి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, రబీ సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో వరి సాగును నివారించి, రైతులను ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. సూక్ష్మ సేద్య విధానాలను విస్తృతంగా ప్రోత్సహించడంతో పాటు పంటల వైవిధ్యీకరణ, ఫార్మర్ రిజిస్ట్రీ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆరుతడి పంటల సాగులో భాగంగా కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు.ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని కొనుగోలు కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రైతుల వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేసి, కొనుగోలు కేంద్రాల నిర్వహణను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

విద్యాశాఖపై సమీక్ష...: రూసా 2.0, పీఎం ఉషా పథకాల కింద మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని, రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు.భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని తెలిపారు.

ఎఫ్ఆర్ఎస్ తప్పనిసరి : వీసీ అనంతరం జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్) విధానం ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు విధిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల హాజరు మెరుగుపడితే విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించినప్పటికీ కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీధి కుక్కల సమస్య పరిష్కారానికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని, వీబీ-గ్రామ్-జీ పథకం కింద నీటి సంరక్షణ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈఓ యాదయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీలో కలకలం..

- జూనియర్‌పై సీనియర్ దాడి



నిజామాబాద్ నవంబర్13:(విజన్ ఆంధ్ర) : తెలంగాణ యూనివర్సిటీ లో విద్యార్థుల మధ్య మాటల వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జూనియర్ విద్యార్థిపై సీనియర్ విద్యార్థి తనకు తెలిసిన బయటి వ్యక్తులను రప్పించి దాడి చేయించిన ఘటన కలకలం రేపింది. గురువారం అర్ధరాత్రి ఒంటిగంటన్నర సమయంలో యూనివర్సిటీ ఓల్డ్ బాయ్స్ హాస్టల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.బయటి వ్యక్తులతో..హాస్టల్ విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫార్మాస్యూటికల్ నాల్గో సంవత్సరం చదువుతున్న విద్యార్థి తోటి విద్యార్థులతో మాట్లాడుతుండగా, అప్లైడ్ ఎకనామిక్స్ రెండో సంవత్సరం విద్యార్థి ఏదో విషయంపై అదే సమయంలో మాట్లాడాడు. దీంతో సీనియర్ విద్యార్థులకే ఎదురు చెబుతావా..? అంటూ సదరు సీనియర్ జూనియర్ పై వాగ్వాదానికి దిగి దాడి చేసినట్లు సమాచారం. అనంతరం ఈ సీనియర్ విద్యార్థి యూనివర్సిటీతో సంబంధం లేని తనకు పరిచయమున్న బయటి వ్యక్తులకు ఫోన్ చేయగా, ఐదుగురు వ్యక్తులు మాస్కులు ధరించి యూనివర్సిటీ హాస్టల్‌కు వచ్చి జూనియర్ పై దాడి చేసినట్లు తెలిసింది. ఈ దాడిలో జూనియర్ తలకు తీవ్ర గాయమైంది. దీంతో హాస్టల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. హాస్టల్‌కు చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి విచారణ చేశారు. దాడిలో గాయపడిన జూనియర్ అదే అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పోలీసుల సూచన మేరకు అతడిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

గతంలోనూ బెదిరింపులు?

ఈ ఘటనకు పాల్పడ్డ సీనియర్ గతంలోనూ జూనియర్ విద్యార్థులను బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. అప్పట్లో ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో యూనివర్సిటీ వార్డెన్ జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పినట్లు తెలిసింది. అయినప్పటికీ మరోసారి జూనియర్ విద్యార్థిపై బయటి వ్యక్తులను రప్పించి దాడి చేయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. యూనివర్సిటీ హాస్టల్‌లోకి బయటి వ్యక్తులు మాస్కులు ధరించి ప్రవేశించి విద్యార్థిపై దాడికి పాల్పడటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కేసు నమోదు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి తోడ్పాటును అందించాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, నవంబర్ 13 :(విజన్ ఆంధ్ర): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR) తుది దశకు చేరిందని, ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యేందుకు రాజకీయ పార్టీలు తోడ్పాటును అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఐడీఓసీలో శుక్రవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న చర్యలు, తదుపరి కార్యాచరణ గురించి వివరించారు. ఈ 26వ తేదీ వరకు అభ్యంతరాలను పరిష్కరించడం జరుగుతుందని, నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ అవుతుందని తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో అబ్సెంట్, షిఫ్ట్, డెత్, డూప్లికేషన్ (ఏ.ఎస్.డీ.డీ) కారణాలతో పేర్లను తొలగించబడిన వారికి ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మరోమారు అవకాశం కల్పించబడుతోందని కలెక్టర్ తెలిపారు. ఏ.ఎస్.డీ.డీ జాబితాలో ఉన్న వారికి తాజాగా ఎన్యూమరేషన్ ఫారం తో పాటు అనేగ్జర్ - బి, అనేగ్జర్ - సి లను అందించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాల వారీగా బీ.ఎల్.ఓలు ఇళ్లకు వెళ్లి వారికి అందించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఈ ప్రక్రియకు ఆయా రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగించబడకూడదనే లక్ష్యంతో ఎన్నికల సంఘం ఏ.ఎస్.డీ.డీ జాబితాలో ఉన్న వారి విషయంలో మరోమారు అవకాశం కల్పిస్తోందని అన్నారు. ఎక్కడైనా అర్హులైన వారి పేరు పొరపాటుగా తొలగించబడితే, ఈ ప్రక్రియ ద్వారా తుది జాబితాలో చేర్చడం జరుగుతుందన్నారు. ఆబ్సెంట్, షిఫ్ట్, డూప్లికేషన్ జాబితాలో ఉన్న వారిని వ్యక్తిగతంగా, ఎస్.ఎం.ఎస్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


పేదల వైద్యానికి బీఆర్ఎస్ భరోసా

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో 8 మందికి రూ.3.08 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- వీరారెడ్డి నరేందర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఆర్థిక సాయం
- ఆపద సమయంలో పేద కుటుంబాలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్: బీఆర్ఎస్ నాయకులు



కుత్బుల్లాపూర్, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర): నిరుపేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించి, ఆపద సమయంలో ఆర్థికంగా అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తోందని ఆ పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ చొరవతో జీడిమెట్ల 132వ డివిజన్ పరిధిలోని 8 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.3,08,000 విలువైన చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఈ పథకం ఆపన్నహస్తంగా నిలుస్తోందన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేయడమే ప్రజాసేవలో ముఖ్యమైన లక్ష్యమని పేర్కొన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందేలా చొరవ చూపుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు లబ్ధిదారుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, సూదుల సంపత్ గౌడ్, ఎల్లా గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, కుంట వేణు, ఆటో బలరాం, గణేష్, రాజు యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, లబ్ధిదారులు హాజరయ్యారు.

బీజేఆర్ నగర్ లో యుజీడి పనులు ప్రారంభం



జవహర్ నగర్ నవంబర్ 13 విజన్ ఆంధ్ర: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) 3వ డివిజన్ పరిధిలోని బీజే ఆర్ నగర్ కాలనీలో శుక్రవారం యుజీడి డ్రైనేజీ పనులు ప్రారంభమైనాయి. జవహర్ నగర్ 7వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మెట్టు ఆశ కుమారి సహకారంతో కాలనీ వాసులు తమ స్వంత నిధులతో 200 మీటర్లు మేర యుజీడి డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం దిద్దారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ హాజరై నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జవహర్ నగర్ అభివృద్దే తన ప్రధాన ధ్యేయమన్నా రు. అనంతరం ఆయన స్థానికులతో కలిసి కాలనీ వాసుల సమస్య లను అడిగి తెలుసుకు న్నారు. స్థానికులు తన దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యలను కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రే ష్ యాదవ్ సహకారంతో త్వరితగతిన పరిష్కారం చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కారింగుల శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు ఏడ్ల శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, మెట్టు వెంకన్న, భాస్క ర్, శ్రీమాన్ వెంకటేష్, వెంకట్ నారాయణ, అంబాజీ, రౌతు అశోక్, రాజు,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై యువతకు అవగాహన ముఖ్యం

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- వనపర్తి నియోజకవర్గ స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు విజయవంతం
- నవంబర్ 16-18 తేదీల్లో జిల్లాస్థాయి పోటీలు
- రాష్ట్రస్థాయికి ప్రతిభావంతుల ఎంపిక

వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : విద్యార్థి దశ నుంచే యువత ఓటు హక్కుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, భవిష్యత్తులో బాధ్యతాయుతమైన ఓటరుగా మారాక ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్యా నాయక్ పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఎలక్టోరల్ లీటరసి క్లబ్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఓటరు నమోదు విధానం, ఈవీఎంల పనితీరు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులకు నవంబర్ 7న మండల స్థాయిలో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం స్థానిక ఐడీఓసీ హాల్లో వనపర్తి నియోజకవర్గ స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీ పరీక్షలను ఘనంగా నిర్వహించారు.



ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంలాంటిది

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ప్రజాస్వామ్యం, ఓటు విలువ, ఎన్నికల సరళిపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, తమ ఇళ్లలో మరియు చుట్టుపక్కల ఉండే ప్రజలకు కూడా దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ 'ఫారం-6' ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు కావాలని స్పష్టం చేశారు. అలాగే, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు. నియోజకవర్గ స్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులు చక్కటి అవగాహనతో అద్భుతమైన మార్కులు సాధించడం అభినందనీయమని కొనియాడారు.



జిల్లా స్థాయికి విద్యార్థుల ఎంపిక

రానున్న నవంబర్ 16 నుంచి 18 తేదీల మధ్యలో ఏదో ఒక రోజు జిల్లాస్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో మొదటి పది స్థానాల్లో నిలిచిన ప్రతిభావంతులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. వనపర్తి జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం క్విజ్, వ్యాసరచన పోటీలలో ప్రథమ 10 స్థానాలు సాధించిన విజేత విద్యార్థులను అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి వారితో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కామా, జెడ్పీ సీఈఓ యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సోషల్ మీడియా నోడల్ అధికారి పి. సీతారాం, నియోజకవర్గ నోడల్ అధికారి సిరాజుద్దీన్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రబీ సీజన్ ప్రణాళిక, విద్య, భూసేకరణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : రాబోయే రబీ సీజన్ ప్రణాళిక, విద్య, భూసేకరణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అటవీ, వ్యవసాయ శాఖల అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్‌కు సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులకు అవసరమైన సాగునీటి సదుపాయాలు కల్పించేందుకు సూక్ష్మ సేద్యం, ఉద్యానవన శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలని, కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రాయితీ విత్తనాల పంపిణీ, పంటల మార్పిడి, సూక్ష్మ సేద్య పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ



పాఠశాలలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, సగటున రాష్ట్రస్థాయిలో విద్యార్థుల హాజరు 73.74 శాతం ఉండగా, జిల్లా స్థాయిలో 72.21 శాతంగా ఉందని, ఉపాధ్యాయుల హాజరు రాష్ట్ర స్థాయిలో 87.06 శాతం, జిల్లా స్థాయిలో 88.05 శాతంగా నమోదు అయిందని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరుకు అనుగుణంగా విద్యార్థుల హాజరు పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలు మెరుగుపడేందుకు డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగాన్ని పెంచాలని, మరిన్ని పాఠశాలలు, విద్యార్థులను వాటిలో భాగస్వాములను చేయాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకుల విద్యాసంస్థలు, ఇతర విద్యాసంస్థలలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు, విద్యాబోధన, మౌలిక సదుపాయాలను పరిశీలించాలని సూచించారు. సమగ్ర శిక్షా పథకం క్రింద చేపట్టిన సివిల్ పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో ప్రవేశాల లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 96 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో 11 వేల 520 సీట్లకు గాను 7 వేల 107 ప్రవేశాలు నమోదుతో సుమారు 61.69 శాతం సీట్లు భర్తీ అయ్యాయని, సీట్ల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. డిగ్రీ కళాశాలలలో ఎఫ్.ఆర్.ఎస్. విధానంపై దృష్టి సారించాలని తెలిపారు.వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను, ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా స్థాయి కమిటీల ద్వారా ఈ కార్యక్రమాలను పర్యవేక్షించాలని సూచించారు.జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ పరిధిలో చేపడుతున్న భూసేకరణ పనుల పురోగతిని సమీక్షించారు. భూసేకరణకు సంబంధించి అవార్డు జారీ, పరిహారం పంపిణీ, భూముల స్వాధీనం మధ్య ఉన్న వ్యత్యాసాలను తగ్గించాలని తెలిపారు. అవార్డు జారీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అర్హులైన భూయజమానులకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని, భూసేకరణ ప్రక్రియను నిర్ణీత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని తెలిపారు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రబీ సాగుకు సంబంధించి రైతులకు తక్కువ నీటి అవసరం ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుతో పాటు రాయితీ విత్తనాల పంపిణీపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలను అధికారుల సమన్వయంతో క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన విద్యాబోధన జరిగేలా, ప్రభుత్వ విద్య సంస్థలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలి

పంట మార్పిడి, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ జిల్లా,నవంబర్ 13,(విజన్ ఆంధ్ర); పంటల సాగులో నీటి వినియోగాన్ని తగ్గించి, అధిక దిగుబడులు సాధించేలా సూక్ష్మ సేద్య పద్ధతులను రైతులు అవలంబించేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయం, విద్య, విబి-జీ రామ్ జీ, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించేలా చర్యలు తీసుకోవాలని, తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యత కల్పించాలని



సూచించారు. సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయడంతో పాటు రైతుల వివరాల నమోదు పూర్తి చేయాలని, కొనుగోళ్లను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సన్నధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. సమగ్ర శిక్షా అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వాటిని గుర్తించి నిబంధనల ప్రకారం పునరావాస కేంద్రాలకు తరలించాలని తెలిపారు. ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విబి-జీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యతనిస్తూ, జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో ఉద్యానవన పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని, సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వందశాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. సమగ్ర శిక్షా అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. విబి-జీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ పనులను చేపట్టి, భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు వెంకట మాధవ రావు, రాథోడ్ రమేష్, డీఈఓ భోజన్న, డీపీఓ శ్రీనివాస్, సీపీఓ గంగారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, నీటిపారుదల శాఖ అధికారులు రాజేంద్రప్రసాద్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు వృత్తి విద్య.. చర్లపల్లి జైలులో ప్రభుత్వ ఐటీఐ నీ ప్రారంభించిన జైళ్ల శాఖ డిజి

తెలంగాణరాష్ట్రంలో తొలిసారిగా జైళ్ల శాఖ పరిధిలో పారిశ్రామిక శిక్షణ సంస్థ ఏర్పాటు
తొమ్మిది కోర్సుల్లో శిక్షణ..!
ఒక్కోబ్యాచ్‌లో 200 మందికి అవకాశం
విడుదల అనంతరం ఉపాధి, స్వయం ఉపాధికి బాటలు..!



కాప్రా /ఓ.యు: నవంబర్ 13(విజన్ ఆంధ్ర ప్రతినిధి). ఖైదీల్లో నైపుణ్యాభివృద్ధి, విద్యాభివృద్ధితో పాటు వారిని సమాజంలో గౌరవప్రదమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ జైళ్ల శాఖ మరో ముందడుగు వేసింది. చర్లపల్లి కేంద్ర కారాగారంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐ.టీ.ఐ)ను ఏర్పాటు చేసింది. రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా, ఐపీఎస్ ఈ సంస్థను ప్రారంభించారు. కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ప్రభుత్వ కార్యదర్శి హరిచందన దాసరి, ఉపాధి, శిక్షణ శాఖ సంచాలకురాలు ఎ.క్రాంతి వెస్లీ ఈ



కార్యక్రమంలో పాల్గొన్నారు.

తొమ్మిది వృత్తి విద్యా కోర్సులు

తెలంగాణ జైళ్ల శాఖ పరిధిలో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ శిక్షణ సంస్థ నుంచి తొమ్మిది వృత్తి విద్యా కోర్సులకు సూత్రప్రాయ ఆమోదం లభించింది. ఒక్కో విడతలో 200 మందికి శిక్షణ అందించేలా ఏర్పాట్లు చేశారు. ఫిట్టర్, పెయింటర్, నేత పనుల సాంకేతిక శిక్షణ, చెక్క పనులు, వెల్డింగ్, దుస్తుల తయారీ, గృహ నిర్వహణ, ఉద్యానవనం, పూల మొక్కల పెంపకం, తోటల రూపకల్పన తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం తొమ్మిది మంది నైపుణ్యం కలిగిన శిక్షకులను అందుబాటులో ఉంచారు.

ఇప్పటికే 200 మంది ఆసక్తి

ఐటీఐ ప్రారంభోత్సవంలో తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. ఖైదీలకు విద్యతోపాటు వృత్తి నైపుణ్యాలను అందించడం ద్వారా వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావచ్చని తెలిపారు. ఇప్పటికే సుమారు 200 మంది ఖైదీలు ఐటీఐ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపినట్లు వెల్లడించారు. జైళ్లను కేవలం నిర్బంధ కేంద్రాలుగా కాకుండా విద్య, నైపుణ్యాభివృద్ధి, పునరావాస కేంద్రాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.

పదో తరగతిలో 78 మంది ఉత్తీర్ణత

ఖైదీల విద్యాభివృద్ధికి కూడా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు సౌమ్య మిశ్రా తెలిపారు. జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ ద్వారా ఇటీవల 78 మంది ఖైదీలు పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు. తెలంగాణ సార్వత్రిక విద్యా సొసైటీతో ఒప్పందం అనంతరం మరో 70 మంది పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరినట్లు వివరించారు. విద్యను కొనసాగించాలనుకునే ఖైదీలను వృత్తి విద్య వైపు కూడా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

ఉపాధి అవకాశాలకు దోహదం:-

ప్రభుత్వ కార్యదర్శి దాసరి హరిచందన మాట్లాడుతూ. ఖైదీలకు గుర్తింపు పొందిన వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ అందించడం వల్ల విడుదల అనంతరం ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. నేర్చుకున్న నైపుణ్యాలతో దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి, శిక్షణ శాఖ సంచాలకురాలు క్రాంతి వెస్లీ మాట్లాడుతూ ఐటీఐ శిక్షణను శిక్షలో భాగంగా కాకుండా జీవితాన్ని మార్చుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలని ఖైదీలకు సూచించారు. శిక్షణ ద్వారా ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకుని విడుదల అనంతరం గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు సిద్ధం కావాలన్నారు. జైళ్ల శాఖ హైదరాబాద్ రేంజ్ డీఐజీ ఎం. సంపత్ మాట్లాడుతూ ఖైదీలకు ఐటీఐ ని ప్రారంభించడం వల్ల వృత్తి విద్యా కోర్సులకు అర్హులవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఖైదీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని సంపత్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎన్.మురళీబాబు, వరంగల్ రేంజ్ డీఐజీ డాక్టర్ డి.శ్రీనివాస్, చర్లపల్లి కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ జి.ప్రమోద్, పరిశ్రమల శాఖ ఉప సంచాలకుడు ఎస్.డి.ఖలీద్ అక్తర్, ఎస్ఐసీఏ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరెడ్డి, చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రం జైలు సూపరింటెండెంట్ పి.అశోక్, కుమార్ జైలర్. శ్రీనివాస్. డిప్యూటీ జైలర్. వై వెంకట్ రెడ్డి.ఇతర అధికారులు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా,నవంబర్ 13,(విజన్ ఆంధ్ర); జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిలతో కలిసి రోడ్డు భద్రతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రహదారి ప్రమాదాలు పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు సంబంధిత అధికారులంతా కలిసి పని చేయాలన్నారు. బ్లాక్ స్పాట్ లు గుర్తించి, ఆ ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. వేగ నియంత్రణలు, సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలని చెప్పారు. రహదారుల వెంబడి అక్రమంగా వాహనాలు నిలిపితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్లపై పశువులు సంచరించకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పశువులు రోడ్లపైకి వదిలే యజమానులకు జరిమానాలు విధించాలని పేర్కొన్నారు. అవసరమైతే పశువులను స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు. రోడ్ల వెంబడి ఆక్రమణలు తొలగించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలను పూర్తి స్థాయిలో నిర్మూలించాలన్నారు. ఈ సమావేశంలో భాగంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో రహదారి ప్రమాదాల నియంత్రణకు తమ శాఖ పరిధిలో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీలు నిర్వహించి, డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్, హెల్మెట్ లేని డ్రైవింగ్ చేసే వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. రహదారి భద్రతపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో రహదారి ప్రమాదాల నియంత్రణకు చేపట్టే కార్యక్రమాలన్నింటికీ పోలీసు శాఖ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, డిఎంహెచ్ఓ రాజేందర్, ఈఈ ఆర్ అండ్ బి సుభాష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం 19 నుండి అమలు

- అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

- జిల్లాలో పథకం అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ .





సంగారెడ్డి, డెస్క్ విజన్ ఆంధ్ర నవంబర్ 13:- రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు . శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం విధివిధానాలు, అమలు, నమోదు ప్రక్రియ, అవగాహన కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన కుటుంబాలన్నింటినీ పథకం పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో జన్మించి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక కేంద్రాలు, నమోదు శిబిరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, కుటుంబ జీవిత బీమా నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. నమోదు సమయంలో కుటుంబ సభ్యుల వివరాలు, బీమా ప్రయోజనం పొందే వ్యక్తుల వివరాలు, నామినీల సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు పత్రాలు, నమూనా పత్రాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులతో మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పథకం అమలుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సిబ్బంది, సాంకేతిక సదుపాయాలు, ఇతర సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రజలందరికీ పథకం గురించి అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాండు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి జానకిరెడ్డి, అదనపు డీఆర్డీఓ సూర్యారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాటి ఆలోచన మార్చుకున్నా..



ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు వేగంగా పడిపోతుండటమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని తెలిపారు. రాష్ట్రంలో జనాభా నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్‌లో టోటల్ ఫెర్టిలిటీ రేట్ (టీఎఫ్ఆర్) గణనీయంగా తగ్గి ప్రస్తుతం దాదాపు 1.5 వద్దకు చేరుకుంది. జనాభా సమతుల్యతను కాపాడేందుకు అవసరమైన 2.1 రీప్లేస్‌మెంట్ స్థాయి కంటే ఇది చాలా తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఎదురవుతున్న వృద్ధాప్య జనాభా సమస్య, యువ శ్రామిక శక్తి కొరత వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం ఈ విధాన మార్పును తెరపైకి తెచ్చింది. విశాఖలో జరుగుతున్న 31వ సీఐఐ సదస్సులో సీనియర్ జర్నలిస్ట్ పాల్కీ శర్మకు ఇచ్చిన ముఖాముఖిలో సీఎం చంద్రబాబు ఈ అంశంపై మాట్లాడారు. గతంలో ఒకటి లేదా ఇద్దరు పిల్లలకే పరిమితం కావాలని తానే స్వయంగా ప్రచారం చేశానని ఆయన గుర్తు చేసుకున్నారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో వచ్చిన మార్పులు, దీర్ఘకాలిక పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాత తన ఆలోచనా విధానాన్ని మార్చుకున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలు, అధిక జనాభా వల్ల కలిగే ప్రయోజనాలను (డెమోగ్రాఫిక్ డివిడెండ్) దృష్టిలో ఉంచుకుని కొత్త విధానాన్ని రూపొందించినట్లు వివరించారు. ఎక్కువ మంది పిల్లలను కనేలా కుటుంబాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు కీలక ప్రోత్సాహకాలను సిద్ధం చేసింది. రెండో లేదా మూడో బిడ్డకు జన్మనిస్తే నగదు ప్రోత్సాహకాలు, నెలవారీ భత్యాలు, విస్తరించిన తల్లిదండ్రుల సెలవులు (పేరెంటల్ లీవ్), పిల్లల సంరక్షణకు అవసరమైన మౌలిక వసతుల కల్పన వంటి చర్యలను ఇందులో పొందుపరిచారు. అయితే, ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లల విధానాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయడం చాలా కష్టమైన విషయమని చంద్రబాబు స్వయంగా అంగీకరించారు. అమలులో ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల భవిష్యత్తుకు ఇది మంచిదని నమ్మినప్పుడు ఈ విధానానికి కట్టుబడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, పెరుగుతున్న జీవన వ్యయం, నిరుద్యోగ సమస్యల కారణంగా ఈ పాలసీపై ఆశించిన మేర స్పందన కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రబాబు చేసిన ఈ ప్రతిపాదనలపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారంతో పాటు విస్తృత చర్చ జరుగుతోంది.

చిన్న బొబ్బే.. పెద్ద ప్రమాదం! షుగర్ ఉంటే పాదాలను అస్సలు నిర్లక్ష్యం చేయకండి

- కేర్ వైద్యుల సంచలన హెచ్చరిక!

-నొప్పిరాకపోవడమేఅసలుమోసం!

-కాలుకాపాడుకోవాలంటే ఇప్పుడే ఈ జాగ్రత్తలు తీసుకోండి!


తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 13, విజన్ ఆంధ్ర :

మీకు మధుమేహం ఉందా? మీ పాదానికి చిన్న గాయమైందా? బొబ్బ వచ్చిందా? చెప్పు కొట్టిందా? అయితే దాన్ని 'చిన్నదేలే' అని అస్సలు తేలిగ్గా తీసుకోవద్దు. ఎందుకంటే మధుమేహ బాధితుల్లో ఇలాంటి చిన్న గాయమే కొన్ని రోజుల్లో పెద్ద ఇన్ఫెక్షన్‌గా మారి, చివరికి కాలు తొలగించాల్సినంత ప్రమాదానికి దారితీస్తుందని బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్స్ వైద్యులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. నవంబర్ 14న ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్స్‌లో మధుమేహ పాద సమస్యలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది థీమ్ 'ఎర్లీ యాక్షన్ ఆన్ డయాబెటిస్'. అంటే మధుమేహంపై ముందస్తు చర్యలు. ముందుగానే గుర్తించడం, ముందుగానే స్పందించడం, ముందుగానే చికిత్స తీసుకోవడం – ఇదే ఈ ఏడాది ప్రధాన సందేశం. ఈ కార్యక్రమంలో వాస్క్యులర్ సర్జరీ, డయాబెటిక్ ఫుట్ విభాగాల నిపుణులు పాదాలను కాపాడుకోవడంపై కీలక సూచనలు చేశారు.

షుగర్‌తో పాదానికి ఎందుకు ముప్పు?

రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువ కాలం అదుపులో లేకుండా ఉంటే నరాలు, రక్తనాళాలు దెబ్బతింటాయి. నరాలు దెబ్బతినడం వల్ల పాదంలో స్పర్శ తగ్గిపోతుంది. గాయమైనా, ముల్లు గుచ్చుకున్నా, కాలినా నొప్పి తెలియదు. దాంతో రోగికి తన పాదానికి గాయమైందన్న విషయమే తెలియదు. అదే సమయంలో రక్తనాళాలు దెబ్బతినడం వల్ల పాదానికి రక్తప్రసరణ తగ్గిపోతుంది. రక్తం సరిగా అందకపోతే గాయం మానదు. ఇన్ఫెక్షన్‌తో పోరాడే శక్తి కూడా తగ్గిపోతుంది. చిన్న గాయం లోతైన పుండుగా మారుతుంది. పుండు నుంచి ఇన్ఫెక్షన్ ఎముక వరకు పాకుతుంది. అప్పుడు కాలు తొలగించడం తప్ప మరో మార్గం ఉండదు. వైద్య అధ్యయనాల ప్రకారం మధుమేహం కారణంగా కాలు తొలగించాల్సి వచ్చిన కేసుల్లో సుమారు 85 శాతం మందికి ముందుగా పాదంలో పుండు ఏర్పడింది. అంటే ఆ పుండును ముందే గుర్తించి చికిత్స చేసి ఉంటే 85 శాతం మందిలో కాలు కాపాడే అవకాశం ఉండేది. ఇదే విషయాన్ని కేర్ వైద్యులు మరోసారి గుర్తుచేశారు.

"గాయం మానకపోతే అదే మొదటి డేంజర్ సిగ్నల్" – డాక్టర్ పి.సి. గుప్తా



"మధుమేహ బాధితుల్లో మేం ఎక్కువగా చూసేది ఒకే తప్పు. గాయం అయిన తర్వాత చాలా ఆలస్యంగా రావడం. పాదానికి రక్తప్రసరణ తగ్గినప్పుడు చిన్న గాయం కూడా త్వరగా మానదు. లోపల ఇన్ఫెక్షన్ పెరుగుతూ ఉంటుంది. కానీ బయటకు ఏమీ తెలియదు. రక్తనాళాల్లో ఎక్కడ అడ్డంకి ఉందో ముందే కనుక్కుంటే, రక్తప్రసరణ మళ్లీ మెరుగుపరచవచ్చు. చాలా సందర్భాల్లో అలా చేస్తే కాలు తొలగించే పరిస్థితి రాకుండా ఆపవచ్చు. అందుకే పాదం చల్లగా అనిపించడం, రంగు మారడం, స్పర్శ తగ్గడం, గాయం వారం దాటినా మానకపోవడం లాంటివి కనిపిస్తే దాన్ని సాధారణ విషయంగా తీసుకోవద్దు. ఏడాదికి ఒక్కసారైనా పూర్తి పాద పరీక్ష చేయించుకోవాలి. ఇంతకు ముందు పుండు వచ్చిన వారు, నరాల సమస్య ఉన్నవారు, రక్తప్రసరణ తక్కువగా ఉన్నవారు మరింత తరచుగా చూపించుకోవాలి. షుగర్ కంట్రోల్‌లో లేకపోవడం, స్మోకింగ్, పాదం షేప్ మారడం, చర్మం బిరుసెక్కడం, సరిపోని చెప్పులు వాడటం – ఇవన్నీ రిస్క్‌ను పెంచుతాయి. రక్తప్రసరణ తగ్గినట్లు అనిపిస్తే నేరుగా వాస్క్యులర్ నిపుణుడిని కలవడం మంచిది."

"నొప్పి లేకపోవడమే అసలు మోసం" – డాక్టర్ రాధిక మలిరెడ్డి



"డయాబెటిక్ ఫుట్‌లో చాలా కేసులు మొదలయ్యేది చాలా చిన్న దానితోనే. చెప్పు కాటు, బొబ్బ, పాదం పగలడం, చిన్న కోత. నరాలు దెబ్బతిని ఉండటం వల్ల నొప్పి తెలియదు. దాంతో చాలామంది 'ఏమీ లేదులే' అని వదిలేస్తారు. మా దగ్గరకు వచ్చేసరికి గాయం లోతుకు వెళ్లిపోయి, ఇన్ఫెక్షన్ పాకిపోయి ఉంటుంది. మొదట్లోనే చూస్తే ఇన్ఫెక్షన్‌ను ఆపవచ్చు. సరైన డ్రెస్సింగ్ చేయవచ్చు. గాయం మీద ఒత్తిడి పడకుండా చూడవచ్చు. కొన్ని సందర్భాల్లో దెబ్బతిన్న భాగాన్ని తిరిగి నిర్మించడానికి సర్జరీ అవసరం అవుతుంది. ప్రతిరోజూ షుగర్ చూసుకున్నట్లే, పాదాలను కూడా చూసుకోవాలి. గాయం ఉందా, వాపు ఉందా, రంగు మారిందా అని గమనించాలి. చెప్పులు లేకుండా అస్సలు నడవద్దు. పాదానికి సరిపోయే చెప్పులే వాడాలి. గట్టిపడిన చర్మాన్ని మీరే తొలగించడం, లోతైన గాయానికి ఇంట్లోనే కట్టు కట్టడం చాలా ప్రమాదం."

ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కండి!

పాదంలో గాయం చాలా రోజులుగా మానకపోవడం, గాయం చుట్టూ ఎర్రబడి వాపు రావడం, చీము కారడం లేదా వాసన రావడం, స్పర్శ తగ్గి తిమ్మిర్లు రావడం, పాదం రంగు మారి అసాధారణంగా చల్లబడటం, గాయంతో పాటు జ్వరం, చలి, వణుకు రావడం – ఇవి కనిపిస్తే ఆలస్యం చేయకుండా నిపుణుడిని కలవాలని వైద్యులు సూచించారు. ఇవి ఇన్ఫెక్షన్ లేదా రక్తప్రసరణ లోపానికి సంకేతాలు కావచ్చు.

ప్రతిరోజూ పాటించాల్సిన జాగ్రత్తలు

పాద పరీక్షలో చర్మం, గోళ్లు, పాదం ఆకారం, స్పర్శ, రక్తప్రసరణను పరిశీలిస్తారు. రిస్క్‌ను బట్టి నెలకు ఒకసారి నుంచి ఆరు నెలలకు ఒకసారి పరీక్ష అవసరం అవుతుంది. ప్రతిరోజూ పాదాలను గోరువెచ్చని నీటితో కడిగి పూర్తిగా ఆరబెట్టుకోవాలి. ముఖ్యంగా వేళ్ల మధ్య తేమ లేకుండా చూసుకోవాలి. చెప్పులు వేసుకునే ముందు లోపల రాయి, ముల్లు, గుచ్చుకునే వస్తువు ఏదైనా ఉందేమో చూసుకోవాలి. ఇంట్లో కూడా చెప్పులు లేకుండా నడవకూడదు. బయట నడిచేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. షుగర్‌తో పాటు బీపీ, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవాలి. స్మోకింగ్ మానేయాలి. ఎందుకంటే స్మోకింగ్ వల్ల రక్తనాళాలు మరింత దెబ్బతింటాయి. పాదాలకు తగిన సాక్స్, మెత్తని, సరిపోయే చెప్పులు వాడాలి. కొత్త చెప్పులు వేసుకున్నప్పుడు మొదటి రోజుల్లో పాదాలను తరచుగా చూసుకోవాలి. వాస్క్యులర్ సర్జన్, డయాబెటిక్ ఫుట్ సర్జన్, గాయాల నిపుణులు కలిసి పనిచేస్తేనే ఈ సమస్యకు పూర్తి పరిష్కారం దొరుకుతుందని వైద్యులు తెలిపారు. సరైన సమయంలో చికిత్స అందితే ఇన్ఫెక్షన్, కాలు తొలగించే ముప్పును గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు.

భయపడాల్సిన అవసరం లేదు, జాగ్రత్తే ముఖ్యం

మధుమేహం ఉంటే పాద సమస్య వస్తుందని భయపడాల్సిన అవసరం లేదని, ముందస్తు జాగ్రత్తలు, క్రమం తప్పని పరీక్షలు, సకాలంలో చికిత్సతో చాలా సమస్యలను నివారించవచ్చని కేర్ వైద్యులు తెలిపారు. నొప్పి వచ్చే వరకు వేచి చూడకుండా చిన్న మార్పు కనిపించినా వెంటనే స్పందించాలని సూచించారు. పాదాలను రోజూ చూసుకునే అలవాటు, సరైన చెప్పులు, షుగర్ కంట్రోల్ – ఈ మూడు అలవాట్లు ఉంటే కాలును కాపాడుకోవచ్చని వైద్యులు చెప్పారు.


కేర్ హాస్పిటల్స్ గురించి:

కేర్ హాస్పిటల్స్ అనేది ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్‌లో భాగం. ఆస్టర్ డీఎం, కేర్ హాస్పిటల్స్, ఎవర్‌కేర్, కిమ్స్‌హెల్త్ అనే నాలుగు బ్రాండ్లతో 28 నగరాల్లో 39 ఆసుపత్రులు, 10,600కు పైగా పడకలతో సేవలు అందిస్తోంది. కేర్ హాస్పిటల్స్ గ్రూప్ హైదరాబాద్, భువనేశ్వర్, విశాఖపట్నం, రాయ్‌పూర్, నాగ్‌పూర్, ఇండోర్, ఔరంగాబాద్‌లో 17 కేంద్రాల్లో 33కి పైగా స్పెషాలిటీల్లో 3000కు పైగా పడకలతో సేవలందిస్తోంది.

నవంబర్ 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

- అన్ని ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్





వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నవంబర్ 19 నుంచి అమలు చేసేందుకు గ్రామాలు, పట్టణాల్లో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సంబంధిత అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ పథకాన్ని ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా తెలంగాణలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభిస్తారని, అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని వెల్లడించారు. నవంబర్ 14 నుంచి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు ప్రారంభించాలని, నవంబర్ 19న ప్రతి గ్రామం, పట్టణ వార్డులో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి కుటుంబాల వివరాలను సేకరించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. గ్రామాలు, మండలాలు, డివిజన్లు, పట్టణ వార్డుల స్థాయిలో నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి పథకం సమాచారం చేరేలా చూడాలన్నారు. నవంబర్ 18న ప్రతి గ్రామంలో టాంటాం ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, పంచాయతీ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రజలకు పథకంపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. కుటుంబ పెద్ద తమ కుటుంబానికి సంబంధించిన ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా ప్రతిపాదించే అవకాశం ఉంటుందని తెలిపారు.

జిల్లాలో ఏర్పాట్లు పకడ్బందీగా...

వీసీ అనంతరం జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ, నవంబర్ 19 నుంచి జిల్లావ్యాప్తంగా ప్రతి కుటుంబానికి ఈ పథకం అమలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, పట్టణ వార్డుల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి కుటుంబాల వివరాలను సేకరించాలని సూచించారు. కుటుంబానికి జీవిత బీమా రక్షణ కల్పించేందుకు 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ సభ్యుల వివరాలను కచ్చితంగా సేకరించాలని సూచించారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు. సేకరించిన దరఖాస్తులను డిజిటలైజేషన్ చేసి, అసలు దరఖాస్తులను జిల్లా స్థాయిలో భద్రంగా భద్రపరచాలని ఆదేశించారు. రాబోయే 15 నుంచి 20 రోజుల పాటు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి అర్హ కుటుంబానికి బీమా రక్షణ కల్పించేలా వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఆధార్ నంబర్లు, నామినీ వివరాలు, ఇతర సమాచారాన్ని నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జిల్లా స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పథకం అమలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, దరఖాస్తుల సేకరణ, డిజిటలైజేషన్, క్లెయిమ్‌ల పరిష్కారాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సీఎస్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ యాదయ్య, సీపీఓ హరికృష్ణ, సంబంధిత జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్వింటాల్‌కు 3,000 ధర కల్పించి, రూ. 500 బోనస్‌తో కలిపి రైతులకు రూ. 3,500 దక్కేలా చూడాలి.

- కనీస, గరిష్ట మద్దతు ధరల మధ్య తేడా తెలియని అజ్ఞాని రూరల్ ఎమ్మెల్యే!


- దినేష్ పటేల్ కులాచారి, బీజేపీ ఇందూర్ జిల్లా అధ్యక్షులు



నిజామాబాద్ నవంబర్13:(విజన్ ఆంధ్ర) నిజామాబాద్ బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీ దినేష్ పటేల్ కులాచారి గారు మాట్లాడుతూ.. ఇందూరు జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 5.35 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయడం జరిగింది. ఈసారి దిగుబడి ఆశాజనకంగా ఉండి రికార్డు స్థాయిలో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేయడం జరిగింది. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో పూర్తిగా ఆర్మూర్ సహా జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో సగం వరకు (దాదాపు 50%) పంట కోతలు పూర్తయి రైతులు తమ పంటను ఇప్పటికే సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లు, కమీషన్ ఏజెంట్లు, దళారులకు అమ్ముకున్నారు. ప్రారంభంలో పచ్చి సన్న వడ్లు క్వింటాల్‌కు రూ. 3,600 ధర పలకగా, ఇప్పుడు అమాంతం రూ. 2,700 కు పడిపోయింది. దీనివల్ల రైతులు తీవ్ర నష్టాలపాలవుతున్నారు. ఇంకా రైతుల వద్ద 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కనీసం 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేది. కానీ ఈసారి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల వద్ద కేవలం కొబ్బరికాయలు కొట్టి ఫొటోలకు ఫోజులిచ్చిందే తప్ప కనీస ఏర్పాట్లు చేయలేదు. రైతులకు అవసరమైన బస్తాలు, సుతిలి, ట్రాన్స్పోర్ట్ వంటి సదుపాయాలు కల్పించలేదు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్షలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, బాధ్యతను గాలికి వదిలేసింది. రైతులకు సన్న వడ్లపై ఇస్తామన్న బోనస్‌ను ఎగవేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో వరి బియ్యానికి విపరీతమైన డిమాండ్ ఉంది. ప్రభుత్వ మద్దతు ధర రూ. 2,460కి తోడు, రైతుల డిమాండ్ మేరకు రూ. 3,000 వరకు ధర కల్పించి.. దానికి రూ. 500 బోనస్ కలిపి మొత్తం రూ. 3,500 కు పైగా రైతులకు దక్కేలా చూడాలి. ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి రైతులు తమ పంటకు కనీస ధర దక్కడం లేదని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి దగ్గరికి వెళితే మీరా (మద్దతు ధర) కన్నా ఎక్కువగానే వస్తోంది కదా' అంటూ ఆయన బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం శోచనీయం. ఎమ్మెల్యే గారూ.. మీరా అంటే మినిమం సపోర్ట్ ప్రైస్ (కనీస మద్దతు ధర) అంతేగానీ మాక్సిమం సపోర్ట్ ప్రైస్ (గరిష్ట మద్దతు ధర) కాదు' అన్న కనీస జ్ఞానం ఆయన తెలుసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ ఎద్దేవా చేశారు. ఈ యొక్క సమావేశంలో నూతుల శ్రీనివాస్ రెడ్డి, బిలోజీ నాయక్ బొబ్బలి వేణు గోపాల్, పద్మరెడ్డి, నరేష్, అమంద్ విజయ్ కృష్ణ, ఎర్రం సుధీర్, బద్దం కిషన్, ఓం సింగ్, గంగారెడ్డి, వంశీ గౌడ్, శంకర్ రెడ్డి, రాజేశ్వర్, అనంద్, జగన్ రెడ్డి, అన్నం గోపి, బట్టురాఘవేందర్, మల్కాయ్ మహేందర్, మఠం పవన్ సుందర్ సింగ్ రాథోడ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు

బాలల హక్కుల రక్షణ, వ్యక్తిగత భద్రతపై విద్యార్థినులకు అవగాహన

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప కాసరగడ్డ



వనపర్తి జిల్లా ప్రతినిధి,నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) : బాలల హక్కుల రక్షణ, వ్యక్తిగత భద్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి దీప కాసరగడ్డ అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లాలోని మద్రికుంట ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ, విద్యార్థినులకు బాలల హక్కులు, భద్రత విషయాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, ఆన్‌లైన్ వేధింపులు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు వంటి అంశాలపై వివరంగా తెలియజేశారు. అదే విధంగా సోషల్ మీడియా యాప్‌ల పరిమిత వినియోగంపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిప్యూటీ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ డి.కృష్ణయ్య, పాఠశాల అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా సాగుతున్న అన్నప్రసాద వితరణ!

- నాలుగో రోజుకు చేరిన సేవా కార్యక్రమం!

కల్వకుర్తి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురు స్వామి ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో 41 రోజుల పాటు అన్నదానం!

శుక్రవారం దాతగా విజన్ ఆంధ్ర ఎడిటర్ నరేందర్!





కల్వకుర్తి, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర):

కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా సాగుతోంది. గురు స్వామి ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అన్నప్రసాద వితరణ నాలుగో రోజుకు చేరింది. కల్వకుర్తి మండలం చుట్టూ ఉన్న గ్రామాల నుంచి హనుమాన్ మాలలు, శివ మాలలు, అయ్యప్ప మాలలు వేసుకున్న స్వాములు పెద్ద సంఖ్యలో వెంకటేశ్వర స్వామి దేవాలయానికి చేరుకుని అన్నప్రసాద వితరణలో పాల్గొంటున్నారు. భక్తి భావంతో, క్రమశిక్షణతో స్వాములు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది.

ఐదేళ్లుగా 41 రోజుల పాటు నిర్విరామంగా!

దాతల సహకారంతో గత ఐదు సంవత్సరాలుగా మండల దీక్ష వ్యవధి అయిన 41 రోజుల పాటు ఈ అన్నప్రసాద వితరణను నిర్వహిస్తున్నట్లు గురు స్వామి ఆనంద్ గౌడ్ తెలిపారు. ప్రతి ఏటా దీక్షాపరులకు అన్నదానం చేయడం తమ సేవా భాగ్యంగా భావిస్తున్నామని అన్నారు.

అన్నదానం కంటే గొప్ప దానం లేదనే నమ్మకంతో దాతలు ముందుకు వచ్చి సహకరిస్తున్నారని, వారి సహకారం వల్లే ఈ కార్యక్రమం ఇంత ఘనంగా సాగుతోందని ఆయన పేర్కొన్నారు.

శుక్రవారం దాతగా విజన్ ఆంధ్ర ఎడిటర్ నరేందర్!

శుక్రవారం నాటి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని లివిజన్ ఆంధ్ర పత్రిక ఎడిటర్ నరేందర్‌లి దాతగా నిర్వహించారు. ఆయన సహకారంతో స్వాములకు రుచికరమైన, శుచికరమైన అన్నప్రసాదాన్ని అందించారు.

ఈ సందర్భంగా స్వాములు దాత నరేందర్ కుటుంబం చల్లగా ఉండాలని, ఆయనకు, ఆయన కుటుంబానికి స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా దీవించారు. దాతగా ముందుకు వచ్చిన నరేందర్‌కు గురు స్వామి ఆనంద్ గౌడ్, నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ముందుగా ఫోన్ చేసి సమాచారం ఇవ్వండి - గురు స్వామి విజ్ఞప్తి

అన్నప్రసాద వితరణకు వచ్చే స్వాములు ముందుగా ఫోన్ చేసి సమాచారం అందించాలని గురు స్వామి ఆనంద్ గౌడ్ కోరారు. ఎంతమంది వస్తున్నారో తెలిస్తే ఏర్పాట్లు సరిగ్గా చేసుకోవడానికి వీలవుతుందని చెప్పారు.

ఈ అన్నప్రసాద వితరణలో దాతలు కూడా ముందుకు వచ్చి సహకరించాలని ఆయన కోరారు. దాతల సహకారంతోనే మరిన్ని రోజులు, మరింత మందికి అన్నదానం చేయగలుగుతామని తెలిపారు.

భక్తి, సేవ, అన్నదానంతో కల్వకుర్తి వెంకటేశ్వర స్వామి దేవాలయం పరిసరాలు పుణ్యక్షేత్రాన్ని తలపిస్తున్నాయి.

ఆరు దశాబ్దాల అపురూప ఘట్టం..

కొండగట్టులో 'చందనోత్సవ' మహోద్భుతం!



- నవంబర్ 15న ఉత్సవాలకు శ్రీకారం..
- 16 నుంచి 20 వరకు శాస్త్రోక్తంగా చందనం తొలగింపు,
- మహా సంప్రోక్షణ నవంబర్ 21 నుంచి డిసెంబర్ 29 వరకు
- 40 రోజుల పాటు అంజన్న నిజరూప దర్శనం..
- నిత్యం 50 వేల మంది భక్తుల అంచనా
- 1965లో అలిశెట్టి కుంచెతో వెలుగులోకి వచ్చిన అసలు ఆకృతి..
- తలపై నరసింహస్వామి శిరస్సు, ముకుళిత హస్తాలతో అద్భుత దర్శనం
- కలెక్టర్ సత్యప్రసాద్ ప్రత్యేక ఆదేశాలు..
- 3 వైద్య శిబిరాలు, వేములవాడ జగిత్యాల మధ్య 8 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు







మల్యాల, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర):

ఉత్తర తెలంగాణ కొంగుబంగారమైన ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో 60 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడబోతోంది. సుమారు 500 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దివ్యక్షేత్రంలో ప్రతి పన్నెండేళ్లకు (పుష్కరానికి) ఒకసారి నిర్వహించాల్సిన చందనం తొలగింపు ప్రక్రియ, అనివార్య కారణాలతో నాలుగు పుష్కరాల పాటు నిలిచిపోయింది. ఎట్టకేలకు ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా 'చందనోత్సవం' నిర్వహించేందుకు దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం, ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ చారిత్రక మహోక్రతువుకు రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ఆహ్వానించనున్నారు.

అలిశెట్టి కుంచెతో వెలుగులోకి.. ఎక్కడా లేని నిజరూప విశిష్టత!

ఆలయంలో పూర్వం నుంచి ప్రతి శని, మంగళవారాల్లో స్వామివారి మూలవిరాట్టుకు చందన లేపనం చేస్తుండటంతో విగ్రహంపై 4 ఇంచుల నుంచి రెండడుగుల మేర దట్టమైన గంధం పొరలు పేరుకుపోయి అసలు రూపం కనిపించకుండా పోయింది. 1965 నాటి ఆనవాలు: సరిగ్గా 60 ఏళ్ల క్రితం 1965లో ఎలుకల బొరియల కారణంగా లేపనం దెబ్బతినడంతో అర్చకులు, ధర్మపురి వైదిక పండితులు తొలిసారి శాస్త్రోక్తంగా చందనాన్ని తొలగించారు. అప్పటివరకు స్వామివారి అసలు రూపురేఖలు భక్తులకు తెలియవు.

కాన్వాస్‌పై అపురూప ఆకృతి: ఆ సమయంలో సాక్షాత్కరించిన నిజరూపాన్ని ప్రముఖ చిత్రకారుడు అలిశెట్టి మహరాజ్ తన కుంచెతో కాన్వాస్‌పై చిత్రించారు. నేడు కోట్లాది మంది భక్తుల ఇళ్లలో పూజలందుకుంటూ విశేష ప్రాచుర్యం పొందింది ఆ రూపమే.

అరుదైన ఆకృతి: ప్రస్తుతం ఇద్దరు ముగ్గురు సీనియర్ సిద్ధాంత అర్చకులకు తప్ప ఈ తరం అర్చకులకు స్వామివారి నిజరూపం తెలియదు. ఆ చిత్రపటం ఆధారంగా.. దేశంలో ఎక్కడా లేని విధంగా కొండగట్టులో స్వామివారు తల భాగంపై నరసింహస్వామి శిరస్సు, ముకుళిత హస్తాలతో ఉత్తరం వైపు వెళు ్నట్లుగా కొలువై ఉంటారని అర్చకులు వివరిస్తున్నారు.

ఐదు రోజుల మహోక్రతువు.. బంగారు, వెండి సరాతాలతో ప్రక్రియ:

నవంబర్ 15న ఉత్సవాలకు శ్రీకారం చుట్టనుండగా, 16 నుంచి 20 వరకు ఐదు రోజుల పాటు యాగశాలల్లో నిత్య హోమాలు, శాస్త్రోక్త పూజల మధ్య చందనం తొలగిస్తారు.

ప్రత్యేక పనిముట్లు: పంచలోహాలతో తయారు చేయించి బంగారు, వెండి తాపడం వేయించిన రెండు ప్రత్యేక సరాతాలతో పాటు దేవతా వృక్షాలైన మామిడి, జువ్వి, మర్రి, రావి, మేడి వృక్షాల కలపతో చేసిన పనిముట్లను వినియోగిస్తారు.

పంచతీర్థ మహాభిషేకం: చందనం తొలగింపు పూర్తి కాగానే కృష్ణా, గంగా, తుంగభద్ర, కావేరి, గోదావరి నదుల పవిత్ర జలాలతో పాటు సముద్ర జలంతో మహా పంచామృత, పంచతీర్థ అభిషేకాలు నిర్వహిస్తారు.

వైదిక బృందం: బెంగళూరు, విజయవాడకు చెందిన ఇద్దరు జీయర్లగార్ల పర్యవేక్షణలో 90 మంది రుత్విక్కులు, 20 మంది అర్చకులు, నలుగురు వేదపండితులు, 111 మంది పాచకులు, పరిచారికలు ఈ మహోక్రతువులో పాల్గొంటారు.

బాలాలయంలో కొయ్య విగ్రహ దర్శనం.. రూ. 20 లక్షలతో జీర్ణోద్ధరణ:

చందనం తొలగించే ఐదు రోజుల పాటు గర్భగుడి తలుపులు మూసి ఉంచి, అన్ని రకాల ఆర్జిత సేవలను నిలిపివేయనున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు నిరాశ చెందకుండా ఆలయ మండపంలో (బాలాలయంలో) చెక్కతో ప్రత్యేకంగా రూపొందించిన 4 అడుగుల ఎత్తయిన స్వామివారి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి నిరంతర దర్శన సౌకర్యం కల్పిస్తారు. బేతాళస్వామి ఆలయంలో వాహన పూజలకు మాత్రమే అనుమతి ఉంటుంది.

మరోవైపు దేవాదాయ శాఖ కేటాయించిన రూ. 20 లక్షలతో ఆలయ మరమ్మతులు చేపట్టారు. ప్రధాన గర్భగుడి, వేంకటేశ్వరస్వామి ఆలయంపై సుదర్శన చక్రాలు, రాజగోపురంపై 5, ఉత్తర ద్వార గోపురంపై 3, అమ్మవారి గర్భగుడిపై ఒక కలశాన్ని ప్రతిష్ఠించనున్నారు. శిథిలావస్థకు చేరిన దేవతామూర్తుల విగ్రహాలకు శిల్పులతో మరమ్మతులు చేయిస్తున్నారు.

40 రోజుల పాటు నిజరూప దర్శనం.. ?

కలెక్టర్ సత్యప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు:

ఆలయ సంప్రోక్షణ అనంతరం నవంబర్ 21 నుంచి డిసెంబర్ 29 వరకు (40 రోజుల పాటు) వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు స్వామివారి నిజరూప దర్శన భాగ్యం కలుగుతుంది. ఈ 40 రోజుల పాటు కేవలం స్వామివారి పాదాలకు మాత్రమే చందనం పూయనుండగా, డిసెంబర్ 29న తొలి విడతగా పూర్తి స్థాయిలో చందనంతో అలంకరణ ఉంటుందని అర్చకులు పేర్కొన్నారు.

భారీ రద్దీ అంచనా: కార్తీక మాసం కావడంతో సాధారణ రోజుల్లో 10 వేలు, మంగళ, శని, ఆదివారాల్లో 20 వేలు, పర్వదినాల్లో 2530 వేల మంది భక్తులు వస్తుండగా.. నిజరూప దర్శనం వేళ రోజుకు సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలు: భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్ని శాఖలను అప్రమత్తం చేశారు. ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాల్లో చలువ పందిళ్లు, నిరంతర తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణకు ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో మూడు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రత్యేక బస్సులు: రద్దీకి అనుగుణంగా వేములవాడ నుంచి జగిత్యాలకు వెళ్లే బస్సుల్లో ఎనిమిది ఆర్టీసీ బస్సులను కొండగట్టు మీదుగా నడిపేలా ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

పారదర్శకతపై ఆకాంక్ష: గతంలో బేతాళస్వామి ఆలయ చందనోత్సవంలో దాతల నిధుల వినియోగంపై వివాదాలు తలెత్తిన నేపథ్యంలో, ఈసారి నిధుల లెక్కల్లో సంపూర్ణ పారదర్శకత పాటించాలని భక్తజనం కోరుతున్నారు.


చెత్తకు పట్టిన చీడ..

మంచిర్యాలకు తప్పని పీడ!

- ఆసుపత్రులు, హోటళ్ల వ్యర్థాల మాటున అక్రమ దందా..!
- యూజర్ ఛార్జీలఎగవేత..
- నరక కూపాలుగా మారిన పురవీధులు, నాలాలు..
- గాల్లో కలిసిన ఎన్నికల హామీలు.

మంచిర్యాల (ప్రతినిధి),
నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) :

మంచిర్యాల జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. రోగం వస్తే ప్రైవేట్ ఆసుపత్రులు బాదే బాదుడుకు సామాన్యుడి పరిస్థితి వాడి పారేసిన సిరంజిలా, తీసి పారేసిన గ్లూకోజ్ సీసాలా మారుతుంటే.. మరోవైపు ఆసుపత్రులు, హోటళ్ల నుంచి వెలువడే ప్రమాదకర వ్యర్థాల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలు పట్టణ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. పేషెంట్ల వద్ద ముక్కుపిండి బిల్లులు వసూలు చేసే ప్రైవేట్ దవాఖానాలు, హోటళ్ల యాజమాన్యాలు నిబంధనల ప్రకారం కార్పొరేషన్‌కు కట్టాల్సిన యూజర్ ఛార్జీలను నిస్సిగ్గుగా ఎగ్గొడుతున్నాయి. ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసి, ప్రైవేట్ వ్యాపారులకు అధికారులు 'ఆశీస్సులు' అందజేస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



బయోమెడికల్ వేస్ట్.. దారి మళ్లింపు దందా

మంచిర్యాల పట్టణానికి నిత్యం ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి వందలాది మంది రోగులు వస్తుంటారు. సాధారణంగా ఇక్కడి ఆసుపత్రుల బయోమెడికల్ వ్యర్థాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం 'సీబీఎండబ్ల్యూటీఎఫ్' (జడీవీఔఖీ) ఏజెన్సీ సేకరించి, అత్యంత శాస్త్రీయంగా ఇన్సినరేటర్లలో నిర్వీర్యం చేయాలి. అయితే, ఆ ఏజెన్సీ కరీంనగర్ నుంచి ఇక్కడికి రావడం లేదన్న సాకుతో.. మున్సిపల్ సిబ్బందే ఆ అత్యంత ప్రమాదకరమైన హజార్డస్ వ్యర్థాలను తరలిస్తున్నారు. గతంలో హోటల్, హాస్పిటల్ వేస్టేజీని సేకరించి డిస్పోజ్ చేసే బాధ్యతను ఒక ప్రైవేట్ కాంట్రాక్టర్ తీసుకున్నారు. ఆయనకు 2033 వరకు అనుమతి ఉన్నప్పటికీ, ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సదరు కాంట్రాక్టు రద్దు చేసారు, ఇది ఇలా ఉంటే అత్యంత ప్రమాద కార వ్యర్థాలు సేకరించే వాహనం వచ్చిన దాకలాలు లేవు,ఆ తర్వాత ఆ వ్యర్థాలను మున్సిపల్ యంత్రాంగం ఎక్కడికి తరలిస్తోంది? ఎలా నిర్వీర్యం చేస్తోందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.ఈ విషయం పైన అధికారుల స్పందన కోరగా సరైన సమాధానం తెలుపలేక పోతున్నారు...



హోటళ్ల మాటున చీకటి వసూళ్లు.. జవాన్ల కనుసన్నల్లో ప్రైవేట్ దందా

మంచిర్యాలలోని హోటళ్ల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు హోటళ్లు, బిర్యానీ సెంటర్లపై దాడులు చేస్తూ కల్తీని అరికడుతుంటే.. మంచిర్యాలలో మాత్రం అధికారులకు ఉలుకూ పలుకూ లేకుండా పోయింది. నాలాలను ఆక్రమించి, కనీస పరిశుభ్రత పాటించకుండా, దుర్వాసన వెదజల్లే కిచెన్లలో నాసిరకం పదార్థాలతో ఆహారాన్ని వడ్డిస్తున్నారు. ఇక వీటి వ్యర్థాల సేకరణలో సరికొత్త దందా నడుస్తోంది. మున్సిపల్ కార్మికులు రానప్పుడు జవాన్ల ఆధ్వర్యంలో ప్రైవేట్ వ్యక్తులకు రోజుకు ₹00 బత్తా ఇచ్చి హోటళ్ల వ్యర్థాలను ఎత్తిస్తున్నారు. దీనికిగాను ఒక్కో హోటల్ నుంచి రోజుకు సుమారు ₹,000 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారన్న తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఈ రకంగా ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన యూజర్ ఛార్జీలకు భారీగా గండి కొడుతూ, ప్రైవేటుగా జేబులు నింపుకుంటున్నా ఉన్నతాధికారులు కళ్లుండి చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.



కాలనీల్లో 10 రోజులైనా రాని బండ్లు..
ఆసుపత్రుల ముందు మాత్రం టంచనుగా!

కార్పొరేషన్‌లో మొత్తం 22 ట్రాక్టర్లు ఉండగా, . ఇక ఇళ్ల నుంచి చెత్త సేకరించే బండ్ల వేరేగా ఉన్న వాటి పరిస్థితి వర్ణనాతీతం. అవి స్పీడ్ బ్రేకర్లను కూడా ఎక్కలేవు, ఓవర్ లోడ్ అయి మొరాయిస్తాయి. కాలనీల్లోకి పది రోజులకు ఒకసారి వచ్చే ఈ బండ్లు రోడ్లకు ఇరువైపులా, ఇళ్ల వాకిళ్లపై చెత్తను చల్లుకుంటూ వెళ్తున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో గృహస్తులే మళ్లీ చీపుర్లు పట్టి నాలాల్లో చెత్తను నెట్టేస్తున్నారు. కాలనీల్లో ప్రజల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. మున్సిపల్ వాహనాలు మాత్రం ప్రైవేట్ ఆసుపత్రుల ముందు నిత్యం ఉదయాన్నే టంచనుగా వాలిపోయి అత్యుత్సాహం ప్రదర్శించడం వెనుక అంతర్యం ఏమిటని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు.



గాల్లో కలిసిన ఎన్నికల హామీలు.. నాలాల చెత్త రోడ్ల పైనే!

ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యాన్నే మెయిన్ ఎజెండాగా మార్చుకున్నారు. నాలాల్లో పూడిక తీసిన రోజే ప్రత్యేక వాహనాలతో ఆ వ్యర్థాలను అక్కడికక్కడే తరలిస్తామని, రోడ్లపై వేయబోమని హామీలిచ్చి ఓట్లు దండుకున్నారు. తీరా గెలిచాక ఆ హామీ మూడు నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. నాలాల నుంచి తీసిన మురికి, వ్యర్థాలను రోడ్ల పక్కనే కుప్పలుగా పోసి వారం రోజుల పాటు వదిలేస్తున్నారు. పిల్లలు ఆడుకుంటూ, నడుచుకుంటూ ఆ మురికిని తొక్కుకుంటూ ఇళ్లలోకి వెళ్తుండటంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి.

విష వాయువుల వలయంలో మంచిర్యాల

ఆసుపత్రుల ప్రమాదకర వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా డంపింగ్ యార్డుకు తరలించి సాధారణ చెత్తతో కలిపి దహనం చేస్తుండటంతో ప్రమాదకరమైన రసాయన అణువులు గాలిలో కలిసిపోతున్నాయి. దీనికితోడు డంపింగ్ యార్డు నుంచి వచ్చే నల్లటి పొగ కారణంగా సాయంత్రం 6 గంటల నుంచి వేకువజాము దాకా మంచిర్యాల, రాళ్లపేట, రంగంపేట, గ్రీన్ సిటీ, అండాలమ్మ కాలనీ, పవర్ సిటీ వాసులు విషవాయువులను పీల్చి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తీవ్రమైన శ్వాసకోశ, చర్మ వ్యాధుల బారిన పడుతున్నారు.

ఐదేళ్ల పాటు ప్రజలు నెత్తీ నోరు మొత్తుకున్నా పాలకులకు, అధికారులకు పట్టడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడి.. ప్రైవేట్ ఆసుపత్రులు, హోటళ్ల యాజమాన్యాల నుంచి పక్కాగా యూజర్ ఛార్జీలు వసూలు చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని పట్టణానికి పట్టిన ఈ పారిశుద్ధ్య చీడను వదిలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అసిస్టెంట్ కమీషనర్ మున్సిపల్ కార్పొరేషన్ మంచిర్యాల :జి రాజు



సదరు కాంట్రాక్టర్ కార్పొరేషన్ తీర్మానం చేసి రద్దు చేయడం జరిగిందని సేకరించి డిస్గ్ను చేసే పని ఒక ఏజెన్సీ కి అప్పాజెప్పింది ప్రభుత్వం, కానీ వారు మన దగ్గర కు రాకపోవడం తో కార్పొరేషన్ సిబ్బందే వ్యర్థలను తరలిస్తున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.